RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

| బుధవారం | సంపుటి : 11 | పేజీలు : 12 |
|---|---|---|
| 01.01.2025 | సంచిక : 174 | వెల: రూ. 4/- |

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698







## విశ్వవ్యాప్తంగా అంబరాన్నంటిన సంబరాలు

- కొత్త అడుగుల్లోకి ప్రవేశించిన ప్రపంచం
- ఇక చరిత్రలోకి జారుకున్న 2024
- నూతన సంవత్సరంలోకి తొలిగా కిరిబాటి దీవులు
- తరవాత క్రమంలో న్యూజిలాండ్ ప్రవేశం

ప్రపంచ దేశాలకు కొత్త అధినేతలను తీసుకొచ్చిన 2024 ఇక చరిత్రగా మిగలనుంది. అది అందించిన జ్ఞాపకాలను మదిలో పదిలం చేసుకొని.. కొత్త అడుగులు వేయడానికి ప్రపంచం సిద్ధం అవుతోంది. అయితే మనకంటే ముందే కొన్ని దేశాలు కొత్త ఏడాదిని ఆహ్వానించాయి. పసిఫిక్ మహా సముద్రంలోని కిరిబాటి దీవుల్లోని ప్రజలు అందరికంటే ముందే నూతన సంవత్సరాన్ని స్వాగతించారు. తర్వాత న్యూజిలాండ్‌కు చెందిన చాతమ్ ఐలాండ్స్ 2025లోకి ప్రవేశించింది. న్యూజిలాండ్ వాసులు కూడా 2025లోకి అడుగుపెట్టారు. భారత్‌లో కాలమానం ప్రకారం సాయంత్రం 4.30 గంటలకు ఆ దేశం కొత్త ఏడాదిని స్వాగతించింది. ఆనందోత్సాహాల మధ్య ప్రజలు నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు

వివరాలు 2లో



# 4న తెలంగాణ కేబినెట్ భేటీ

## రైతు భరోసా, పేదలకు నగదు, కొత్త రేషన్ కార్డులపై చర్చ



**యాదగిరిగుట్ట బోర్డు నియామకంపైనా సమాలోచనలు**

**ముఖ్యమంత్రి రేవంత్ అధ్యక్షతన సచివాలయంలో భేటి కానున్న మంత్రివర్గం**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణరాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జనవరి 4న సాయంత్రం 4గంటలకు సచివాలయంలో జరగనుంది. రైతు భరోసా, భూమిలేని పేదలకు నగదు, కొత్త రేషన్ కార్డులు, టూరిజం పాలసీపై చర్చించే అవకాశముంది. సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో రైతు భరోసాపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశముంది. కొత్త రేషన్ కార్డులకు ఆదాయ పరిమితి, దరఖాస్తుల స్వీకరణపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం లబ్దిదారులకు సబ్సిడీ రేట్లతో ఇసుక, సిమెంట్, స్టీల్ సరఫరా చేయాలన్న ప్రతిపా దనపై కేబినెట్ చర్చించనున్నట్లు సమాచారం. విద్యుత్ కమిషన్, బీసీ డెడికేటెడ్

మిగతా 2లో..

# రికార్డు స్థాయిలో ఆయకట్టును సృష్టిస్తాం

**ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తాం ● హామీల అమలులో చిత్తశుద్ధితో ముందుకెళ్తున్నాం**

- ఏడాది ప్రజాపాలనలో ప్రజలకు అంతా మంచే చేస్తున్నాం
- ఎస్ఎల్‌బిసి ప్రాజెక్ట్‌తో 4 లక్షల ఎకరాలకు నీరు
- దశాబ్దాల కలను నెరవేర్చడంలో అశ్రద్ధ వద్దు
- కేసీఆర్ హయాంలో తెలంగాణలో ఒక్క ప్రాజెక్ట్ పూర్తి కాలేదు
- నల్లగొండ ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణకు 2024లో చాలా మంచి జరిగిందని.. ప్రజాపాలనలో ప్రజలకు మంచి చేశామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామిల విషయంలో చిత్తశుద్ధితో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. నీటిపారుదల శాఖ, పౌర సరఫరాల శాఖలో పూర్తి పారదర్శకత విధానాలు అమలు చేస్తున్నామన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేలా ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వివరించారు. నల్గొండ లోకసభ స్థానం పరిధిలోని నీటిపారుల ప్రాజెక్టులపై జలసౌధలో మంత్రి కోమటిరెడ్డి

మిగతా 2లో..

### సీఎంతో సమావేశంపై కేటీఆర్ వ్యాఖ్యలు

# సరికాదు

**ముఖ్యమంత్రితో చర్చల్లో రహస్యమేమీ లేదు**

**సినీ ప్రముఖుల భేటీ అంతా బహిరంగంగానే జరిగింది**

**ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు ఆవేదన**



**హైదరాబాద్(జనంసాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తో జరిగిన తెలుగు చిత్ర పరిశ్రమ సమావేశంపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు బాధాకరమని ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు అన్నారు. సిఎం రేవంత్‌తో జరిగిన సమావేశం అందరికి తెలిసిందేనని అన్నారు. ఇందులో రహస్యం ఏదీ లేదని అంటూ..ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. 'సీఎంతో జరిగిన సమావేశం ఒకరిద్దరితో చాటుమాటున జరిగిన వ్యవహారం కాదు.. అందరికీ తెలిసే జరిగింది. తెలుగు చిత్రపరిశ్రమ బాగోగుల గురించి అత్యంత స్నేహపూర్వకంగా, ఎలాంటి దాపరికాలు లేకుండా జరిగిన ఈ సమావేశం పట్ల చిత్రపరిశ్రమ చాలా సంతృప్తిగా ఉంది. తెలంగాణ అభివృద్ధి పయనంలో చిత్రపరిశ్రమ భాగస్వామ్యాన్ని గుర్తించి.. రాష్ట్రాభివృద్ధికి, సామాజిక సంక్షేమానికి, మా బాధ్యతగా తగిన సహకారం అందజేయాలని సీఎం కోరారు. హైదరాబాద్‌ను గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దాలనే సీఎం బలమైన

మిగతా 2లో..

### తుది తీర్పు వచ్చే వరకు

# కేటీఆర్‌ను అరెస్టు చెయ్యొద్దు

- మధ్యంతర ఉత్తర్వులను పొడిగించిన హైకోర్టు
- ఫార్ములా-ఈ రేసు కేసులో ముగిసిన విచారణ



**హైదరాబాద్(జనంసాక్షి):** ఫార్ములా-ఈ రేసు వ్యవహారంపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ ముగిసింది. తీర్పు ఇచ్చే వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని ఆదేశిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు పొడిగించింది. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై గత విచారణ సందర్భంగా .. ఈనెల 30 వరకు అరెస్టు చేయొద్దని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. కేటీఆర్‌పై ఏసీబీ నమోదు చేసిన కేసులో దర్యాప్తు కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. పది రోజుల్లో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ధర్మాసనం ఈనెల 27కి వాయిదా వేసింది. ఆ తర్వాత విచారణ 31కి వాయిదా పడింది. తాజాగా ఇరు వైపులా వాదనలు ముగియగా.. కేటీఆర్ పిటిషన్‌పై తీర్పును రిజర్వు చేసింది. తీర్పు ఇచ్చే వరకు అరెస్టు చేయొద్దని మధ్యంతర ఉత్తర్వులు పొడిగించింది. ఏసీబీ తరపున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు.

మిగతా 2లో..

### కేటీఆర్‌ను ఓ రెండు రోజులు ఎంజాయ్ చేయనీయండి

**మంత్రి కోమటిరెడ్డి వ్యంగ్యాస్త్రాలు**

**హైదరాబాద్(జనంసాక్షి):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆసక్తికర వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ రెండు రోజులు ఎంజాయ్ చేయనివ్వండి అని అన్నారు. కొత్త సంవత్సరం రోజు కేటీఆర్‌ను బాధ పెట్టకండి అని చెప్పారు. న్యూ ఇయర్ రోజు ఎంజాయ్ చేయనీయాలని అన్నారు. కేటీఆర్ గురించి 3, 4 వ తేదీల్లో చూద్దామని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. జలసౌధలో మంగళవారం నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రులు

మిగతా 2లో..

### పట్నం నరేందర్ రెడ్డికి

# మళ్లీ నోటీసులు

**బొంరాస్ పేట కేసులో తాఖీదులు జారీ చేసిన పోలీసులు**

**వికారాబాద్(జనంసాక్షి):** బీఆర్ఎస్ నేత, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి బొంరాస్ పేట పోలీసులు నోటీసులు జారీ చేశారు. కాంగ్రెస్ నేత శేఖర్‌పై రోటిబండ తండా వాసుల దాడి ఘటనలో విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. జనవరి 2వ తేదీన బొంరాస్ పేట పీఎస్‌కు రావాలని పోలీసులు ఆదేశించారు. ఈ కేసులో పోలీసులు అరెస్ట్ చేయకుండా పట్నం నరేందర్ రెడ్డి ఇప్పటికే ముందస్తు

### కేరళ నర్సుకు క్షమాభిక్షకు

# నో

**తిరస్కరించిన యెమెన్ దేశ అధ్యక్షుడు**

**హత్య కేసులో ఉరిశిక్ష యథాతథం**

**విడిపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్న భారత అధికారులు**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** యెమెన్ దేశంలో అక్కడి వ్యక్తిని హత్య చేసిన కేసులో దోషిగా తేలి ఉరిశిక్ష పడిన భారతీయ నర్సు నిమిషా ప్రియకు ఆ దేశ అధ్యక్షుడి కరుణ దక్కలేదు. ఆమె పెట్టుకున్న క్షమాభిక్ష పిటిషన్‌ను

మిగతా 2లో..

### మౌళిక సదుపాయాలపై

# మూకుమ్మడిదాడులు

**ఉక్రెయిన్ పాఠశాలలు, వైద్యసదుపాయాలు, నివాస భవనాలే లక్ష్యంగా రష్యా ధ్వంసరచన**

**తాజా షోస్ట్కా నగరానికి సమీపంలో దాడులు**



**కీవ్(జనంసాక్షి):** ఉక్రెయిన్‌పై రష్యా దాడుల ఉద్ధృతి కొనసాగుతోంది. కొత్త సంవత్సరం సమీపిస్తున్న వేళ ఉక్రెయిన్‌పై భారీస్థాయిలో బాలిస్టిక్ క్షిపణులతో మరోసారి విరుచుకుపడింది. కీవ్‌తో పాటు మరికొన్ని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని రష్యా భారీగా క్షిపణులు, డ్రోన్‌లను ప్రయోగించినట్లు ఉక్రెయిన్ వైమానిక దళ అధికారులు పేర్కొన్నారు. ఈ దాడుల్లో షోస్ట్కా నగరానికి సమీపంలో ఉన్న పలు నివాస భవనాలు, పాఠశాలలు, వైద్యసదుపాయాలు దెబ్బతిన్నాయని వెల్లడించారు. కాగా రష్యా దాడుల్లో తమ దేశంలోని దాదాపు సగం మౌలిక సదుపాయాలు నాశనమయినట్లు అధికారులు పేర్కొన్నారు. పలు పాశ్చాత్య మిత్రదేశాలు తమకు వాయు రక్షణ వ్యవస్థలను అందించాయని తెలిపారు. వాటి సహాయం తో రష్యా డ్రోన్లను ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. కాగా ఉక్రెయిన్ ప్రయోగించిన 68 డ్రోన్లను మంగళవారం తెల్లవారుజామున కూల్చివేసినట్లు రష్యా అధికారులు పేర్కొన్నారు. డ్రోన్ శకలాలు చమురు డిపో భూభాగంలో పడడంతో మంటలు చెలరేగాయని అన్నారు. రష్యా గత కొన్ని నెలలుగా ఉక్రెయిన్‌లోని మౌలికసదుపాయాలపై భారీ దాడులు చేస్తోంది. క్రిస్మస్ పర్వదినాన కూడా ఉక్రెయిన్‌లోని పలు విద్యుత్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని పుతిన్ సేనలు విరుచుకుపడ్డాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు.

### మన్మోహన్ భార్య గురుశరణ్ కౌర్‌కు భద్రత

# కొనసాగింపు

**కీలక ప్రకటన విడుదల చేసిన కేంద్రం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఇటీవల మృతి చెందిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ భార్యకు జడ్ ప్లస్ భద్రత కొనసాగించడంపై కేంద్ర ప్రభుత్వం మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. మన్మోహన్ సింగ్ భార్య గురుశరణ్ కౌర్‌కు జడ్ ప్లస్

మిగతా 2లో..



### మణిపూర్ అల్లకల్లోలంపై

# సీఎం బీరేన్ సింగ్ బహిరంగ క్షమాపణలు

**విచారణ వ్యక్తం చేసిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి**

**ఇంఫాల్(జనంసాక్షి):** ఈ ఏడాది అంతా ఎంతో కష్టంగా గడిచిపోయింది. చాలామంది తమ కుటుంబాలను కోల్పోయారు. మరికొందరు వారి ఇళ్లను వదిలి వెళ్లాల్సి వచ్చింది. 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిస్థితిపై చింతిస్తున్నాను అని మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్ ప్రజలను క్షమాపణలు కోరారు. గత మే నుంచి నేటి వరకు రాష్ట్రంలోని పరిణామాల విషయంలో ప్రజలను క్షమాపణలు కోరుతున్నా' అని సీఎం మీడియా ఎదుట పేర్కొన్నారు. జాతుల మధ్య వైరంతో మణిపుర్‌లో అల్లకల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలోని ఉద్రిక్త పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్ మరోసారి స్పందించారు. ఈ ఏడాదంతా దురదృష్టకరంగా గడిచిందని.. అందుకు రాష్ట్ర ప్రజలను క్షమాపణలు కోరారు. 'రాష్ట్రంలో 12 వేలకు పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. 625 మంది నిందితులు అరెస్టయ్యారు. 5,600 ఆయుధాలు, 35 వేల మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత మూడు, నాలుగు నెలలుగా రాష్ట్రంలో

మిగతా 2లో..


### ఫీజుల నియంత్రణ కోసం

# ప్రత్యేక చట్టం

**ఈ విషయమై ప్రభుత్వానికి సిఫార్సు చేస్తాం**

**ఏటా ఫీజుల పెంపుతో విద్యార్థులపై భారం**

**మాతృ భాష నేర్చుకోవాలి కానీ.. మాతృ భాషలోనే బోధన అంటే కరెక్ట్ కాదు: విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి**



**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రైవేట్ విద్యా సంస్థలను ఈ ప్రభుత్వం నియంత్రిస్తుందని విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ అన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలు ప్రతి ఏడాది ఫీజు పెంచులను కోవడం సమంజసం కాదన్నారు. ఫీజుల నియంత్రణ కోసం చట్టం తీసుకురావాలని, ప్రభుత్వానికి తాము సిఫార్సు చేస్తున్నామని తెలిపారు. పిర్యాదులు స్వీకరణ పరిష్కారం కోసం అధికారాలతో కూడిన ఒక ప్రత్యేక వ్యవస్థ ఉండాలన్నారు. మాతృ భాష నేర్చుకోవాలి కానీ.. మాతృ భాషలోనే బోధన అంటే కరెక్ట్ కాదని ఆకునూరి మురళీ పేర్కొన్నారు. 'ప్రైవేట్ విద్యా సంస్థలను ఈ ప్రభుత్వం నియంత్రిస్తుంది. ఫీజుల నియంత్రణ కోసం చట్టం తీసుకురావాలి. ఈ విషయమై ప్రభుత్వానికి సిఫార్సు చేస్తున్నాం. ప్రైవేట్ విద్యా సంస్థలను స్ట్రీమ్ లైన్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారు. ప్రైవేట్ స్కూల్స్ అసంబద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఒక స్కూల్లో అప్లికేషన్ ఫీజు రూ.4,500గా ఉంది. స్కూల్స్ సేల్స్ యాక్టివిటీ నుండి పూర్తిగా బయటకు రావాలి. ప్రభుత్వం

మిగతా 2లో..

### భగీరథమ్మ చెరువులో

# ఆక్రమణల కూల్చివేత

**ఫిర్యాదు అందిన వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా**

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ ఖాజాగూడ భగీరథమ్మ చెరువులోని అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. బఫర్ జోన్ లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కుల్చివేస్తున్నారు ఖాజాగూడా భగీరథమ్మ చెరువు ఆక్రమణలపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఇటీవలే భగీరథమ్మ చెరువులోని ఆక్రమణలను పరిశీలించారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. ఈ క్రమంలో డిసెంబర్ 31న బఫర్

మిగతా 2లో..



## తుది తీర్పు వచ్చే వరకు కేటీఆర్‌ను అరెస్టు చెయ్యొద్దు

ఫార్ము లా – ఈ రేసు వ్యవహారంలో ఒప్పందం జరగ`కముందే చెల్లింపులు చేశారని ఆయన కోర్టుకు తెలిపారు. బ్రిటన్ పౌండ్ల రూపంలో రూ.46 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. ఈ – కార్ల రేసిం గ్ సీజన్ 10 ఒప్పందానికి ముందే నిబంధన లకు విరుద్ధంగా చెల్లింపులు చేశారన్నారు. ద ర్యాప్తు ఏ దశలో ఉందని ఈ సందర్భంగా ఏజీ ని హైకోర్టు ప్రశ్నించింది. కేసు విచారణ ప్రాథ మిక దశలోనే ఉందని.. అన్ని ఆధారాలు బయ టపడతాయని ఏజీ తెలిపారు. ఇప్పటికే ఫిర్యాదు దారు దానకిశోర్ వాంగ్మూలం సేకరించినట్లు కోర్టుకు తెలిపారు. నిందితులు అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఏమైనా పిటిషన్లు దాఖలు చేశారా అని న్యాయస్థానం అడిగింది. ఇప్పటివరకు నిందితులు ఎలాంటి పిటిషన్లు దాఖలు చేయలేదని, ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని ఏజీ తెలిపారు. గవర్నర్ అనుమతి తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ధర్మాసనానికి ఏజీ తెలిపారు. దానకిశోర్ తరఫున సీనియర్ న్యాయవాది సీపీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పురపాలక శాఖ మంత్రి పర్యవేక్షణలోనే ఆ శాఖ అధికారులు విధులు నిర్వహిస్తారన్నారు. రేసింగ్‌కు సంబంధించిన చెల్లింపుల దస్త్రాన్ని అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆమోదించారని కోర్టుకు తెలిపారు. రేసింగ్ వ్యవహారంలో అన్ని రకాల నిబంధనలను ఉల్లంఘించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

## కేటీఆర్‌ను ఓ రెండు రోజులు ఎంజాయ్ చేయనీయండి

ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నల్గొండ పార్లమెంటు పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులపై సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. నల్గొండ ప్రజల దశాబ్దాల కల ఎస్ఎల్‌బీసీప్రాజెక్ట్ అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే కాంట్రాక్టర్లు పనిచేయరని హెచ్చరించారు. కాంట్రాక్టర్ పని చేయకపోతే సంబంధిత మంత్రికి చెప్పాలన్నారు. దయచేసి అధికారులు కంటితుడుపు పనులు చేసే ప్రయత్నం చేయొద్దని వార్నింగ్ ఇచ్చారు. అధికారులు సీరియస్‌గా పని చేస్తే అనుకున్న సమయానికి ప్రాజెక్ట్ పూర్తి చేయొచ్చని చెప్పారు. నల్గొండను రాబోయే నాలుగేళ్లలో ఉభయ గోదావరి జిల్లాలను మించి సస్య శ్యామలం చేస్తామని అన్నారు. ఆంధ్ర పాలకులే నల్గొండకు న్యాయం చేశారని చెప్పారు. పదేళ్లు నల్గొండ జిల్లాకు బీఆర్ఎస్ అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. వేముల ప్రశాంత్ రెడ్డి ఫామ్ హౌస్‌కు, ప్రగతి భవన్‌కు మంత్రిగా పనిచేశారని విమర్శించారు. ఆయనకు రోడ్ల గురించి ఏం తెలుసు అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎద్దేవా చేశారు.

## రైతు భరోసాపై విధివిధానాలపై చర్చిస్తున్నాం

### మంత్రి తుమ్మల

**ఖమ్మం(జనంసాక్షి):** రైతు భరోసా మీద తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతు భరోసా మీద ఎలాంటి నిబంధనలు కానీ పంట వేయనటువంటి రైతులను తగ్గించటం కోసం చేసే ప్రయత్నం కానీ తమ ప్రభుత్వం ఇంత వరకు ఏ విధమైన ఆలోచన చేయలేదని అన్నారు. కేబినెట్ సబ్ కమిటీ కేవలం విధి విధానాల మీద చర్చించడం మాత్రమే చేశామన్నారు. సత్తుపల్లి శివారు వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ఏడాది పాలనలో రూ. 21 వేల కోట్ల రుణామాఫీ, రూ.7,625 వేల కోట్ల రైతు బంధు, రూ. 3 వేల కోట్ల రైతు భీమా ఇచ్చిందని ప్రకటించారు. సన్న ధాన్యానికి బోనస్ ఇచ్చామని స్పష్టం చేశారు. పంట వేసిన ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలనేదే స్థూలంగా తమ ప్రభుత్వం ఆలోచన అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ నిమిషం వరకు రైతు భరోసాపై ఎలాంటి నిర్ణయం చేయనటువంటి ప్రభుత్వంపై ప్రసార సాధనాల ద్వారా కానీ ప్రతి పక్షాలు దుష్ప్రచార చేసే ఆలోచన చేయొద్దని తెలిపారు. రైతు భరోసాపై తాము చేసిన చర్చల ఫలితాలను కేబినెట్‌లో పెడతామని అన్నారు. రైతు భరోసాపై కేబినెట్ నిర్ణయమే తుది నిర్ణయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

### దల్లేవాల్‌కు వైద్య సాయం

## మరింత గడువు కోరిన పంజాబ్ ప్రభుత్వం

### జనవరి 2కు విచారణ వాయిదా వేసిన సుప్రీం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** రైతుల డిమాండ్ల సాధనకై రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ గత 36 రోజులుగా అమరణ నిరహార దీక్ష కొనసాగిస్తున్నారు. దీంతో ఆయన ఆరోగ్యం రోజు రోజుకు క్షీణిస్తుండటం తో తగిన వైద్య సహాయం అందించాలని డిసెంబర్ 20న సుప్రీంకోర్టు పంజాబ్ సర్కార్ కి ఆదేశాలు జారీ చేసింది. దల్లేవాల్‌కు వైద్య సహాయం అందించడానికి తమకు మరింత సమయం కావాలని ప్రభుత్వం కోరడంతో.. దానికి ఒప్పుకున్న న్యాయస్థానం తదుపరి విచారణను జనవరి 2వ తేదీకి వాయిదా వేసింది.అయితే, పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్లతో నవంబర్ 26 నుంచి జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ పంజాబ్– హర్యానా సరిహద్దులోని ఖనౌరీ శిబిరం దగ్గర దీక్ష చేపట్టారు. దీంతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండటంతో తక్షణమే వైద్య సహాయం అందించాలని అత్యున్నత న్యాయస్థానం అక్కడి ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చింది. కానీ, దల్లేవాల్‌కు వైద్యం అందించడానికి వెళ్తే రైతు సంఘాలు అడ్డుకుంటున్నాయి.. కనీసం ఐవీ ఫ్లూయిడ్స్‌నైనా ఇవ్వడానికి అవకాశం రావడం లేదని సుప్రీంకోర్టు ముందు పంజాబ్ ప్రభుత్వం నిస్సహాయత వ్యక్తం చేసింది. కాగా, బలవంతంగా తరలిస్తే ఇరువైపులా ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని సుప్రీంకోర్టులో పంజాబ్ సర్కార్ తేల్చి చెప్పింది. దీనికోసం మరింత సమయం ఇవ్వాలని న్యాయస్థానాన్ని

## నూతన సంవత్సరం 2025కు ఘనస్వాగతం



*ఆక్లాండ్ స్కై టవర్ వద్ద న్యూఇయర్ వేడుకలు అట్టహాసంగా మొదలు అయ్యాయి. ఆస్ట్రేలియాలో మనకంటే అయిదున్నర గంటల ముందు నూతన సంవత్సరం మొదలవుతుంది. ఇక సూర్యుడు ఉదయించే దేశంగా పేరున్న జపాన్ కూడా మూడున్నర గంటల ముందే 2025లోకి అడుగుపెడుతుంది. ఇదే సమయానికి దక్షిణ కొరియా, ఉత్తరకొరియా దేశాలు కూడా కొత్త ఏడాదిలోకి ప్రవేశిస్తాయి. భారత్ పొరుగు దేశాలైన భూటాన్, నేపాల్, బంగ్లాదేశ్ మనకంటే 30 నిమిషాల ముందు కొత్త సంవత్సరంలోకి వెళ్తాయి. సమోవాలో నూతన సంవత్సర వేడుకలు ప్రారంభమైన ఎనిమిదిన్నర గంటలకు మనం 2025లోకి అడుగుపెడతాం. అదే సమయానికి భారత్‌తో పాటు శ్రీలంకలోనూ జనవరి ఒకటి వస్తుంది. ఇక మన తర్వాత సుమారు నాలుగున్నర గంటలకు అత్యధికంగా 43 దేశాలు ఒకేసారి కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతాయి. వాటిలో జర్మనీ, నార్వే, ఫ్రాన్స్, ఇటలీ లాంటి ఐరోపా దేశాలతో పాటు కాంగో, అంగోలా, కామెరూన్ లాంటి ఆఫ్రికా దేశాలు ఉన్నాయి. భారత్ తర్వాత అయిదున్నర గంటలకు ఇంగ్లండ్‌లో న్యూఇయర్ మొదలవుతుంది. మనకు జనవరి 1 ఉదయం 10.30 గంటలు అయినప్పుడు అమెరికాలోని న్యూయార్క్ కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతుంది. ఇక కొత్త సంవత్సరం ఆఖరుగా వచ్చే భూభాగాలు అమెరికా పరిధిలోని బేకర్, హోవార్డ్ దీవులు. అయితే ఇక్కడ జనావాసాలు లేకపోవడంతో అమెరికన్ సమోవాను చివరిదిగా పరిగణిస్తారు. రష్యాలో నూతన సంవత్సర వేడుకలను రెండుసార్లు జరుపుకొంటారు. ఆయా దేశాల క్యాలెండర్ల ప్రకారం అక్కడ న్యూఇయర్ వేడుకలు జరుగుతాయి.*

# 4న తెలంగాణ కేబినెట్ భేటీ

కమిషన్, ఎస్సీ వర్గీకరణ కమిషన్ నివేదికలపై చర్చించే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట దేవాలయానికి తితిదే తరహాలో ప్రత్యేక బోర్డు ఏర్పాటుపై మంత్రిమండలి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట ఆలయానికి 20 మందితో పాలక మండలి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. నూతన టూరిజం పాలసీపై కేబినెట్ ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. కొత్త టూరిజం పాలసీపై ఇటీవల అసెంబ్లీలోనూ చర్చించారు. కొత్త ఏడాది కానుకగా తెలంగాణ ప్రభుత్వం పలు హామీల అమలుకు సంబంధించి నిర్ణయం తీసుకోనుంది. అందులో భాగంగా జనవరి 4న సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. సెక్రటేరియట్ లో సాయంత్రం 4 గంటలకు ఈ కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారు. కేబినెట్ సమావేశంలో కొత్త రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, బీసీ రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ నివేదిక, ఎస్సీ వర్గీకరణ, భూమిలేని నిరుపేదలకు రూ.12 వేల సాయం మొదలైన అంశాలపై చర్చించనున్నారు. ఇప్పటికే రైతు భరోసా, భూభారతి, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి అసెంబ్లీలో చర్చించిన విషయం తెలిసిందే. సంక్రాతి కానుకగా కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. అందులో భాగంగా ఇటీవల ఉపముఖ్యంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన సబ్ కేబినెట్ భేటీ జరిగింది. కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, భూభారతి, నిరుపేదలకు 12 వేల ఆర్థిక సాయం తదితర అంశాలపై ఉపసంఘం సమావేశంలో చర్చించారు. మంత్రి వర్గ ఉపసంఘంలో చర్చించిన అంశాలను కేబినెట్ కు సిఫారసు చేశారు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. సబ్ కేబినెట్ లో చర్చించిన అంశాలను అభిప్రాయాలను జనవరి 4న జరగబోయే కేబినెట్ పరిగణనలోకి తీసుకోనుంది. ఉపసంఘం సిఫారసుల ఆదారంగా చర్చించి ఈ అంశాలపై నిర్ణయం తీసుకోనున్నారు. కొత్త సంవత్సరం, సంక్రాంతి కానుకగా రాష్ట్ర ప్రజలకు శుభవార్త చెప్పేందుకు మరికొన్ని పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ మొదలుపెట్టింది. జనవరి నాలుగున రాష్ట్ర ప్రజలకు దీనిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన జారీ చేయనుంది .

## ఫీజుల నియంత్రణ కోసం ప్రత్యేక చట్టం

ఆ వైపున చర్యలు తీసుకుంటుంది. పిర్యాదులు స్వీకరణ పరిష్కారం కోసం అధికారాలతో కూడిన ఒక ప్రత్యేక వ్యవస్థ ఉండాలి' అని విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ అన్నారు. 'మాతృ భాష నేర్చుకోవాలి కానీ.. మాతృ భాషలోనే బోధన అంటే కరెక్ట్ కాదు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీలో కొన్ని మంచి అంశాలు ఉన్నాయి. ప్రతి ఏడాది ఫీజు పెంచుకోవాలని అనుకోవడం సమంజసం కాదు.స్కూళ్లోకి ఎఫ్డీఐలు కూడా వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి లేక రాస్తాము. స్కూల్లను కేటగిరీలుగా విభజిస్తాం. ఒక వారంలో ప్రభుత్వానికి రిపోర్ట్ ఇస్తాము' అని విద్యా కమిషన్ ఛైర్మన్ తెలిపారు.

## మన్మోహన్ భార్య గురుశరణ్ కౌర్‌కు భద్రత కొనసాగింపు

భద్రతను ఇకపై కొనసాగించాలని నిర్ణయించినట్లు కేంద్ర ప్రభుత్వం మంగళవారం స్పష్టం చేసింది. గురుశరణ్ కౌర్ విషయంలో జెడ్ ప్లస్ కేటగిరీ కింద సీఆర్‌పీఎఫ్ రక్షణ కొనసాగిస్తుందని వెల్లడించింది. అయితే ఆమె ప్రాణాలకు ముప్పునకు సంబంధించిన అంశంపై సమీక్ష తర్వాత నిర్వహిస్తామని తెలిపింది. ఈ రక్షణలో ఉన్నవారందరికీ భద్రత కొనసాగుతుందని వెల్లడించింది. సాధారణ ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. 92 ఏళ్ల మన్మోహన్ సింగ్.. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో డిసెంబరు 26వ తేదీన ఢిల్లీలోని ఎయిమ్స్‌లో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే.



## మోదీ పేరుతో కోట్లు కొల్లగొట్టిన జంట

### ప్రధాని కార్యదర్శికి కుమార్తెనంటూ.. కోట్ల రూపాయలు వసూలు

**భువనేశ్వర్(జనంసాక్షి):** అడ్డదారిలో రూ.కోట్లు సంపాదించేందుకు ఓ జంట ఏకంగా ప్రధాని మోదీ కార్యదర్శి పేరునే ఉపయోగించుకుంది. ప్రధాని వ్యక్తిగత కార్యదర్శి పీకే మిశ్రా కుమార్తె, అల్లుడిగా చలామణి అవుతూ పలువురిని మోసం చేసి అడ్డంగా దొరికిపోయారు. తాజాగా వారిని ఒడిశా పోలీసులు అరెస్టు చేసినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఒడిశా లోని ప్రముఖ నేతలు, ఉన్నతాధికారులతో తమకు దగ్గరి సంబంధాలున్నాయంటూ హన్సితా అభిలిప్సా, అనిల్ మహంతి జంట పలువురు బిల్డర్లు, వ్యాపారులను మోసగించారు. భువనేశ్వర్‌లోని ఇన్ఫోసిటీ ప్రాంతంలో ఒక విలాసవంతమైన కార్యాలయాన్ని నిర్వహిస్తూ.. తమకున్న పరిచయాలతో టెండర్లు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పేవారు. ప్రముఖులతో దిగినట్టుగా ఉన్న ఫొటోలను చూపించి బాధితులను నమ్మించే ప్రయత్నం చేశారు. అలా వారినుంచి భారీ మొత్తంలో సొమ్ము గుంజేవారు. అయితే వీరి చేతిలో మోసపోయిన ఓ గనుల వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ జంట బండారం బయటపడింది.అభిలిప్సా ప్రధానంగా మైనింగ్, నిర్మాణ, ప్రముఖ సంస్థలకు చెందిన ధనవంతులను టార్గెట్ చేసేదని పోలీసులు వెల్లడించారు. సందర్భాన్ని బట్టి సంపన్నులు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల భార్యగా చలామణీ అయ్యేది. తాను ప్రభుత్వం తీసుకునే కీలక నిర్ణయాలను ప్రభావితం చేయగలనని నమ్మించేది. "మాకున్న విశ్వసనీయ సమాచారం మేరకు హన్సితా, అనిల్.. పీకే మిశ్రా సమీప బంధువులుగా పలువురిని బురిడీ కొట్టించారు. వారిపై డిసెంబర్ 26న కేసు నమోదైంది" అని అడిషనల్ డీసీపీ స్వరాజ్ వెల్లడించారు. ఈ జంట చేతిలో మోసపోయిన వారు ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు.

## కేరళ నర్సుకు క్షమాభిక్షకు 'నో'

యెమెన్ అధ్యక్షుడు రషద్ అల్–అలిమి తిరస్కరించారు. దాంతో ఆమెకు మరణశిక్షకు అధ్యక్షుడి ఆమోదం లభించినట్లయ్యింది. అయితే నర్సు మరణశిక్షకు ఆమోదం తెలిపిన అధ్యక్షుడు.. ఆ శిక్ష అమలుకు మాత్రం నెల రోజుల గడవు ఇచ్చారు. నిమిషా ప్రియ 2017లో తలాల్ అబ్దో మహదీ అనే యెమెన్ పౌరుడి నుంచి తన పాస్‌పోర్టును తీసుకునే క్రమంలో అతడికి మత్తుమందు ఇంజెక్ట్ చేసి హతమార్చినట్లు కేసు నమోదైంది. అనంతరం పోలీసుల విచారణలో ఆమె హత్యకు పాల్పడినట్లు నిర్ధారణ అయ్యింది. దాంతో ట్రయల్ కోర్టు 2018లో నిమిషాకు ఉరిశిక్ష విధించింది. దానిపై నర్సు నిమిషా సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. కానీ, సుప్రీంకోర్టు కింది కోర్టు తీర్పునే సమర్థించింది. దాంతో నిమిషా ప్రియ యెమెన్ అధ్యక్షుడిని క్షమాభిక్ష కోరింది. తాజాగా యెమెన్ అధ్యక్షుడు ఆమె క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించారు. అయితే ఉరిశిక్ష అమలుకు నెల రోజుల సమయం ఇచ్చారు. ఈ పరిణామాలపై కేంద్ర విదేశాంగ శాఖ స్పందించింది. యెమెన్‌లో నిమిషా ప్రియా మరణశిక్ష అంశం తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. శిక్ష నుంచి ప్రియను బయటపడేయటానికి ఆమె కుటుంబం చేస్తున్న ప్రయత్నాలు, పడుతున్న ఆవేదనను తాము అర్థం చేసుకున్నామని పేర్కొంది. ఈ విషయంలో భారత ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. నిమిషా ప్రియను ఉరిశిక్ష నుంచి తప్పించడానికి ఆమె కుటుంబసభ్యులు ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో యెమెన్ అధ్యక్షుడు ఆమె క్షమాభిక్షను తిరస్కరిండం దిగ్భ్రాంతికి గురిచేసిందని జైస్వాల్ పేర్కొన్నారు. కేరళలోని పాలక్కడ్ జిల్లాకు చెందిన నిమిషా ప్రియ ఉపాధి కోసం 2014లో భర్త, కూతురితో కలిసి యెమెన్‌కు వెళ్లారు. ఆర్థిక కారణాలవల్ల భర్త థామస్, కూతురు కొద్ది రోజుల్లోనే స్వదేశానికి వచ్చారు. ప్రియ మాత్రం అక్కడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తూ.. ఏడాది తర్వాత సొంతంగా క్లినిక్ ఏర్పాటు చేసుకోవాలని భావించింది. అందుకోసం తన భర్త స్నేహితుడైన తలాల్ అబ్దో మహదీ సహాయం కోరింది. అక్కడ విదేశీయులు ఏదైనా సొంత వ్యాపారం లేదా సంస్థ ఏర్పాటు చేయడానికి అవసరమయ్యే లైసెన్స్ పొందాలంటే యెమెన్ జాతీయులు హామీ ఇవ్వాల్సి ఉంటుంది. అందుకే ఆమె తలాల్ సాయం కోరింది. ఈ క్రమంలో నిమిషా ప్రియ పాస్‌పోర్టును తన దగ్గర పెట్టుకున్న తలాల్ అబ్దో.. ఆ తర్వాత దాన్ని తిరిగి ఇచ్చేందుకు ని రాకరించాడు. దాంతో నిమిషా తన పాస్‌పోర్టును తిరిగి తీసుకోవడం కోసం అతడికి మత్తుమందు ఇచ్చి హత్యచేసింది.

## భగీరథమ్మ చెరువులో ఆక్రమణల కూల్చివేత

జోన్ లో ఏర్పాటు చేసిన షెడ్ లు,ఆక్రమణలను కూల్చివేసిం ది. నాలుగు ఎకరాల్లో ఆక్రమంగా వేసిన ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారు. నోటీసులు ఇచ్చిన 24 గంటల్లోనే దుకాణాలను ఎలా ఖాళీ చేయాలంటూ వ్యాపారుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# రికార్డు స్థాయిలో ఆయకట్టును సృష్టిస్తాం



వెంకట్‌రెడ్డితో కలిసి ఉత్తమ్ సమీక్షించారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ఇంజినీర్లు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఎస్ఎల్‌బిసి ప్రాజెక్ట్ 4 లక్షల ఎకరాలకు నీళ్లిచే ప్రాజెక్ట్ అని, ఎస్ఎల్‌బిసి, బ్రాహ్మణవెళ్ళాంల నాకు ప్రథమ ప్రాధాన్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే కాంట్రాక్టర్లు పనిచేయరని, కాంట్రాక్టర్ పని చేయకపోతే మంత్రిరికి చెప్పాలన్నారు. నల్గొండ ప్రజల దశబ్దాల కల ఎస్ఎల్‌బిసి అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..దయచేసి అధికారులు కంటితుడుపు పనులు చేసే ప్రయత్నం చేయకండని ఆయన సూచించారు. సీరియస్ గా పని చేస్తే అనుకున్న సమయానికి ప్రాజెక్ట్ పూర్తి చేయొచ్చన్నారు. ఎస్ఎల్‌బిసి ఒక వరల్డ్ వండర్.. అది పూర్తయితే.. ప్రపంచమంతా వచ్చి చూస్తుందని, చాలా భాద్యతతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. మా బ్రదర్ 26 బోర్లు వేసినా నీళ్లు రాలేక పంట వదిలేశారు.. నల్గొండ అంత విపత్కర పరిస్థితిలో ఉందని, ముఖ్యమంత్రి , ఇరిగేషన్ మంత్రి , డిప్యూటీ సీఎం అందరూ సపోర్ట్ చేస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. అమెరికా ఇంజనీర్లతో కలిసి పనుల్ని వేగవంతం చేయండని, ప్రాజెక్ట్ కోసం ఏం కావాలన్నా చేసే మంత్రిగా నేనున్నా నన్నారు. చిన్న చిన్న సమస్యలతో పనులు ఆపడంపై సీరియస్ అయిన మంత్రి కోమటిరెడ్డి.. ఎంత ఆలస్యం అయితే అంత ఖర్చులు పెరుగుతాయన్నారు. అమెరికన్ ఇంజినీర్లు ఆనాడు మిషన్ అమర్చిన రోజు 3 మూడు రోజులు ప్రాజెక్ట్ దగ్గరే ఉన్నానని, అదిపూర్తి అయితే, ఫర్ షోర్ నుంచి. నీళ్లు తీస్కోవచ్చన్నారు. ఈ ప్రాజెక్టుల విషయంలో నిధుల కొరత రాకుండా చూస్తున్నానని మంత్రి కోమటిరెడ్డి అన్నారు.

**కెసిఆర్ హయాంలో ఒక్క ప్రాజెక్ట్ పూర్తి కాలే**

కేసీఆర్ హయాంలో ఒక్క ప్రాజెక్టు పూర్తిగా నిర్మాణం చేయలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. గత ప్రభుత్వంలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి... నామమాత్రం ఆయకట్టు మాత్రమే చేశారని చెప్పారు. ప్రాజెక్టులపై ఆయన జలసౌధలో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ..పాలమూరు రూ.27వేలు, సీతారామ ప్రాజెక్టు రూ.8వేలు ఖర్చు చేసి ఒక్క ఎకరా ఆయకట్టు కూడా ఇవ్వలేదన్నారు. 800 టీఎంసీల తెలంగాణకు 299 టీఎంసీ, ఆంధ్రాకు 519 టీఎంసీ గతంలో ఒప్పుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 500 టీఎంసీ నీళ్ల కోసం సర్కార్ ÷ట్ చేస్తోందని చెప్పారు. సమక్క సారలమ్మ 44 టీఎంసీలు త్వరలోనే క్లియర్ కాబోతున్నాయన్నారు.. రాబోయే ఐదేళ్లలో రికార్డు స్థాయిలో కొత్త ఆయకట్టు తేవాలని ముందుకు వెళ్తున్నామని చెప్పారు. 18వందల లష్కర్‌లను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించబో తున్నామని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయ కట్టు వచ్చేలా ప్రణాళికలు చేస్తున్నామన్నారు.ఇరిగేషన్ శాఖలో పదోన్నతులు వచ్చే పది నెలల్లో పూర్తి చేస్తామన్నారు. అధికారులు బాధ్యతగా ఉండకపోతే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు మిర్యాలగూడ ఏఈనీ సస్పెండ్ చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## పట్నం నరేందర్ రెడ్డికి మళ్లీ నోటీసులు

బెయిల్ పొందారు. కాగా, కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో అధికారులపై దాడి ఘటన తెలం గాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. లగచర్లలో ఫార్మా కంపెనీ ఏర్పాటుపై అభిప్రాయ సేకరణకు వెళ్లిన అధికారులపై గ్రామస్తులు దాడి చేయడం సంచలనం సృష్టించింది. ఈ దాడికి మాస్టర్ మైండ్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డేనని ఆరోపించిన పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. ఈ కేసులో దాదాపు నెల రోజుల పాటు పట్నం చర్లపల్లి జైలులో ఉన్నారు. అనంతరం హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆయన జైలు నుండి బయటకు వచ్చారు. ఈ క్రమంలోనే మరో కేసులో నరేందర్ రెడ్డికి పోలీసులు నోటీసులు ఇవ్వడం గమనార్హం.

### మణిపూర్ అల్లకల్లోలంపై సీఎం బీరేన్ సింగ్

## బహిరంగ క్షమాపణలు

శాంతి నెలకొనడాన్ని చూస్తూనే ఉన్నాం. మణిపుర్ క్షేమం కోసం తగిన భద్రతా సిబ్బందిని కేంద్ర ప్రభుత్వం పంపింది. అంతేకాకుండా.. నిర్వాసితుల కోసం నిధులను సమకూర్చింది. త్వరలో గృహ నిర్మాణాలు చేపడతాం. వచ్చే ఏడాది నుంచి శాంతి స్థాపన జరుగుతుందని ఆశిస్తున్నా' అని విశ్వాసం వ్యక్తం చేశారు. 'రాష్ట్రంలోని అన్ని కమ్యూనిటీ ప్రజలకు ఒక్క విషయాన్ని చెప్పాలనుకుంటున్నా. ఇప్పటివరకు మణిపుర్‌లో జరిగిన తప్పిదాలను క్షమించి, చేదు జ్ఞాపకాలను మర్చిపోదాం. రాష్ట్ర అభివృద్ధి కోసం కొత్తగా మన జీవితాలను ప్రారంభిద్దాం. అన్ని జాతుల వారు కలిసికట్టుగా జీవించాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని సీఎం పేర్కొ?న్నారు. కాగా.. గతేడాది మే నెలలో మణిపుర్‌లోని కుకీ, మైతేయి తెగల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో ఇప్పటి వరకు 225 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో చాలా మంది ఇప్పటికీ సహాయ కేంద్రాలలో తలదాచుకుంటున్నారు. ఈ క్రమంలోనే స్పందించిన బీరేన్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## సిఎంతో సమావేశంపై కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదు

సంకల్పాన్ని చిత్రపరిశ్రమ ప్రతినిధులుగా మేమందరం స్వాగతించాం. అనవసర వివాదాల్లోకి చిత్ర పరిశ్రమను లాగి, పరిశ్రమకు లేనిపోని రాజకీయాలను ఆపాదించొద్దని మా మనవి. రాజకీయ దాడి, ప్రతిదాడులకు దయచేసి పరిశ్రమను వాడుకోవద్దని అందరినీ కోరుతున్నాం. లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తోన్న చిత్ర పరిశ్రమకు అన్ని ప్రభుత్వాల సహకారం, ప్రజలందరి ప్రోత్సాహం ఎప్పటికీ ఉంటుందని ఆశిస్తున్నాం' అని దిల్ రాజు పేర్కొన్నారు. సోమవారం భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మాట్లాడుతూ... సినీ నటుడు అల్లు అర్జున్ వ్యవహారంపై మరోసారి స్పందించారు. కేవలం ప్రచారం కోసం, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే సినిమా వాళ్ల గురించి సీఎం రేవంత్ రెడ్డి అలా మాట్లాడారని పేర్కొన్నారు. అటెన్షన్, డైవర్షన్ కోసమే సీఎం పాకులాడుతున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి.. సినిమా వాళ్లతో సెటిల్ చేసుకొని ఇప్పుడు ఏం మాట్లాడట్లేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలపై దిల్ రాజు స్పందించారు.

## సమిష్టి కృషితో వికసిత భారత్

### కొత్త సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా మోడీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలను ఉద్దేశిస్తూ.. పోస్టు పెట్టారు. ఈ ఏడాది భారత్ సాధించిన విజయాలను గురించి వివరిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు. 'సమష్టిగా ప్రయాత్నించి.. 2024లో అనేక విజయాలు అందుకున్నాం. 2025లో మరింత కష్టపడి పనిచేసి వికసిత్ భారత్ కలను సాకారం చేసుకుందాం' అని మోదీ పేర్కొన్నారు. దీనితో పాటు ఈ ఏడాది భారత్ సాధించిన విజయాలకు సంబంధించిన వీడియోను ఆయన పంచుకున్నారు. ఈ వీడియో ఒక ఏడాది కాలంలో సాధించిన పురోగతి, ఐక్యత, వికసిత్ భారత్ వైపు వేసిన అడుగులను గుర్తుచేస్తుందన్నారు.


## పట్టెడన్నం కోసం పసిబిడ్డలు ఏడుస్తున్నారు

### ఏడాది పాలనలో కాంగ్రెస్ అన్ని విధాలా విఫలం: కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):** కాంగ్రెస్ సర్కార్ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. అన్నపూర్ణ వంటి నా తెలంగాణలో బువ్వకోసం బిడ్డల ఏడ్పులా అని ఆవేదన వ్యక్తం చేశారు. 1.50 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిన నా తెలంగాణలో పట్టెడన్నం కోసం పసిబిడ్డలు ఆర్తనాదాలు చేస్తున్నారని అన్నారు. దశాబ్దాల కాంగ్రెస్ పాలన మూలంగా ఆకలిచావులు, ఆత్మహత్యలు, వలసలు, అంబలి కేంద్రాలకు నిలయమైన తెలంగాణను పదేళ్ల కేసీఆర్ పాలనలో దేశానికే అన్నపూర్ణగా నిలిపామని గుర్తు చేవారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో అన్నమో రామచంద్రా అని ఆకలి కేకలు వినిపించే పరిస్థితి తీసుకొచ్చారని మండిపడ్డారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో గురుకులాల్లో చదువుకుని ఎవరెస్ట్ శిఖరాలు అధిరోహించి, వందశాతం ఉత్తీర్ణత సాధించి విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. కానీ ఇప్పుడు అదే విద్యార్థులు గుప్పెడన్నం కోసం నేడు గుండెలవిసేలా రోదిస్తున్నారు.. సిగ్గు సిగ్గు అని విమర్శించారు. ఇది పాలకుల పాపం కానీ.. విద్యార్థులకు శాపంగా మారిందని చెప్పారు. జాగో తెలంగాణ జాగో అని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ పర్యటనపై కేటీఆర్ మండిపడ్డారు. దేశం కోసం సర్వస్వం ధారపోసిన నేతలను అవమానపరిచే డీఎన్ఏ కాంగ్రెస్‌లోనే ఉందని అన్నారు.

# అజేయుడిదే ఆ పరాజయం..!

- రాష్ట్రంలో గులాబీ దళం అంచెలంచెల పతనానికి ఆయనే ఆద్యుడు
- ఖమ్మంలో తుమ్మల, పొంగులేటి తిరుగుబాటే అధినేత కేసీఆర్ కొంపముంచింది
- ఇద్దరిని దూరంపెట్టి కర్రపెత్తనం చేసిన నాటి మంత్రి అజయ్
- జాడలేని 'పువ్వాడ'కు మరోసారి టికెట్ ఇస్తే పార్టీ భూస్థాపితమే..
- ఈ ఏడాది కాలంలో ఎన్నెన్నో విమర్శలకు వేదికైన మాజీమంత్రి



ఫోకస్ 2024

కూరాకుల గోపి (ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి)

రాజకీయాల్లో శాశ్వత శత్రువులు.. శాశ్వత మిత్రులు ఉండరంటారు. స్టేట్ పొలిటికల్ హిస్టరీలో తలపండిన నేతల నోళ్లలో ఎప్పటి నుంచో నానుతున్న మాట ఇది. ఈ ఫిలాసఫీని పాటించిన నేతలు దశాబ్దాలుగా రాజకీయాల్లో మన్నుతున్నారు. ఖమ్మం జిల్లా రాజకీయాల్లో మాత్రం అదృష్టవశాత్తు ఒకే ఒక్కసారి అమాత్యుడైన పువ్వాడ అజయన్న ఎందుకో ఈ చిన్న లాజిక్ మిస్సయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా జనం తలలో నాలుకలా మెదులుతున్న 'ఆ ఇద్దరిని' శత్రువులుగా మార్చుకోవడమే ఆయన పతనానికి నాంది పలికిన ఉదంతమైంది. ఆనాడు కలివిడిని మరచి పొంగులేటిపై పంతం నెగ్గించుకోవాలని స్కెచ్ వేశాడు. నలభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన చాణిక్యుడు తుమ్మల ఎదుట కుప్పిగంతులేశాడు. ఇది 'ఖమ్మం జిల్లా.. పువ్వాడ ఖిల్లా' అంటూ తుమ్మల ముందే అనుచరగణంతో నినాదాలు చేయించి చివరికి బొక్కబోర్లా పడ్డాడు. అధికారంలో ఉన్నన్నాళ్లు కళ్లకు ఎవ్వరూ కనిపించని స్థితి నుంచి పగ్గాలు చేజారిపోయాక ఎవరి కంటికీ కనిపించని స్థితికి పతనమయ్యాడు.

స్వలాభం కోసం పదేళ్లలో మూడు పార్టీలు మారిన అజయ్ కుమార్ మంత్రి అవ్వగలిగాడే కానీ పొలిటికల్ క్రెడిబులిటీని మాత్రం శూన్యంగా మార్చుకున్నాడు. తండ్రి పువ్వాడ నాగేశ్వరరావు సీపీఐ జాతీయ నేతగా జిల్లా రాజకీయాల్లో గుర్తింపు పొందినప్పటికీ అజయ్ మాత్రం తండ్రి మార్గానికి, వారసత్వానికి దూరంగా పార్టీలు మారుస్తూ వచ్చారు. తొలుత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన అజయన్న తన రాజకీయ భవిష్యత్తుని కాంగ్రెస్ పార్టీలో వెతుక్కునే ప్రయత్నం చేశారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొంది ఆ తర్వాత రాజకీయ లబ్ధి కోసం టీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నాడు ఎమ్మెల్సీ కోటాలో మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావును వ్యతిరేకిస్తూ తనకంటూ ఓ ప్రత్యేక కోటరీని ఏర్పరచుకున్నారు. అనధికారిక, పార్టీ కార్యక్రమాల్లో తుమ్మల పాల్గొన్న సమయాల్లో "ఖమ్మం జిల్లా.. పువ్వాడ ఖిల్లా" అంటూ తన అనుయాయులతో నినాదాలు చేయించి తలబిరుసును ప్రదర్శించాడు. చివరకు ఆయన్నే ప్రత్యర్థిని చేసుకున్నాడు.

### 2018లో కాలం కలిసొచ్చి మంత్రిగా..

గులాబీ పార్టీ పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పటికీ ఖమ్మం జిల్లా ప్రజలు మాత్రం సదరు పార్టీని వ్యతిరేకిస్తూనే వచ్చారు. 2014 ఎన్నికల్లో కొత్తగూడెం స్థానాన్ని కైవసం చేసుకున్న టిఆర్ఎస్ ఆ తర్వాత జరిగిన 2018 ఎన్నికల్లో ఖమ్మం జిల్లా కేంద్రం నుంచి పువ్వాడ అజయ్ కుమార్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించింది. మొన్నటి ఎన్నికల్లోనూ ఆ పార్టీ భద్రాచలం స్థానాన్ని మాత్రమే గెలుచుకోగలిగింది. 2018 ఎన్నికల్లో ఖమ్మం నుంచి గెలిచిన అజయ్ కుమార్‌కు తన స్నేహితుడైన కేటీఆర్ పుణ్యాన యాదృచ్ఛికంగా మంత్రి పదవి లభించింది. రవాణా మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి, ఇతర నేతలకంటే భిన్నంగా విభిన్న మార్గాన్ని ఏర్పర్చుకున్నారు. పార్టీలో తలపండిన నేతలను సైతం పక్కకు నెట్టేసి అన్నీ తానే అన్నట్లుగా వ్యవహరించాడు. 2018 ఎన్నికల్లో ఎంపీ టికెట్ లభించని పొంగులేటితో పాటు సీనియర్ నేత తుమ్మల నాగేశ్వరరావు పార్టీలోనే ఉన్నప్పటికీ వారిని పూర్తిగా పక్కకు తోసేలా వ్యవహరించాడు. పార్టీ కార్యకలాపాల్లో సైతం వారికి ప్రాధాన్యత లభించకుండా నిరంకుశ ధోరణిని అవలంబించాడు. ఫలితంగా 2023 ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ఈ ఇద్దరు నేతలు ఒక తాటిపైకి వచ్చి నాటి సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా ధిక్కార స్వరాన్ని వినిపించడం మొదలుపెట్టారు. తన అనుచరుల అభీష్టం మేరకు పొంగులేటి, తుమ్మల కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో బీఆర్ఎస్ పతనానికి పునాదిరాయి పడింది. తోటి నేతలుగా ఉన్న వారిద్దరిని సమన్వయం చేసుకొని ముందుకు నడిపించే చాణక్యాన్ని అజయ్‌కుమార్ పోషించి ఉంటే వారు పార్టీని వీడి కేసీఆర్‌కు ప్రధాన శత్రువులుగా మారేవారు కాదని అందరి అభిప్రాయం.

### కాలం తిరగబడింది..

కాలం ఎప్పుడూ అనుకూలించదని చెప్పడానికి 2023 ఎన్నికలే ఉదాహరణ. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న తుమ్మల, పొంగులేటి ఖమ్మం ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా తమ ప్రభావాన్ని చూపారు. నాలుగు దశాబ్దాల రాజకీయ చాణక్యం కలిగిన తుమ్మల.. కెసిఆర్‌కు వ్యతిరేకంగా తోటి సీనియర్ నేతలను ఏకం చేయగా, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక, అంగ బలంతో కాంగ్రెస్‌కు మరింత బలాన్ని, బలగాన్ని సమకూర్చారు. దీంతో సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయాన్ని పొంది అసాధారణ శక్తిగా నిలిచింది. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్త పతనానికి మూల కారకుడైన పువ్వాడ తన సొంత నియోజకవర్గంలో చిత్తుచిత్తుగా ఓటమి చవిచూశారు. బీఆర్ఎస్ పార్టీలో అణచివేతకు గురైన తుమ్మలే ఖమ్మం నియోజకవర్గంలో పువ్వాడకు ప్రత్యర్థిగా మారడం అజయ్ రాజకీయ మనుగడకు మరింత చెంపపెట్టు. ఎన్నికల్లో లక్ష పైచిలుకు మెజారిటీతో అజయ్ కుమార్ మీద తుమ్మల నాగేశ్వరరావు గెలుపొందడం ఖమ్మంలో కొత్త చరిత్ర సృష్టించింది. మరోవైపు పాలేరులో పొంగులేటి విజయ దుందుభి మోగించి బీఆర్ఎస్ పార్టీకి పుట్టగతులు లేకుండా చేశారు.

### నాడు హల్చల్.. నేడు సొంత వ్యాపకాలకే సరి

ఖమ్మం నియోజకవర్గంలో ఎన్నడూ లేనివిధంగా భూకబ్జాలు, అరాచకాలు, అక్రమ కేసులు పెంచి పోషించడంలో అజయ్ తనకు తానే సాటిగా నిలిచాడు. నగరంలోని సొంత పార్టీ కార్పొరేటర్లను పెంచి పోషించి ఆక్రమణలకు, రౌడీయిజానికి, అక్రమాలకు ఆజ్యం పోశాడు. ఈ ఫలితంగానే రాష్ట్రవ్యాప్తంగా గులాబీ దళం పతనమవ్వడానికి ఖమ్మం నియోజకవర్గం కేంద్ర బిందువుగా నిలిచిందని వేనోళ్ల అభిప్రాయం. మంత్రిగా పట్టపగ్గాల్లేకుండా వీరవిహారం చేసిన పువ్వాడ ఘోర పరాభవం తర్వాత కంటికి కనిపించని నాయకునిగా మారాడు. ఖమ్మంలో అరాచకాలకు ప్రతిరూపంగా అజయ్ పేరు మారిపోయిందనే అపవాదు మూటగట్టుకున్నారు. పూర్తిగా సొంత కార్యకలాపాలకు పరిమితమై హైదరాబాదులోనే ఉంటున్న తీరు తన పరాభవ భారాన్ని ఇంకా మోస్తున్నట్లే స్పష్టం చేస్తోంది. ఎప్పుడో చుట్టం చూపుగా జిల్లా కేంద్రానికి వచ్చి వెళ్తూ కనుమరుగవుతున్న రాజకీయ మనుగడను కళ్లారా చూసుకుంటున్నట్టు కనిపిస్తోంది. పరిస్థితులు ఇలాగే కొనసాగి మరోసారి ఆయనకు టికెట్ ఇస్తే.. పార్టీ మనుగడకు మరింత చేటు చేస్తుందని వాదన..!!

## పులుల సంచారంతో భయాందోళన



నిర్మల్, డిసెంబర్ 31 (జనంసాక్షి) : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలో చిరుతపులి సంచారం కలకలం సృష్టించింది. మంగళవారం తెల్లవారుజామున మండలంలోని కాల్వ లక్ష్మీనర సింహ స్వామి ఆలయం సమీపంలో నిర్మల్-భైంసా జాతీయ రహదారిపై వాహనదారులకు చిరుతపులి కనిపించింది. దీంతో తమ సెల్‌ఫోన్లలో చిరుతను బంధించారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతున్నాయి. చిరుత సంచారంతో సమీపంలోని గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌ను వణికిస్తున్న పులులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను పులులు వణికిస్తున్నాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్-మంచిర్యాల జిల్లాల సరిహద్దుల్లో గతంలో ఉన్న రెండు పులులు కాస్తా.. 11కు పెరగడంతో ఇదిగో పులి.. అదిగో టైగర్ అన్న హెచ్చరికలతో స్థానికులు జంకుతున్నారు. పులుల భయంతో రోజువారీ పనులకు వెళ్లేందుకు అటవీ సమీప గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. తాజాగా ఎర్రగుంట గ్రామశివారులో అటవీ అధికారులు పులి కదలికలను గుర్తించారు. మంచిర్యాల జిల్లా ముల్కల్లబీట్ పరిధిలోనూ మరో ఆడపులి సంచారాన్ని కనిపెట్టారు. ఇక్కడే మరో ఆడపులి ట్రాప్‌కెమెరాకు చిక్కింది. ఇదే ఏరియాలో మరో మగపులి సంచరిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. మందమర్రి, అందుగులపేట, తాండూరు మండలం నీలాయిపల్లి సమీపంలో పులి సంచారం కలకలం రేపుతోంది. బొంబాయిగూడ గ్రామ శివారులోని ఉచ్చమల్లవాగుతోపాటు సమీప పంటచేలల్లో మేకలకాపరులు పులి పాదముద్రలను చూసినట్టు తెలిపారు. పులుల సంచారంతో అలర్ట్ అయిన అటవీశాఖ అధికారులు గ్రామాల్లో చాటింపు వేయిస్తూ అప్రమత్తం చేస్తున్నారు. జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

## ల్యాబ్‌లో పనిచేస్తున్న ఉద్యోగిపై కత్తితో దాడి


పెద్దపల్లి, డిసెంబర్ 31 (జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లాలో ఘోరం జరిగింది. గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఓ గుర్తు తెలియని వ్యక్తి కత్తులు, తల్వార్‌లతో రెచ్చిపోయాడు. కంప్యూటర్ ల్యాబ్‌లో పని చేస్తున్న ఉద్యోగిపై కత్తి, తల్వార్‌తో విచక్షణారహితంగా దాడి చేశాడు. విద్యార్థులు చూస్తుండగానే ఈ ఘటన జరిగింది. భయంతో విద్యార్థులు పరుగులు పెట్టారు. రక్తపు మడుగులో పడి ఉన్న ఉద్యోగిని చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బాధితుడిని శ్రీనివాస్‌గా గుర్తించారు. శ్రీనివాస్‌పై దాడికి పాల్పడ్డ వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది. శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## పివి ఎక్స్‌ప్రెస్‌పై కారు ప్రమాదం

హైదరాబాద్, డిసెంబర్31 (జనంసాక్షి) : పివి ఎక్స్‌ప్రెస్ వే పై స్కోడా కారు బీభత్సం సృష్టించింది. ముందు వెళుతున్న కారు ను స్కోడా కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో రెండు కార్లలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఎయిర్ బెలూన్స్ ఒపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. ఘటనా స్థలానికి వచ్చిన రాజేంద్ర నగర్ పోలీసులు మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమన్నారు. గాయాలైన వారిని ఆస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంతో ఫ్లై ఓవర్ పై ట్రాఫిక్ జామ్ కావడంతో ట్రాఫిక్ క్లియర్ చేశారు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కిష్టాపురం ఎస్సి గురుకులంలో విషాదం

- ఉరేసుకుని విద్యార్థి సాయివర్ధన్ మృతి



ఖమ్మం, డిసెంబర్ 31 (జనంసాక్షి) : ఖమ్మం జిల్లా కిష్టాపురం ఎస్సి గురుకులంలో విషాదం చోటుచేసుకుంది. ఇంటర్ విద్యార్థి సాయివర్ధన్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. సూసైడ్ నోటు ఎటువంటిది లభించలేదని పోలీసులు వెల్లడించారు. సాయివర్ధన్ స్వస్థలం ముదిగొండ అని పోలీసులు తెలిపారు. సోమవారం సదరు విద్యార్థి ఇంటి నుంచి కళాశాలకు వచ్చినట్టు సమాచారం. గతంలో సంగారెడ్డి మండలం కోత్లాపూర్ జ్యోతిబాపులే గురుకులంలో స్వాతి అనే విద్యార్థిని గత నెలలో ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. గురుకులాల్లో రోజుకో సంఘటన బయటకు వస్తోంది. పలు గురుకులాల్లో భోజనం చేసిన తరువాత విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. గతంలో గురుకులాల్లో విద్యార్థులను పాములు కాటేసిన విషయం వెలుగులోకి వచ్చింది.

## కొత్త సంవత్సరం అంటే క్లబ్బులు, పబ్బులేనా?

- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశ్న



హైదరాబాద్, డిసెంబర్ 31 (జనంసాక్షి) : కొత్త సంవత్సరం పేరుతో గోవాతో పాటు క్లబ్, పబ్బులకు వెళ్లడమేనా? మన సంస్కృతి అని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశ్నించారు. నూతన సంవత్సర వేడుకలను బ్రిటీష్ పాలకులు మనపై రుద్ది వెళ్లారన్నారు. 'మనకి కొత్త సంవత్సరం జనవరి ఒకటో తారీఖు కాదు. ఉగాది మనకి కొత్త సంవత్సరం. దానినే మన భవిష్యత్తు తరాలకు అలవాటు చేయాలి. నూతన సంవత్సర వేడుకల పేరుతో రాబోయే తరాలకు విదేశీ కల్చర్‌ను అలవాటు చేస్తున్నారు. డిసెంబర్ 31, జనవరి 1న కొత్త సంవత్సరం ఈవెంట్స్ పేరుతో ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు'అని రాజాసింగ్ పేర్కొన్నారు.



## ఎగ్జిబిషన్ ను ప్రారంభించిన వరంగల్ కుడా ఛైర్మన్

పరకాల, డిసెంబర్ 31 (జనం సాక్షి): హనుమకొండ బాలసముద్రంలోని హాయగ్రీవాచారి గ్రౌండ్స్ లో ఏర్పాటు చేసిన లేజర్ మరియు మ్యూజికల్ ఫౌంటెన్ ఎగ్జిబిషన్ ను స్థానిక శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి మంగళవారం రోజున వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని లక్ష్మా రెడ్డి, బంక సంపత్, మైనారిటీ సెల్ అధ్యక్షులు అజీజ్ ఖాన్, సారంగం, యూత్ కాంగ్రెస్ నాయకులు రాహుల్ రెడ్డి మరియు ఇతరులు పాల్గొన్నారు.

## కొండాపూర్ అపార్ట్‌మెంటులో అగ్నిప్రమాదం

- సకాలంలో మంటలు ఆర్పడంతో తప్పిన ముప్పు



హైదరాబాద్, డిసెంబర్31 (జనంసాక్షి) : హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో మంగళవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రాజరాజేశ్వరీ కాలనీ గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లోని 9వ అంతస్తులో ఉన్న ఫ్లాట్‌లో మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో ఫ్లాట్‌లో ఎవరూ లేకపోవడంతో ముప్పు తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కొండాపూర్‌లోని గేలక్సీ అపార్ట్‌మెంట్స్ 9వ అంతస్తులో మంటలు చెలరేగాయి. గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు వ్యాపించినట్లుగా స్థానికులు చెబుతున్నారు. మహిళ బాల్కనీలో ఉండటంతో ప్రమాదం తప్పింది ఇంట్లో వంట చేస్తున్న సమయంలో గ్యాస్ సిలిండర్ లీక్ అయ్యి మంటలు వ్యాపించాయి. ఈ ఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఉన్న నలుగురు కుటుంబ సభ్యులు ఉన్నారు. ఎగిసిపడుతున్న మంటలను చూసి భయభ్రాంతులకు గురై ఇంట్లో ఉన్నవారు కిందకు వచ్చేశారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం సంభవించింది. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. . ఘటనస్థలికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లోని బాలాపూర్ పరిధిలో మంగళవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. బిస్మిల్లా కాలనీలోని ప్లాస్టిక్ గోదాంలో మంటలు చెలరేగాయి. మంటలు భారీగా ఎగసిపడుతున్నాయి. ఘటనస్థలికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళలనకు గురయ్యారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై పోలీసులు విచారణ చేపట్టారు. పక్కనున్న వారిని అక్కడ నుంచి దూరంగా పంపించి వేస్తున్నారు.

## ముంబై-నాగ్‌పూర్ మహామార్గ్‌లో భారీగా ట్రాఫిక్ జామ్

- పంచర్ కావడంతో నిలిచిపోయిన 50 ట్రక్కులు, కార్లు



ముంబై, డిసెంబర్31 (జనంసాక్షి) : మహారాష్ట్రలోని ముంబై - నాగ్‌పూర్ సమృద్ధి మహామార్గ్ లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో మాలేగావ్, వనోజా టోల్ ప్లాజా మధ్య హైవేపై ఓ ఐరన్ బోర్డు ఒక్కసారిగా విరిగి కింద పడింది. దీంతో సుమారు 50కి పైగా ట్రక్కులు, కార్లు పంచర్ కావడంతో ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొనింది. ఇక, వాహనాలను రోడ్డుపై నుంచి తొలగించకపోవడంతో అర్ధరాత్రి వరకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా, నాగ్‌పూర్-ముంబై మధ్య సమృద్ధి మహా మార్గ్‌ను నిర్మిస్తున్నారు. మొత్తం 701 కిలో మీటర్ల పొడవైన ఈ రహదారిని ప్రస్తుత ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కలల ప్రాజెక్టుగా చెబుతున్నారు. ఇప్పటికే, ఈ ఎక్స్‌ప్రెస్ వేలో రెండు దశల పనులు వేగంగా పూర్తయ్యాయి. దీంతో 600 కిలో మీటర్లు అందుబాటులోకి రాగా, డిజైన్ లోపాలతో హైవేపై తరచూ ప్రమాదాలు కొనసాగుతున్నాయి.

## ఏపీలో బియ్యం అక్రమాలపై ఏర్పాటైన సిట్‌లో మార్పులు

- సిఎస్ ఉత్తర్వులు జారీ

అమరావతి, డిసెంబర్31 (జనంసాక్షి) : రాష్ట్రంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా, స్మగ్లింగ్‌పై సమగ్ర విచారణ కోసం ఏర్పాటైన సిట్ బృందంలో మార్పులు చేస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసుల దర్యాప్తు, విచారణ కోసం గతంలో ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. బృందంలో కొందరు సభ్యుల నియామకంపై వచ్చిన అభ్యంతరాలపై స్పందించిన ప్రభుత్వం సిట్‌లో మార్పులు చేసింది. సీఐడీ ఐజీ వినీత్ బ్రిజ్ లాల్ నేతృత్వంలో ఆరుగురు సభ్యులతో ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. సీఐడీ ఎస్పీ బి.ఉమామహేశ్వరరావు, బీసీ సంక్షేమశాఖ కాకినాడ ఈడీ ఎ.శ్రీనివాసరావు, మహిళా శిశు సంక్షేమశాఖ కర్నూలు ఆర్జేడీ పి.రోహిణి, విజయనగరం జిల్లా పౌరసరఫరాల అధికారి కె.మధుసూదన్‌రావు, కోనసీమ జిల్లా పౌరసరఫరాల మేనేజర్ బాల సరస్వతి సిట్ సభ్యులుగా ఉన్నారు. ఈ మేరకు సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై కాకినాడలో నమోదైన 13 కేసులపై సిట్ విచారణ జరపనుంది. సిట్‌లో ఇద్దరు ఐపీఎస్ అధికారులు, ఇద్దరు డిప్యూటీ కలెక్టర్ హోదా అధికారులు, పౌర సరఫరాల శాఖకు చెందిన అధికారులు ఉన్నారు. గతంలో నియమించిన నలుగురు డీఎస్పీలపై అభ్యంతరాలు వచ్చిన నేపథ్యంలో ఇతర శాఖల అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## పంచాయతీ ఎన్నికలకు ముమ్మర కసరత్తు!

- జనవరి మొదటివారంలో పంచాయతీ రిజర్వేషన్లు ఖరారు?
- సంక్రాంతి తర్వాత షెడ్యూల్ విడుదల!
- మూడు విడతల్లో ఎన్నికలు బ్యాలెట్ పేపర్ ద్వారానే స్థానిక సమరం
- సర్పంచు పింక్ కలర్, వార్డు సభ్యుడికి వైట్ కలర్!
- బ్యాలెట్లు 12,815 గ్రామ పంచాయతీలు 1.14లక్షల వార్డు సభ్యుల స్థానాలు




అడవిదేవులపల్లి, డిసెంబర్ 31 (జనం సాక్షి) : రాష్ట్రంలో వచ్చే ఏడాది నిర్వహించబోయే స్థానిక ఎన్నికలపై ప్రత్యేక ప్రభుత్వం దృష్టి సారించనుంది. ముందు పంచాయతీ ఎన్నికలు, తర్వాత ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు, ఆ తర్వాత మున్సిపల్, నగర పాలక సంస్థల ఎన్నికలను వరుసగా నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రజల్లో ప్రభుత్వం పట్ల ఉన్న సానుకూలతను సొంతం చేసుకునేందుకు ఇప్పటికే స్థానిక ఎ న్నికలకు సిద్ధమవుతోంది. ముందుగా పంచాయతీరాజ్ చట్ట సవరణకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేసిన ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల్లో తన హ వా చాటాలని కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. సర్పంచ్లు, ఎంపీపీ, జడ్పీ చైర్మన్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం ఇప్పటికే ముగిసింది. ముందు సర్పంచ్ ఎన్నికలు, ఆ తర్వా త ఎంపీటీసీ, జడ్పీటీసీలకు ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అందుకనుగుణంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. స్థానిక ఎన్నికలకు జనవరి మొదటివారంలో రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కానుండడంతో సంక్రాంతి తర్వాత గ్రామపంచాయతీ ఎన్నిక షెడ్యూల్ విడుదల కానున్నట్టుగా తెలిసింది. మూడు విడతల్లో ' పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం విస్తున్నట్టుగా సమాచారం. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి కులగణన సంబంధించి పూర్తి నివేదిక అందిందని ఈ నేపథ్యంలోనే ఎన్నికల సంబంధించి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టుగా తెలిసింది. ఎన్నిక కమిషన్ కూడా దీనికి సంబంధించిన చ ర్యలకు సమాయత్త అవుతున్నట్టుగా సమాచా రం. ఈ సంవత్సరం ఫిబ్రవరి 1వ తేదీ సర్పంచు ల పదవీ కాలం ముగియగా, జూలై 3వ తేదీన ఎం పిటి జడ్పిటిసి సభ్యుల పదవీ కాలం ముగిసిం ది. ప్రజాప్రతి నిధు స్థానంలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఈ నేపథ్యం ఎన్నికల కు అవసరమైన ఏర్పాట్లను ఎన్నికల సంఘం చేప డుతోం! జనవరి 14వ తేదీన ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేస్తే, తర్వాత 21 రోజుల్లో (ఫిబ్రవరి మొదటి వారంలో) ఎన్నికలు నిర్వహిం లా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టుగా సమాచా రం. ఈసారి స్థాని సంస్థల ఎన్నికల్లో ప్రతి మండలానికి కనీసం ఐదు గ్రామ (ఎంపిటి స్థానాలు) ఉండేలా అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం చట్టం తీసుకొచ్చి విషయం తెలిసిందే.

### బ్యాలెట్ పేపర్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలు..!

ఎన్నికలను మూడు విడతలు గా నిర్వహించాలని నిర్ణయించిన ఎన్నిక సం ఘం ఆ ప్రకారం ఒక్కో జిల్లాలోని మండలాలకు మూ విడతలుగా ఎన్నికలను నిర్వహించనున్నట్టుగా తెలిసింది. దీంతోపా ఈ స్థానిక సంస్థల ఎన్నికలను బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించా ని నిర్ణయించినట్టు సమాచారం. అందులో భాగం గా సర్పంచ్ పింక్, వార్డు సభ్యుడికి వైట్ కలర్ బ్యాలట్ పేపర్ పయోగించనున్నట్టుగా తెలిసింది.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
10 జనవరి 2025

# భీమా కోరేగావ్ యుద్ధం



మహారాష్ట్రలోని పూణే ప్రాంతంలోని భీమా కోరేగావ్ నది పరివాహక ప్రాంతం లో జరిగిన యుద్ధంకు గుర్తుగా ప్రతీ ఏడాది అక్కడ ఎస్సి,ఎస్టీ, బిసి లు, బహుజనులు జనవరి ఒకటిన లక్షలాది మంది చేరుకొని నూతన సంవత్సరం ను జరుపుకుంటారు. డాక్టర్ బిఆర్అంబేద్కర్ వాదులు మూతికి ముంత, ముడ్డికి చీపురు అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడిన సమాజం, పీష్య బహ్మణ అరాచకాలను వ్యతిరేకించి వెట్టి చాకిరీ చేసియిస్తున్న చిత్రహింసలు పెట్టిన పెట్టిన పీష్య బ్రాహ్మణుల సైనికులను కేవలం 500 సైన్యం ఏర్పడి మహర్ సైన్యం 28000 మందిని తర్మి కొట్టిన, వారిమీద విజయం సాధించిన రోజు జనవరి ఒకటి. అది జనవరి ఒకటి 1818

కోరెగావ్ యుద్ధం 1 జనవరి 1818 న బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ మరియు మరాఠా కాన్ఫెడరసీకి చెందిన పీష్వా వర్గానికి మధ్య, కోరెగావ్ భీమాలో జరిగింది. కోరెగావ్ యుద్ధం మూడవ ఆంగ్లో-మరాఠా యుద్ధంలో భాగం. భీమా కోరేగావ్ విజయ స్తంభం! బీమా కోరేగావ్ యుద్ధం ఏమిటి అంటే ఇది బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యం, పీష్వా బాజీరావు నేతృత్వంలోని మరాఠా సైన్యం మధ్య జరిగిన ఒక రోజు యుద్ధం.

**యుద్ధం ఎందుకు జరిగింది? :** మరాఠా కూటమి (పూనాకు చెందిన పీష్వా, గ్వాలియర్ సిందియాలు, ఇండోర్ కు చెందిన హోల్కర్ లు, బరోడా గైక్వాడ్ లతో కూడినది) భారత్ లో ముఖ్యమైన సామ్రాజ్యాల్లో ఒకటి. 1770-1817 మధ్యకాలంలో జరిగిన ఆంగ్లో - మరాఠా యుద్ధాల తరువాత క్రమంగా బ్రిటిష్ వాళ్ళు పైచేయి సాధించారు. జూన్ 1817లో జరిగిన మూడవ ఆంగ్లో- మరాఠా యుద్ధంలో మరాఠాలు ఓడిపోవడంతో తమ రాజధాని అయిన పూనా వదిలి పీష్వా సురక్షిత ప్రాంతానికి వెళిపోవలసివచ్చింది.

**బీమా కోరేగావ్ నిర్ణాయక యుద్ధమా?**

కాదు. ఈ యుద్ధం 1818 జనవరి 1న జరిగింది. అప్పటికే, అంటే 1817 నవంబర్, 17నాటికే, పీష్వా పూనా వదిలి వెళిపోయాడు. ఆ రోజునే పూనా కోటపై బ్రిటిష్ జెండా (యూనియన్ జాక్) ఎగురవేశారు. ఈ యుద్ధం తరువాత జరిగిన పరిణామాల్లో మరాఠా సామ్రాజ్యం పూర్తిగా పతనమయింది. దానితో బ్రిటిష్ వాళ్ళు భారత్ ను పూర్తిగా చేజిక్కించుకున్నారు. ఛత్రపతి ప్రతాప్ సింహ్ మహారాజ్ ను బెనారస్ కు, పీష్వా బాజీరావ్ %××% ను బితూర్ కు ప్రవాసం పంపారు. అప్పుడు మొదలైన బ్రిటిష్ పాలన చీకటి అధ్యాయం ఆ తరువాత 150 ఏళ్లపాటు సాగింది. ఈ సుదీర్ఘ కాలంలో కిరాతకమైన బ్రిటిష్ విధానాల మూలంగా లక్షలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. పూనాను వదిలిపెట్టిన తరువాత పీష్వా బాజీరావ్ నేతృత్వంలోని మరాఠా సైన్యం ఎక్కడికి వెళ్లింది?

పీష్వా బాజీరావ్ అక్కడ నుంచి సతారా వెళ్ళి 28వేల మందితో (20వేల అశ్వికులు, 8వేల ఫిరంగులు) సైన్యం తయారుచేసుకుని బ్రిటిష్ వారి(ఈస్ట్ ఇండియా కంపెనీ) అధీనంలో ఉన్న పూనాపై దాడికి సిద్ధపడ్డాడు.

**పీష్వా ఎవరు? :** మరాఠా సామ్రాజ్యంలో ప్రధాన మంత్రిని పీష్వా అంటారు. పీష్వా బాజీ రావు కు చెందిన మరాఠా సైన్యాన్ని జనరల్ స్మిత్ నాయకత్వంలోని అపారమైన బ్రిటిష్ సైన్యం వెంటాడింది. కల్నల్ బర్ సైన్యం పూనాను ముట్టడించింది. తమను వెంబడిస్తున్న స్మిత్ సైన్యం నుండి తప్పించుకున్న పీష్వా మరికొంత సైన్యాన్ని కూడగట్టుకుని పూనా తిరిగివచ్చాడు. మరాఠా సైన్యం తిరిగి వస్తోందని తెలుసుకున్న కల్నల్ బర్ అదనపు బలగాలు పంపాలని సందేశం పంపాడు. శిరూర్ వద్ద ఉన్న బ్రిటిష్ బలగాలను సహాయం కోరాడు. దానితో లెఫ్టినెంట్ ఫ్రాన్సిస్ పాంటన్ నాయకత్వంలో కొంత సైన్యం శిరూర్ నుండి బయలుదేరి బర్ అదనపు బలగాలు పంపాలని సందేశం పంపాడు. శిరూర్ వద్ద ఉన్న బ్రిటిష్ బలగాలను సహాయం కోరాడు. దానితో లెఫ్టినెంట్ ఫ్రాన్సిస్ స్టాంటన్ నాయకత్వంలో కొంత సైన్యం శిరూర్ నుండి బయలుదేరి పూనా వైపు వచ్చింది. రాత్రంతా ప్రయాణించి ఆ బలగాలు ఉదయం 10 గం.లకు తలగోన్ గ్రామానికి చేరాయి. జనవరి, 1818న వాటికి బీమా నది అవతల మరాఠా సైన్యం ఎదురుపడింది. అప్పుడు యుద్ధం జరిగింది. దీనినిబట్టి ఈ యుద్ధం అనుకోకుండా జరిగినదేనని, ముందస్తు ప్రణాళికతో, సన్నద్ధతతో జరిగినది కాదని తెలుస్తోంది.

బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన ఏ దళాలు బీమా కోరేగావ్ యుద్ధంలో పాల్గొన్నాయి, అంటే యుద్ధంలో మొత్తం 824 మంది బ్రిటిష్ సైనికులు పాల్గొన్నారు. అందులో 24మంది యూరోపియన్ గన్నర్స్, ముంబై ఫిరంగి దళం 2వ బెటాలియన్ కు చెందిన 500 మంది, పూనా అశ్వదళానికి చెందిన 300మంది అశ్వికులు, ఫ్రాన్సిస్ స్టాటన్ నాయకత్వంలోని ఆరు పౌండ్ ల తుపాకులు కలిగిన సేన పాల్గొన్నాయి. బ్రిటిష్ సైన్యంలో యూరోపియన్ లు, ముస్లింలు, మరాఠాలు, మహార్ లు, రాజపుత్రులు, కొద్దిమంది యూదులు కూడా ఉన్నారు. మరాఠా సైన్యానికి చెందిన ఏ దళాలు బీమా కోరేగావ్ యుద్ధంలో పాల్గొన్నాయంటే.. బీమా కోరేగావ్ యుద్ధంలో 18వందల మరాఠా సైన్యం పాల్గొంది. మూడు దళాలకు చెందిన ఈ సైన్యంలో అరబ్‌లు (ముస్లింలు) - 600

గోసాయిలు - 600

అన్ని కులాలకు చెందిన మరాఠాలు - 600

మూడు దళాలకు బాపు గోఖలే, అప్పా దేశాయి, త్రయంబక్ జీ డెంగ్లే లు నాయకత్వం వహించారు.

> ప్రతీ ఏడాది అక్కడ ఎస్సి,ఎస్టీ, బిసి లు, బహుజనులు జనవరి ఒకటిన లక్షలాది మంది చేరుకొని నూతన సంవత్సరం ను జరుపుకుంటారు. డాక్టర్ బిఆర్అంబేద్కర్ వాదులు మూతికి ముంత, ముడ్డికి చీపురు అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడిన సమాజం. పీష్య బహ్మణ అరాచకాలను వ్యతిరేకించి వెట్టి చాకిరీ చేసియిస్తున్న చిత్రహింసలు పెట్టిన పెట్టిన పీష్య బ్రాహ్మణుల సైనికులను కేవలం 500 సైన్యం ఏర్పడి మహర్ సైన్యం 28000 మందిని తర్మి కొట్టిన, వారిమీద విజయం సాధించిన రోజు జనవరి ఒకటి. అది జనవరి ఒకటి 1818.

**బీమా కోరేగావ్ యుద్ధం ఎంత కాలం సాగింది?**

ఇది కేవలం ఒక రోజు యుద్ధం. ఉదయం 10 గం.ల నుండి రాత్రి 9 గం.ల వరకు జరిగింది. యుద్ధంలో చనిపోయినది ఎవరు? అంటే.. మొత్తం 834 మంది బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ సైనికులు బీమా కోరేగావ్ యుద్ధంలో పాల్గొన్నారు. వారిలో 275 మంది ప్రాణాలు కోల్పోవడమో, గాయపడటమో, గల్లంతు కావడమో జరిగింది. ఇద్దరు యూరోపియన్ సైనికాధికారులు చనిపోయారు. పదాతి దళంలో 50మంది చనిపోతే, 105మంది గాయపడ్డారు. ఫిరంగి దళంలో 12మంది చనిపోతే, 8మంది గాయపడ్డారు. ఇక బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ దళాల్లో పనిచేస్తు చనిపోయిన భారతీయ సైనికుల వివరాలు చూస్తే - 16మంది మరాఠాలు, 22 మంది మహర్ లు, 8 రాజపుత్రులు, 2 ముస్లిములు, 2 యూదులు, 11 మంది యూరోప్ సైనికులు ఉన్నారు. మరాఠా సైన్యం వైపు 500 గాయపడతామో జరిగిందని అంచనా.

**600 మంది చనిపోవడమో..**

రెండు పక్షాల్లో ఏదైనా తాము గెలిచినట్లు ప్రకటించుకుండా? లేదు. రాత్రికి యుద్ధం క్రమంగా ఆగిపోయింది, మరునాడు ఉదయానికల్లా మరాఠా సైన్యం ఆ ప్రదేశాన్ని వదిలి వెళ్లిపోయింది. తాము గెలిచామని ఏ బ్రిటిష్ అధికారీ ప్రకటించలేదు. 'బ్రిటిష్ విజయాన్ని' గురించి ఏ అధికారి ప్రకటన బ్రిటిష్ పత్రాల్లో ఎక్కడా లేదు.

బీమా కోరేగావ్ దగ్గర ఉన్న స్మృతి ఫలకంపై కూడా 'అది కోరేగావ్ రక్షణకు ప్రయత్నించినందుకు' గుర్తుగా ఏర్పాటు చేసినట్లు మాత్రమే ఉంది.

**బీమా కోరేగావ్ దగ్గర స్మారక స్థూపాన్ని ఎవరు ఏర్పాటుచేశారు?**


బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆ స్మారక స్తూపం ఎప్పుడు ఏర్పాటుచేశారు? బీమా కోరేగావ్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన బ్రిటిష్ సైనికుల స్మృత్యర్థం ఒక స్మారకాన్ని ఏర్పాటుచేయాలని ఎలిఫిన్ స్టోన్ 1818 జులై 6న వారన్ హేస్టింగ్స్ కు ఒక ఉత్తరం వ్రాశాడు. ఆ అభ్యర్థన స్మారకానికి సంబంధించిన నమూనా రూపొందించే పని మద్రాస్ ఫిరంగి దళంలోని జాన్ విలే కి అప్పగించారు. స్మారక నిర్మాణం 1822లో పూర్తయింది. స్థూపంపై చనిపోయిన, గాయపడిన బ్రిటిష్ సైనికుల పేర్లు చెక్కారు.

**బీమా కోరేగావ్ స్మారకం దేనిని సూచిస్తుంది?**

ఇది 'ప్రాచ్య దేశాల్లో బ్రిటిష్ సైన్యం సాధించిన అత్యంత ప్రతిష్టాత్మకమైన యుద్ధ విజయానికి' గుర్తు. స్థానిక పాలకుడిపై విదేశీ శక్తి విజయానికి ప్రతీక. స్మారక స్థూపం పై ఏమి చెక్కారు అంటే.. బీమా కోరేగావ్ స్మారక స్థూపం ఉన్న ప్రదేశంలో రెండు రాతి చెక్కడాలు కనిపిస్తాయి. వాటిలో ఒకటి, బీమా కోరేగావ్ యుద్ధాన్ని గురించి సంక్షిప్తంగా వివరించే బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఏర్పాటుచేసిన ఫలకం. రెండవది, ఆ తరువాత కాలంలో వివిధ యుద్ధాల్లో పాల్గొన్న పూనా ఆశ్వానికి %-%గౌరవంగా', గుర్తుగా ఏర్పాటుచేసిన ఫలకం. స్మారక స్థూపానికి రెండు వైపుల బీమా కోరేగావ్ గురించిన సంక్షిప్త వివరణ ఆంగ్లంలో ఉంటుంది. యుద్ధంలో పాల్గొన్న యూరోప్ అధికారులు, చనిపోయిన, గాయపడిన బ్రిటిష్ సైనికుల పేర్లు కూడా అందులో కనిపిస్తాయి. ఫలకానికి మరో రెండవ వైపుల యుద్ధంలో చనిపోయిన, గాయపడినవారి పేర్లు మరాఠీలో చెక్కి ఉన్నాయి.


**మహెర్ రెజిమెంట్**

మహెర్ రెజిమెంట్ అనేది ఇండియన్ ఆర్మీకి చెందిన పదాతి దళం. ఇది మొదట మహారాష్ట్రలోని మహర్ కమ్యూనిటీ కి చెందిన సైనికుల తో కూడిన రెజిమెంట్ గా భావించినప్పటికి, నేడు మహర్ రెజిమెంట్ ప్రధానంగా మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లోని వివిధ రాష్ట్రాల వర్గాలతో కలిసి, కూడిది గా ఉన్నది.అపార సైనిక బలం కలిగిన పిశ్వా రాజ్యంతో యుద్ధం చేయలేని బ్రిటిష్ వాళ్ళు తమతో కలిసి పోరాడాలని, మహర్ లను కోరినప్పుడు, పిశ్వా సైనికాధికారి బాపు గోఖలే వద్దకు అప్పటి మహర్ నేత వెళ్లి పశువులకన్నా హీనంగా చూడబడుతున్న తమకు గౌరవంగా బతికే అవకాశం ఇవ్వాలని, కోరాడు!అప్పుడు గోఖలే యుద్ధం చేసినా, చేయకున్నా, మీ బతుకు ఇంతే నని అన్నాడు. దీనితో వేల సంవత్సరాల బానిస సంకెళ్లు తెంచుకోవాలని, ప్రతీన బూనిన ఐదువందల మంది మహర్ సైన్యం, రెండువందల మంది బ్రిటిష్ సైన్యం తో కలిసి, 200 కిలోమీటర్లు నడిచి, భీమా నది ఒడ్డున చేరుకొని యుద్ధం చేసి గెలిచారు!



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
9951865223

# లోపించిన నిబద్ధత



భారతదేశ చరిత్రను ఒకసారి పరిశీలిస్తే ప్రపంచంలోనే ఒక ఆదర్శవంతమైన నీతి ధర్మ బద్ధమైన సంస్కృతి గల దేశమని ప్రపంచంలో కొనియాడబడింది. 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో భారతదేశానికి గొప్ప పేరు ప్రతిష్టలు తీసుకురావడానికి భారతీయ ప్రజల నిబద్ధత ముఖ్యమైంది. కాశ్మీర్ టు కన్యాకుమారి వరకు భారతదేశ విభిన్న సంస్కృతులు, ఆచారాలు వ్యవహారాలు, భాషలు, మతాలు కులాలు వేరైనప్పటికీ ఒక సమిష్టి కుటుంబంగా( ఉమ్మడి కుటుంబంగా) పెట్టని కోట వలె వెలుగొందిన భారతదేశంలో రోజురోజుకు విలువలు నీతి ,నిజాయితీ, ధర్మం సామాజిక కట్టుబాట్లు పూర్తిగా అడుగంటి పోతున్నాయి. అయితే సమాజంలో నెలకొన్న అసమానతలు సామాజిక ఆర్థిక వ్యత్యాసం తారతొమ్మి భేదం కనబడుతుంది. నిబద్ధత అనేది మనిషికి ఒక భూషణం వంటిది. అయితే మారిన కాల పరిస్థితుల్లో ఏమో తెలవదు కానీ మనిషిలోని విలువలు సామాజిక వ్యవస్థను విడనాడి నేల విడిచి సాము చేస్తున్న చందనంగా నేడు ప్రభుత్వ అధికారులలో, రాజకీయ నాయకులలో పూర్తిగా నిబద్ధత కురబడిందని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు. ఏదైనా ఒక సమస్యను పరిష్కరించడానికి నిబద్ధత కొరబడడంతో గంటలు రోజులు నెలలు సంవత్సరాలు గడిచినప్పటికీ సమస్య పరిష్కారం చేయడంలో అధికారులు మొగ్గు చూపడం లేదని తెలుస్తుంది. అయితే పైన పేర్కొన్న సామాజిక వ్యవస్థను భారతదేశాన్ని ప్రపంచపు అంచులో పతాక స్థాయిలో చూపినప్పటికీ నేడు అటువంటి నిబద్ధత కనబడకపోవడం వల్ల భారతీయ సంస్కృతి సాంప్రదాయాల పై విమర్శలు వినబడుతున్నాయి. కింది స్థాయి నుండి పై స్థాయి వరకు ఏ ప్రభుత్వ అధికారి అయిన ఫిర్యాదుదారుని పట్ల నిబద్ధతతో వ్యవహరించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గతంలో ఏ వ్యవస్థను తీసుకున్న గల్లీ నుండి ఢిల్లీ వరకు ఏ ప్రభుత్వ కార్యాలయంలో నైనా, ఏ రాజకీయ నాయకుడి దగ్గరికి పోయిన సమస్యను నమ్రతతో( వినియంతో) వినేవారు. అదే స్థాయిలో సమస్యను పరిష్కరించడానికి చాలావరకు చిత్తశుద్ధితో వ్యవహరించేవారు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న ప్రభుత్వ కార్యాలయాలలో పనులు చక చక చాయి పోయేటి సంస్కృతి ఉండేది. అయితే నేడు వీటిలో ఎక్కడ పనులు సక్రమంగా సాగడం లేదు ఏ పని చేసినప్పటికీ ఒక బాధ్యతాయుత అధికారిగా, ప్రజా ప్రతినిధిగా పనిచేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ వ్యవస్థ సమాజంలో చేపడుతున్న కార్యక్రమాలు ఏవి కూడా పూర్తిస్థాయిలో ఫలితాలు ఇవ్వకుండా ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్న విషయాన్ని పలువురు సామాజిక శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు. సోక్రటీస్ సామాజిక సిద్ధాంతం ప్రకారం మనిషి తన స్థాయిని బట్టి సామాజిక వ్యవస్థ పెంపుదలకు పని చేయాలన్న ఆలోచన ఉండాలని పేర్కొన్నారు. అయితే సామాజికవేతలు, గ్రామ పెద్దలు తీసుకునే నిర్ణయాలు సత్వర కార్యక్రమాలను చేపట్టడానికి అవకాశం ఉండేది. గ్రామీణ ప్రాంతాలలో సత్వర న్యాయం అందించడంలో గ్రామ పెద్దలు సమస్యను అర్థం చేసుకొని పరిష్కరించే దిశకు చేరుకునేది. కానీ నేడు న్యాయ, ధర్మ, విలువలు, కట్టుబట్లు ఇవన్నీ ఎక్కడ కనపడకుండా పోయినాయి. ఒక మనిషి మనిషిగా గౌరవించే రోజులు లేకుండా పోయాయి. ఒక సామాన్యమైన వ్యక్తి ఉన్నతమైన ప్రభుత్వ ఉద్యోగి దగ్గరికి పోతే అతడు కనీసం ఒక మనిషిగా ప్రవర్తించడం లేదు. తాను కూర్చున్న సీటు తన జీవితాంతం తానే అధికారిగా ఉంటాను అనుకున్నట్లుగా భావిస్తున్నాం అధికారులు సమాజంలో అనేక అలజడులకు కారకులు అవుతున్నారు. నేను మరి కొంతమంది మిత్రబృందం ఇటీవల హైదరాబాదులో ప్రభుత్వ నోడల్ ఆఫీసర్ ను కలవడానికి వెళ్ళినప్పుడు ఆ అధికారి ఐఏఎస్ అయినప్పటికీ సమస్యను వినడానికి తన సీటులో నుండి లేచి నిలబడి సమస్య ఏమిటి అని అడిగి 15 నిమిషాల పాటు తమతో చర్చించి సమస్యను పరిష్కరించే దిశగా తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినారు. ఇంత నిబద్ధతతో ఐఏఎస్ అధికారిని మాట్లాడిన తీరును బట్టి చూస్తే మా సమస్యను సగం అక్కడనే మర్చిపోయినాము. ఒక ఐఏఎస్ అధికారి అయినప్పటికీ ఫిర్యాదుదారులకు విలువను ఇచ్చి మాట్లాడిన తీరును బట్టి చూస్తే ఇప్పటికీ కొంతమంది నిబద్ధత గల అధికారులు ఉన్నారని అనుకున్నాను ఆమెకు చేతులెత్తి దండం పెట్టి బయటికి వచ్చినాము. అంటే ఒక మంచి అధికారి ఉంటే సమస్య సత్వరమే పరిష్కారము అవుతుంది అన్న నమ్మకం మనకు ఉంది. వర్సిటీ అధికారులలో లోపించిన నిబద్ధత: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలలో ఉన్నత అధికారులుగా చలామణి అవుతున్న వారందరిలో కొంతమంది తమ స్థాయిని మరిచి, నిబద్ధతను విడనాడి పనిచేస్తున్నారని. సమస్యను సమస్యగా పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వివరిస్తూ, సమస్యతో వెళ్లి ఉన్నత అధికారులకు తెలియజేయాలని పోతే కనీసం మాట్లాడడం కూడా చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే అధికారుల వ్యవహార శైలి పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏదైనా ఒక సమస్యను పరిష్కరించడానికి ఒక నిర్దిష్టమైన పరిష్కార దిశగా ఆలోచించకుండా కనీసం ఫిర్యాదు దారిని పట్ల మర్యాదపూర్వకంగా మాట్లాడడం లేదన్న అపవాదులు ఉన్నాయి.

మన భయం , ఆందోళనను నిబద్ధత మరియు చర్యగా మార్చవచ్చు. ఆ పరివర్తన భయాన్ని అంతరాయం కలిగిస్తుంది , నయం చేస్తుంది మరియు దానికి కారణమైన దానిపై డయల్‌ను కదిలిస్తుంది.మన ధ్రువీకరణ రాజకీయాల్లో (జాత్యహంకారం, సెక్సిజం, మిలిటరిజం) కనిపించే చీకటి నీడలను ఎదుర్కోవడంలో, మన స్వంత చీకటిని ఎదుర్కోవాలి, మన హృదయాలను స్వస్థపరచుకోవాలి. కాబట్టి, మన స్వంత జీవితాల కంటే పెద్ద ఉద్దేశ్యమైన దృష్టికి కట్టుబడి, మన స్వంత మనస్సులోని చిన్నతనం, చిన్నతనం నుండి మనం విముక్తి పొందుతాము, ఆందోళన, భయం నుండి ప్రేరేపిత చర్యగా మార్చబడతాము. మన శక్తినంతా మన వద్ద ఉన్న వాటిని రక్షించుకోవడానికి ప్రయత్నించే బదులు, మన పరిణామం తదుపరి దశ కోసం మన మానవ వ్యవస్థలన్నింటినీ తిరిగి సృష్టించడం, పునరుత్పత్తి చేయడంపై మన ఊహ , మన ప్రయత్నాలను కేంద్రీకరించవచ్చు. మాకు ఇప్పుడు కంటే ఎక్కువ స్ఫూర్తితో కూడిన చర్య అవసరమయ్యే సమయం ఎప్పుడూ లేదు. మానవులమైన మనం పరిణామాత్మకంగా దూసుకుపోవడానికి సిద్ధంగా ఉన్నాము. అందుకే మన భవిష్యత్తుకు కీలకమని నేను నమ్మే నిబద్ధత రంగాలకు సంబంధించిన కథలను ఈ పుస్తకంలో చేర్చాను. న్యాయ మైన, పర్యావరణ ఆర్థిక వ్యవస్థ. అత్యవసరంగా చేయాల్సింది చాలా ఉంది, కానీ ఇంకా సమయం ఉంది , మేము దీన్ని చేయగలము. భవిష్యత్తు గురించి తిరస్కరణ, నిరాశ లేదా నిస్సహాయతలోకి జారుకోవడం సులభం. అవును, మేము అనిశ్చిత భవిష్యత్తును ఎదుర్కొంటున్నాము: ఇంకా జీవించడానికి ఎంత సమయం ఉంది! రాబోయే సంవత్సరాల్లో మనం సమిష్టిగా చేసేది బహుశా రాబోయే వేల సంవత్సరా లలో గ్రహం భవిష్యత్తును నిర్ణయిస్తుంది. అది భయంకరంగా, విపరీతంగా లేదా భారంగా అనిపించవచ్చు. కానీ నా అనుభవం ఏమిటంటే, ఈ దృక్పథం మన జీవితాలను మెరుగుపరుస్తుంది , ఏ తరానికి ఎన్నడూ లేని అత్యంత అర్థవంతమైన జీవితాలను జీవించే అవకాశాన్ని ఇస్తుంది. ఏది ఏమైనా సమాజంలో తోటి వ్యక్తిని గౌరవించాలన్న ఆలోచన లేకపోతే ప్రజా ఉద్యమాలు, తిరుగుబాట్లు తలెత్తుతాయి అన్న ఆలోచన ప్రభుత్వ అధికారులకు లేకపోతే ప్రజా ఉద్యమాలు పెరిగిపోతాయి.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## 2025

కొత్త సంవత్సరం
పాత బంగారం లా
చింతతోపుత్రలో
చిలుకలు ఎర్రముక్కులతో
తలపెట్టి బయటకు చూస్తున్నట్లు
విరగకాసిన మామిడి తోటల్లో
జుంటితేనె టీగలు రాగాలు పోతున్నట్లు
సజ్జ జొన్నకంకులపై ఊరపిచుకలు
వాలుతున్నట్లు
కాలమంతా పూచిన కలల
పూల కాలమన్నట్లు
కుంటలు చెరువులు
ఆకలి తీర్చే వర్ష ఋతువు
మేఘాల కడవలతో
నింపు తున్నట్లు
నేల రైతు పాడి పచ్చగా
పరవశిస్తున్నట్లు
కనుల ముందు
పురివిప్పిన నెమలి
నాట్యంలా కాలం
సోయగాలు పోతుంది..
సమస్యలు సామరస్య ధోరణితో
యుద్ధాన్ని శాంతిపూల తోటగా
విశ్వకుటుంబం ఒకటిగా
తన ఆలోచనల రథం నడిపే వాడే
కాలానికి నాయకుడు
ఆ సంవత్సరానికి వక్త ప్రవక్త..

రేడియమ్
9291527757

## కవనబాల


మదిలో పుట్టాను
మహిలో పడ్డాను
కలమునుండి జారాను
కాగితముపైన కూర్చున్నాను

అక్షరాలను అయ్యాను
అర్థాలను అందించాను
పదాలరూపం పొందాను
ప్రాసలుగా మారాను

పంక్తులుగా పేర్చబడ్డాను
పూర్తిబొమ్మగా తయారయ్యాను
పుట్టినబిడ్డను అయ్యాను
పాఠకులచేతుల్లోకి వెళ్ళాను

మనసులు తట్టాను
మోదము కలిగించాను
పురిటిపిల్లను సాకండి
అల్లారుముద్దుగా పెంచండి

కవనబాలను
దీవించండి
కవిగారిని
గుర్తించండి




గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
భాగ్యనగరం

# ముదిరాజ్‌లను బీసీ-డీ నుండి బీసీ-ఏలో చేర్చాలి

**దక్షిణ భారతదేశంలో ఉన్న కులాలలో అతి పెద్ద కులంగా పులువబడుతున్నది ముదిరాజ్ కులం అని చెప్పాలి, తమిళనాడు కేంద్రంగా కలబ్ర రాజులకు వారసులుగా, ద్రావిడ ప్రజలుగా పిలువబడుతున్న వాళ్ళు ముదిరాజ్‌లు, అదేవిధంగా మధ్య యుగంలో విజయనగర రాజులకు సామంతులుగా సుదీర్ఘంగా పరిపాలన చేశారు.**

సుమారు మూడువందల ఏళ్ల పాటు పాలించిన ఘనత వీరికి ఉంది, అయితే దక్షిణ భారతదేశంలో ముస్లిం దండయాత్రను ఎదురించిన వారిలో వీరు కలరు, ' ముది " అనగా మొదటి "రాజు" పరిపాలకుడుగా ముదిరాజ్ అంటే మొదటి పాలకుడిగా చెప్తారు, ఆ విధంగా వివిధ రకాలుగా పేర్లు ఉద్భవించాయి, అందులో "ముతురాజ" "ముదిరాజ్" "మూత్రసి " " బంటు" కోలి " తెనుగు" తెనుగోళ్ళు " ఇలా పిలవడం జరుగుతోంది, అయితే ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ లో విస్తరించిన అతి పెద్ద కులం గా చెప్పవచ్చు,

**ప్రధాన ముఖ్యవృత్తి :** ప్రధానంగా చూస్తే అటు ఆంధ్ర లో కానీ, తెలంగాణ లో కానీ, విరి ప్రధాన వృత్తి పూర్వకాలంలో రాజులుగా ఉన్న వీళ్ళు రాచరికం పోయి వివిధ రకాల వృత్తులు చేపట్టడం జరిగింది, అందులో చెప్పుకుంటే "కావాలి"గా అంటే గ్రామ రక్షకుడిగా పనిచేశారు, చెరువులను లీజు కు తీసుకోని చేపలు పట్టడం, తోటలు గుత్తకు తీసుకోని వివిధ ప్రాంతాల్లో తిరిగి పండ్లు అమ్మడం, కొన్ని ప్రాంతాల్లో అయినే "హంటింగ్" అంటే "వేట" కూడా విరి వృత్తిగా చేసుకొని జీవనం సాగిస్తున్నారు అని చెప్పొచ్చు, ప్రధానంగా జీవనం కోసం రాచరికం పోయి నేడు కూలీలుగా మారారు, నేటికీ చేపలుపట్టి బ్రతుకుతున్న వాళ్ళు చాలానే ఉన్నారు.



**రాజకీయ వెనుకబాటు:** ముదిరాజ్‌లు గతంలో రాజులుగా ఉన్న వీళ్ళు నేడు రాజకీయంగా చాలా వెనకబడి ఉన్న జాతిగా చెప్పవచ్చు, ముదిరాజ్‌లు రాష్ట్రంలో సుమారు 12 శాతంపై ఉన్నారు అని చెప్పవచ్చు, వీళ్ళు అన్నీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తే వీరికి జనాభా ప్రకారం కనీసం ముప్పై సీట్ల పై వీళ్లకు లభించే అవకాశం ఉంటుంది, కానీ నేడు ఉన్న పరిస్థితి చూస్తే గత ప్రభుత్వం హయాంలో కేవలం ఒక్కరూ మాత్రమే ఎమ్మెల్యే ఉండటం జరిగింది అది కూడా ఈటెల రాజేందర్ గారు, ముఖ్యంగా వీళ్ళల్లో వీళ్ళకే రాజకీయ చైతన్యం లేకపోవడం, అధికంగా ముదిరాజ్ సంఘాలు పెట్టుకోవడం, ఉన్న సంఘాల నాయకులు కూడా కొద్ది పార్టీలకు అనుకూలంగా వ్యవహరించడం జరుగుతుంది, అయితే కొద్దో గొప్పో ఆర్థికంగా ఉన్న వాళ్ళు పోటీ చేయకపోవడం, వాళ్ళకు సొంత కులం వాళ్ళే మద్దతు ఇవ్వకపోవడం, వీళ్లకు బలంగా ఆస్తులు లేకపోవడం, కనీసం రెండు ఎకరాల లేనివాళ్ళు కూడా చాలా కుటుంబాలు ముదిరాజ్ జాతిలో ఉన్నారు అని చెప్పవచ్చు, అదే విధంగా ముదిరాజ్ లు చూస్తే సామాజికంగా మరియు అటు ఆర్థికంగా బలంగా లేకపోవడం మరొక కారణం గా చెప్పాలి.

**రిజర్వేషన్‌పరంగా అన్యాయం :** వాస్తవానికి రిజర్వేషన్ పరంగా అత్యధికంగా అన్యాయం ముదిరాజ్ లకు జరుగుతోంది అని చెప్పాలి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2009 లో అప్పటి వై ఎస్ రాజశేఖర రెడ్డి గారు అనంతరామన్ కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ ద్వారా ముదిరాజ్ లను బిసి-డీ నుండి బిసి -ఏ లోకి మార్చుతూ జివో నెంబర్ 15 ఇచ్చారు, బిసి- ఏ లో సీరియల్ నెంబర్ 1 గా చేర్చారు, దానిని సవాల్ చేస్తూ బీసీ ఏ కులాలూ వాళ్ళు హైకోర్టు లో కేసు వేయడం జరిగింది, అప్పటి హై న్యాయమూర్తులు జివో చెల్లదని తీర్పును వెలువరించింది, వాస్తవానికి రిజర్వేషన్ అనేది రాజ్యాంగ పరంగా అందరినీ సమాన హక్కులు లభించాలి, మనం గమనిస్తే ముదిరాజ్ ఉన్న జాతి అత్యంత వెనుకబడిన కులంగా చెప్పవచ్చు, వీళ్ళు సామాజికంగా, ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉన్నారు అని చెప్పవచ్చు, బీసీ -డీలో ఉండటం వల్ల వీళ్ళు ముమ్మానికి అన్యాయం జరుగుతుంది అని చెప్పవచ్చు, ప్రభుత్వ ఉద్యోగం కోసం సన్నద్ధం అవుతున్న ఎంతో మంది నిరాశ తో వెనకడుగు వేయాల్సి వస్తుంది, వీళ్లను బిసి - ఏ లో చేర్చడం ద్వారా కొంత మేర వెసులుబాటు కల్పించే విధంగా ఉంటుంది అని చెప్పాలి, కాబట్టి రాష్ట్ర బిసి కమిషన్ వెంటనే బీసీ జనాభా ప్రాతిపదికన అత్యంత వెనుకబడిన ఉన్న కులాల జాబితా తీసి సమాన అవకాశాలు అందే విధంగా చేయాలి, ముదిరాజ్ లను సైతం బిసి - డీ నుండి బీసీ - ఏ లోకి మార్చి జివో నెంబర్ 15 అమలు చేసే విధంగా చేయాలి, అదేవిధంగా రాష్ట్రం ప్రభుత్వం ముదిరాజ్‌లకు న్యాయం చేయాలని కోరుకుందాం..!



కిరణ్ ఫిషర్ అడ్వకేట్
సెల్: 7989381219

# గ్రామపంచాయతీ కార్మికుల వేతన..వేదన..

- మూడు నుండి నాలుగు నెలలుగా అందని జీతాలు
- ఆర్థిక ఇబ్బందుల్లో గ్రామపంచాయతీ సపాయి కార్మికులు
- నిధులు విడుదల చేయాలని వేడుకోలు

**బొంరాస్‌పేట, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** సూర్యుడు పొడవకముందే ఇంటింటా తిరుగుతూ చెత్తబండి వచ్చిందమ్మా తడి చెత్త వేరు చేసి ఇవ్వండమ్మ ..అంటూ గ్రామంలో తిరుగుతూ ఊరును శుభ్రం చేస్తున్న సఫాయి కార్మికుల బాధలు వర్ణ రహితం..బొంరాస్ పేట,దుద్యాల మండలాల్లోని 47 గ్రామపంచాయతీలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నుండి నాలుగు నెలలుగా జీతాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమాతమవుతున్నామని వాపోతున్నారు. అందరూ ఉద్యోగులకు ఇచ్చినట్లే మాకు కూడా నెల నెల జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామపంచాయతీలను నడపడం పంచాయతీ కార్యదర్శులకు పెను మీద సవాలుగా మారింది. ఇప్పటికే పలు గ్రామపంచాయతీలో కార్యదర్శులు అప్పులు తెచ్చి మరి పరిపాలన సాగిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.ఇప్పటికైనా గ్రామపంచాయతీలకు నెల నెల నిధులు కేటాయించి గ్రామపంచాయతీలోని సమస్యలు పరిష్కరించడం, గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని గ్రామపంచాయతీ కార్మికులు కోరుతున్నారు.



### కుటుంబపోషణ భారం



గత మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం నెలనెలా క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలి.

బి. సత్యమ్మ, జీపీ కార్మికురాలు, కొత్తూరు

### జీతాలు సకాలంలో చెల్లించాలి



ఉదయం నుండి సాయంత్రం వరకు గ్రామంలో అన్ని రకాల పనులు చేస్తూ ప్రజలకు సేవ చేస్తున్న మాకు జీతాలు సకాలంలో చెల్లించాలి.

కిష్టప్ప, జిపి కార్మికుడు, నాగిరెడ్డిపల్లి

# రోగులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

- నాణ్యత గల ఆహారం పొందడమే ఆహార భద్రత చట్టం-2013 లక్ష్యం
- రోగులకు నాణ్యమైన ఆహారం అందించకపోతే చర్యలు తప్పవు
- ఉస్మానియా హాస్పిటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన
- తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**కల్వకుర్తి, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** ప్రతి ఒక్కరు నాణ్యత గల ఆహారం పొందడమే ఆహార భద్రత లక్ష్యమని ఆహార భద్రత కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి, కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్ అన్నారు.మంగళవారం ఉస్మానియా హాస్పిటల్ లో ఫుడ్ కమిషన్ చైర్మన్ మరియు సభ్యులు భోజనాన్ని పరిశీలించారు. రోగులకు భోజనం సరిగ్గా అందుతుందా లేదా వారికి మెనూ ప్రకారం భోజనం పెడ్తున్నారా లేదా పరిశీలించడం జరిగింది.రోగుల ఆహారం కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తుంది అని ఆరోగ్యకరమైన భోజనం తీసుకోవడం రోగుల హక్కు అని నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ ఆక్ట్-2013 ఉద్దేశం అని తెలిపారు. రోగులకు పెడుతున్న ఆహార నిల్వలను, కూరగాయలను బియ్యం నిల్వలను చపాతీలను నాణ్యతను పరిశీలించారు.ఎగ్స్ చిన్నగా ఉండడం కమిషన్ బృందం దృష్టికి తీసుకొచ్చారు. ఇదే విషయంపై ఎగ్స్ సప్లయరును వివరణ కోరడం జరిగింది.ఇలాగే సప్లై చేస్తే చర్యలు తప్పవని కమిషన్ చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికి నాణ్యమైన ఆహారం అందడమే చట్టం ఉద్దేశమని పౌష్టిక ఆహారం అందించాలనేది చట్టంలో విపులంగా ఉందని ప్రజలకు ఉన్న హక్కులపై వారికి తెలిసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారి.చట్టం పరిపూర్ణంగా అమలు అయితేనే లక్ష్యం నెరవేరుతుందని కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అధికారులకు చెప్పడం జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో హాస్పిటల్ సూపరింటెండెంట్, ఆర్ఎంఓ, అధికారులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే భరోసా



**కల్వకుర్తి, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** కల్వకుర్తి పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు భాను, శ్రీనాధ్ నిన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి వారి మృతదేహాలకు పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తదుపరి ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ విష్ణు ఆత్తగారు లింగమ్మ చనిపోయిన విషయం తెలిసి ఆమె మృత దేహానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వెల్దండ మండలం చెదురుపల్లికి చెందిన వోవనమ్మ మరియు రావిచెట్టుబావి తాండకి కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త కీమ్యా నాయక్ యువ నాయకులు రాహూల్ తండ్రి ల కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణ ఆర్థిక సహాయం ఆందించారు. అనంతరం మండల నికి సంబంధించిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రెండు లక్షల 50 వేల చెక్కులను మండల ముఖ్య నాయకుల సమక్షంలో లబ్ధిదారులకు అందజేశారు.

# భారతీయ జనతా పార్టీ బలోపేతమే లక్ష్యం

- స్థానిక సంస్థల్లో భాజపా సత్తా చాటాలి
- త్వరలో మండల స్థాయి కమిటీలు
- ఎన్నికల ఇంచార్జ్ జగదీశ్వర్ పాటిల్



**సంగారెడ్డి ప్రతినిధి , డిసెంబర్ 31 (జనంసాక్షి) :** భారతీయ జనతా పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఎన్నికల ఇంచార్జ్ జగదీశ్వర్ పాటిల్ పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని కంకోల్ అభిషేక్ ఫంక్షన్ హాల్ లో మునిపల్లి మండల ఇంచార్జ్ శ్రీనివాస్ కురుమ అధ్యక్షతన భారతీయజనతాపార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎన్నికల ఇన్చార్జ్ జగదీశ్వర్ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అన్నారు. వచ్చే స్థానిక సంస్థల్లో సర్పంచ్, ఎంపీటీసీతోపాటు జెడ్పిటిసి, మున్సిపల్ స్థానాలలో భాజాపా అభ్యర్థులు విజయం సాధించేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోవు రోజుల్లో మునిపల్లి మండల నూతన అధ్యక్షులను ఎన్నుకోవడం జరుగుతుంది అన్నారు. జిల్లాస్థాయి అధికారులతో చర్చించి నూతన కమిటీని ఎన్నుకున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో నూతన అధ్యక్షుని ఎన్నికకొరకు మునిపల్లి మండల్ ఇంచార్జి శ్రీనివాస్ కురుమ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ముత్తిరెడ్డి, మండల సీనియర్ నాయకులు బస్వారాజ్ పాటిల్, రామకృష్ణ పాటిల్ , అయ్యప్ప స్వామి ,సిద్దయ్య సెట్, సంగయ్యస్వామి , విజయరామ్ పాటిల్, జైపాల్ రెడ్డి, కృష్ణమూర్తి ,పెద్దలోడీ రాజు, కర్ణం, రాంచందర్ రావు, పడమటి నాగిశెట్టి, సురేష్, నగేష్, సుమన్,భూదేరా సాయి, బూత్ కమిటీ అధ్యక్షులు పోలీసువీరన్న పాటిల్, జి వీరన్న పాటిల్, పట్లోల సుధాకర్, నవీన్, బుచ్చిరాములు, శేఖర్, మల్లేశం, ధనుష్, ఖాలీదాస్, ప్రవీణ్, శ్రీశైలం, మహిపాల్, మాణిక్యం, రఘు, మహేష్, సాయిబాబా, సురేష్, రాజు రెడ్డి, షైక్ ఫైమ్ మరియు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిమ్స్ ఆస్పత్రిలో పనిచేసే ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివి

- ఘనంగా సన్మానించిన డైరెక్టర్ నగరి బీరప్ప



**ఖైరతాబాద్, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** నిమ్స్ ఆసుపత్రిలో పనిచేసే ఉద్యోగుల సేవలను వెలగట్టలేనిదని డైరెక్టర్ బీరప్ప అన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు పదవీ విరమ ణ చేశారు. మంగళవారం ఆసుపత్రి మొదటి అంతస్థులోని లెర్నింగ్ సెంటర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ నగరి భీరప్ప వారిని ఘనంగా సత్కరించి, వారు ఆసుపత్రికి అందించిన సేవల్ని కొనియాడారు. పదవీ విరమణ పొందుతున్న వారిలో ఎం. అరుణ సీనియర్ అసి స్టెంట్, గులాం వారీస్ వార్సీ ప్లంబర్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డా.శాం తివీర్, అడిషనల్ మెడికల్ సూప రింటెండెంట్ డా.లక్ష్మి భాస్కర్, వివిధ ఉద్యోగుల సంఘ నాయ కులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొ ని పదవీ విరమణ చేస్తున్న తోటి ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.

## నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

- ఎరువులు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్



**జోగిపేట, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** నకిలీ విత్తనాలు ఎరువులు అమ్మిన డీలర్ల పై చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్ హెచ్చరించారు. జోగిపేట వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరై పట్టణంలో ఉన్న ఎరువుల విక్రయ కేంద్రాలను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. రబీ సీజన్‌లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా డీలర్లు చూడాలని అన్నారు. విక్రయాలకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. వడగళ్ల వానల నుంచి అంతరాయం కలగకుండా ఉండలంటే ముందుగానే నాట్లు వేసినట్లయితే వరి పంట ముందే కోతకు వచ్చి వడగళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చని సూచించారు. రైతులు పంట మార్పిడి చేయడం వలన ఎన్నో లాభాలు ఉన్నాయని తెలిపారు. వరి నారును చలి నుంచి కాపాడుకొనుటకు రాత్రి వేళల్లో నీరు నిండుగా ఉంచి తెల్లవారు జామున తీసివేసి క్రొత్త నీరు పెట్టుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అందోల్ మండల వ్యవసాయ అధికారి శ్రీహరి, మండల ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్లు, కార్మికుల కోసం మెగా ఐ కేర్ శిబిరం



**శంషాబాద్, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** జీఎంఆర్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ సహకారంతో 28, 29, తేదీల్లో మెగా ఐ కేర్ క్యాంపు నిర్వహించారు. డ్రైవర్లకు, వివిధ ఏజెన్సీలకు అనుబంధంగా ఉన్న వారితో పాటు స్వతంత్ర ఆపరేటర్లకు, విమానాశ్రయ పర్యావరణ వ్యవస్థలోని కార్మికులకు ప్రత్యేకంగా సేవలందించారు. ఈ శిబిరంలో ఉచిత కంటి పరీక్షలు, కళ్లద్దాలు, కీలక ఆరోగ్య ను అందించారు. భద్రతను ప్రోత్సహించడానికి, సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి కంటి ఆరోగ్యంపై దృష్టి పెట్టడం ద్వారా జీఎంఆర్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం తన శ్రామిక శక్తి శ్రేయస్సు పట్ల నిబద్ధతో పనిచేస్తుందన్నారు.

# పీజేపీ క్యాంపులో కోర్టు సముదాయం






- నిర్మాణానికి ముఖ్యమంత్రి సానుకూలం

**గద్వాల నడిగడ్డ, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** గత 14 రోజులుగా చేస్తున్న నిరసన దీక్షలకు సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని ఎంపీ మల్లు రవి తమకు తెలిపినట్లు జోగులాంబ గద్వాల జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురాం రెడ్డి, ఉపాధ్యక్షులు ఎండి ఖాజా మైనుద్దీన్ దీక్షను విరమణ విరమిస్తున్నట్లు వారు తెలిపారు. పిజెపి క్యాంప్ లోనే జిల్లా కోర్ట్ సముదాయాన్ని నిర్మించాలనే మా విజ్ఞప్తి పై నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, ఏఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ మంగళవారం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సనుకులంగా స్పందించేలా చేశారనీ, న్యాయవాదులతోపాటు అన్ని వర్గాల వారి అభ్యర్థన మేరకు జిల్లా న్యాయస్థాన సముదాయ నిర్మాణం జిల్లా కేంద్రంలోని జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చి దీక్షలు వెంటనే విరిమించాలని కోరడం జరిగిందనీ, ఎంపీ, మాజీ ఎమ్మెల్యే ఇచ్చిన హామీని పరిగణలోకి తీసుకొని దీక్షలను విరమిస్తున్నామన్నారు. గురువారం నుండి యధావిధిగామని విధులకు హాజరవుతామనీ, కక్షిదారులు, సామాన్య ప్రజల కోసం ముందుకు కొనసాగుతామని, మా సమస్యను ఎంపీ మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ల దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్రను వహించిన గద్వాల కాంగ్రెస్ ఇంచార్జ సరిత తిరుపతయ్య కి, కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలన్నారు. ఈ ఉద్యమంలో మాతో కలసి వచ్చిన బిజెపి, బిఆర్ఎస్, ఎంఐఎం, సిపిఐ, బీఎస్పీ, సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులకు, ప్రజా సంఘాలకు, కుల సంఘాలకు, వృత్తి, విద్యార్థి, ఉద్యోగ ఉపాధ్యాయ, డాక్టర్ల సంఘాల నాయకులకు, కార్మిక, కర్షక సంఘాలకు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలుపుతున్నామనీ వారన్నారు.

# రూ. 56.23 లక్షల విలువ అల్ప్రాజోలం పట్టివేత

- రూ. 40 లక్షల కారు, ఇద్దరు నిందితుల అరెస్టు
- మెదక్ అసిస్టేంట్ కమిషనర్ జి. శ్రీనివాసరెడ్డి



**సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** నిషేదిత ఎన్‌డీపీఎస్ డ్రగ్స్‌గా పిలువబడే అల్ప్రాజోలం టాబ్లెట్స్, కోడినెట్ సిరప్ బాటిళ్లను సంగారెడ్డి జి ల్లా జహీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఎలా ఉన్నాయి. కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు వస్తున్న రూ. 40 లక్షల ఖరీదైన కారులో అల్ప్రాజోలం టాబ్లెట్స్ , కోడినెట్ సిరప్ బాటిళ్లను తీసుక వస్తున్నారనే సమాచారం మేరకు సంగారెడ్డి జి ల్లా జహీరాబాద్ మాడిగి ఆర్‌టీఏ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా కారును నిలిపి తనిఖీలు చేస్తుండగా అందులో అల్ప్రాజోలం రూ.15.95 లక్షల విలువ చేసే 7500 ఆల్ప్రాజోలం టాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నాట్లు తెలిపారు. టాబ్లెట్లతోపాటు రూ. 28 వేల విలువ చేసే 150 నిషేదిత కోడినేట్ సిరప్ బాటిళ్లను స్వాధీనం చేసకున్నారు. వీటితోపాటు రూ.40 లక్షల విలువ చేసే కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కారు ఆల్ప్రాజోలం టాబ్లెట్లను తీసుక వస్తున్న ఎండీ అస్లమ్, ఎండీ. అలీమ్‌ఖాన్‌లను అరెస్టు చేశారు. కర్ణాటక నుంచి ఆల్ప్రాజోలం టాబ్లెట్లను తీసుకొని వచ్చి మసాబ్‌ట్యాంక్ ప్రాంతంలోని అనుమతి లేని షాద్ మెడికల్ షాపులో అమ్మకాలు జరుపుతుంటారని తెలిసింది. నిషేది ఆల్ప్రాజోలం టాబ్లెట్లను డ్రగ్ ఇన్‌స్పెక్టర్లతో పరీక్షలు చేయించి వారి నిర్ధారణ అనంతరం కేసులు నమోదు చేసినట్లు మెదక్ అసిస్టేంట్ కమిషనర్ జి . శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆల్ప్రాజోలం టాబ్లెట్లను పట్టుకున్న టీమ్‌లో సీఐ సిహెచ్ చంద్రశేఖర్, ఎస్సై బి.యాదయ్య, కానిస్టేబుళ్లు కెఏ సతీష్, జె. రామారావు నాయక్, ప్రహ్లాద్‌రెడ్డి, డి. వివేక్, ఖరీప్‌లు ఉన్నారు. ఆల్ప్రాజోలం టాబ్లెట్లను పట్టుకున్న ఎక్సైజ్ అధికారులను, సిబ్బందిని ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డ్కెరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి, మెదక్ డిప్యూటి కమిషనర్ హరికిషన్, అసిస్టేంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి అభినందించారు.

# ప్రజావాణి ద్వారా బాధితుడికి వీల్‌చైర్ ప్రదానం

- ప్రజావాణిలో 354 అర్జీల నమోదు
- పాల్గొన్న చిన్నారెడ్డి, దివ్య

**హైదరాబాద్, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** పక్షవాతం వచ్చి కాలు, చేయి పని చేయకుండా పోయిన వ్యక్తికి ప్రజావాణి ద్వారా రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇన్చార్జి డాక్టర్ జి. చిన్నారెడ్డి వీల్ చైర్ ను అందజేశారు. మంగళవారం మహాత్మ జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో లబ్ధిధారునికి చిన్నారెడ్డి వీల్ చైర్ ను అందజేశారు. హైదరాబాద్ లోనే కాటేదాన్ టిఎంజి కాలానికి చెందిన ఎన్ శేఖర్ ప్రైవేట్ కంపెనీలో వాచ్మెన్‌గా పనిచేస్తూ జీవనాన్ని సాగిస్తున్నారు. ఈ క్రమంలో అనారోగ్య సమస్యలు ఏర్పడి పక్షవాతం తో కుడికాలు కుడి చేయి పంచడం మానేశాయి. తన సమస్యను విన్నవించుకునేందుకు శేఖర్ మొదటిసారిగా మంగళవారం ప్రజావాణికి వచ్చారు. శేఖర్ నడవలేని పరిస్థితిని గమనించిన చిన్నారెడ్డి ప్రజావాణి ద్వారా వీల్ చైర్ లో అందజేశారు. దీంతో శేఖర్ సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. ఆనంద భాష్పాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చిన్నారెడ్డికి, దివ్యకు శేఖర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజావాణి బాధ్యులు రాకేష్ రెడ్డి, జగన్, సాయి, సహదేవ్, శేషు, తదితరులు పాల్గొన్నారు.



### ప్రజావాణిలో 354 అర్జీల నమోదు

మహాత్మ జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో మంగళవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 354 అర్జీలు నమోదు అయ్యాయి. ప్రజావాణి ఇన్చార్జి డాక్టర్ జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కొన్ని ఆర్జీలపై ఎండార్స్ మెంట్ చేసి సంబంధిత అధికారులకు పంపారు. పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్ కు సంబంధించి 141 అర్జీలు, విద్యుత్ శాఖకు 71, రెవెన్యూ శాఖకు 42, ఇతర శాఖలకు సంబంధించి 100 అర్జీలు అందాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
01 జనవరి 2025

# స్విమ్మింగ్‌లో అంతర్జాతీయ స్థాయి పథకాలను కొల్లగొట్టాలి

• పిఏసి చైర్మన్ అరికెపూడి






**శేరిలింగంపల్లి, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** స్విమ్మింగ్‌లో మంచి నైపుణ్యాన్ని పెంపొందించుకొని అంతర్జాతీయ స్థాయిలో రాణించడం ద్వారా పథకాలను కొల్లగొట్టాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సిఎం కప్ - 2024' స్విమింగ్ విభాగంలో మొదటి రోజు ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి తదితరులతో కలిసి పిఏసి చైర్మన్ ముఖ్యఅతిథిగా పాల్గొని తన చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం కప్ 2024 లో భాగంగా తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్విమింగ్ పోటీలు నిర్వహించడం చాలా అభినందనియమని, స్విమ్మింగ్ మంచి వ్యాయమం అని ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. క్రీడాకార్లుల్లో దాగిన అంతర్గత శక్తిని వెలికితీసి వారి ప్రతిభాపాటవాలను ప్రదర్శింపజేస్తూ అత్యున్నతస్థాయికి వారిని తీర్చిదిద్దడమే స్విమ్మింగ్ పోటీల ముఖ్య ఉద్దేశం అన్నారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబర్చి పథకాలు సాధించి ఓవైపు భారతదేశం పేరు, మరోవైపు తెలంగాణ రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేయడం ద్వారా వారి వ్యక్తిగత అభివృద్ధిని సైతం కాంక్షించవచ్చు అన్నారు. స్విమ్మింగ్ పోటీలలో పాల్గొనే ప్రతి ఒక్కరూ ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, అందుకోసం కఠోర సాధనను కొనసాగించడం ద్వారా స్విమ్మింగ్ లో రాణించడంతోపాటు కుటుంబ, వ్యక్తిగత ఎదుగుదలకు పునాదులను నిర్మించుకోవాలని అరికెపూడి సూచించారు. స్విమ్మింగ్ వలన దేహ దారుఢ్యం లభిస్తుందని, శారీరక శ్రమతోపాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని, స్విమ్మింగ్ పోటీలు నిర్వహించిన నిర్వాహకులను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఉమేష్, మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు ప్రసాద్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# చీపిర్లతో రోడ్లను శుభ్రం చేసి నిరసన



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మెలో భాగంగా 22వ రోజు మంగళవారం నాగర్ కర్నూల్ పాత కలెక్టరేట్ నుంచి పోలీస్ స్టేషన్, అంబేద్కర్ చౌరస్తా వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు.సమగ్ర శిక్ష ఉద్యోగులు రోడ్డు ఊడ్చి వినూత్న రీతిలో తమ నిరసన వ్యక్తం చేశారు మహిళా ఉద్యోగులతో కలిసి పురుషులు కూడా చీపుర్లు పట్టి రోడ్లను శుభ్రం చేశారు.ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ జేఏసీ అధ్యక్ష, ప్రధాన, కార్యదర్శులు మురళి, ఉమాదేవి, లలిత మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని గత 22 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.నిన్న రాష్ట్రస్థాయి ఉద్యోగులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయని ఎలాంటి హామీ ఇవ్వలేదని, సమ్మె కొనసాగుతుందని, ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చాలీచాలని వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోయినా ఏళ్ల తరబడిగా విధులు నిర్వర్తిస్తున్నామని, ఎన్నికలకు ముందు అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, వెంటనే న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి తమ ఉద్యోగాల క్రమబద్ధీకరణ విషయంలో ఇచ్చిన హామీనీ నిలబెట్టుకోవాలని నాగర్ కర్నూల్ ఉద్యోగులు డిమాండ్ చేశారు.

## జనవరి 4న వనపర్తికి మల్లు భట్టి విక్రమార్క

**వనపర్తి బ్యూరో, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** జనవరి 4వ తేదీన వనపర్తి నియోజకవర్గ పరిధిలోని గోపాల్పేట, రేవల్లి మండలాలలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటించనున్నారని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జనవరి 4వ తేదీ శనివారం రోజున మధ్యాహ్నం 2 గంటలకు రేవల్లి మండల పరిధిలోని తల్పునూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించనున్నారు,మధ్యాహ్నం 3 గంటలకు గోపాల్పేట మండలం ఏదుట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11కెవి విద్యుత్ ఉపకేంద్రంను ప్రారంభించనున్నారు. అనంతరం గోపాల్పేట మండల కేంద్రంలోని పద్మావతి గార్డెన్‌లో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొననున్నారు.ఈ కార్యక్రమానికి జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.జి. చిన్నారెడ్డి , పార్లమెంటు సభ్యులు, డాక్టర్ మల్లు రవి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి పాల్గొంటారు. కావున ఇట్టి కార్యక్రమానికి వనపర్తి నియోజకవర్గ పరిధిలోని గోపాల్పేట, రేవల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో పాటు, వనపర్తి,పెబ్బేర్ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు ఉపాధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు అన్ని మండలాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండలాధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సింగిల్ విండో అధ్యక్షులు, డైరెక్టర్లు, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు, వ్యవసాయ అనుబంధ సంఘాల నాయకులు, ,యువజన విభాగం నాయకులు, మహిళా సంఘాల అధ్యక్షురాలు ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

# కొండాపూర్ గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ దగ్ధం

• గ్యాస్ సిలిండర్ పేలుడే కారణమంటున్న అధికారులు



**శేరిలింగంపల్లి, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ రాజరాజేశ్వరి కాలనీ పరిధి గెలాక్సీ అపార్ట్మెంట్ లో మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గెలాక్సీ అపార్ట్మెంట్ లోని తొమ్మిదవ ఫ్లోర్ లో గ్యాస్ లీక్ అవడంతోపాటు సిలిండర్ కు ఒక్కసారిగా మంటలు అంటుకొని సిలిండర్ పేలడంతో అగ్ని ప్రమాదానికి కారణమైనట్లు అధికారులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో ఇంట్లో ఒకరు ఉన్నట్లు తెలుస్తుందని చెబుతున్న అధికారులు అతడు పరిస్థితిని వెల్లడించలేదు. కాగా అకస్మాత్తుగా మంటలు బయటకు వస్తుండడంతో గమనించిన కింది ఫ్లోర్ ల యజమానులు, స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సకాలంలో సంఘటన స్థలానికి చేరుకొని ఫైర్ ఇంజన్ల ద్వారా మంటలను పూర్తిగా ఆపివేసినట్లు తెలిసింది. తొమ్మిదో ఫ్లోర్ లోని మంటలు పక్క ఫ్లాట్లకు, క్రింది అంతస్తులకు విస్తరించకపోవడంతో ఆయా ప్లాట్ల యజమానులు ఊపిరి పీల్చుకున్నారు. గచ్చిబౌలి పోలీసులు కేసును నమోదు చేసుకున్నామని, ప్రమాదానికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

## రోడ్డు కోసం ఎమ్మెల్యే వినతి



**అల్వాల్, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** వెంకటాపురం డివిజన్ వెంకటేశ్వర నగర్ కాలనీ కమిటీ సభ్యులు గౌరవ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలసి, కాలనీ నుంచి హనుమాన్ గుడికి వెళ్లే పాదయాత్ర రోడ్డును ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సబిత అనిల్ కిషోర్ గౌడ్, మేడ వెంకట సురేష్ కుమార్, నాగేశ్వర్ రావు, జ్ఞానేశ్వర్, నారాయణ రెడ్డి, వెంకట రత్నం, ప్రభాకర్ రావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికి సేవలు గుర్తింపునిస్తాయి



**హైదరాబాద్, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** ప్రతి ఉద్యోగికి తాము అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. జిహెచ్ఎంసి పరిధిలో వివిధ కేటగిరీల లో పనిచేసిన 14 మంది ఉద్యోగులకు ఉద్యోగ వయోపరిమితి పూర్తయిన నేపథ్యంలో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో మంగళవారం రిటైర్మెంట్ వీడ్కోలు సభను నిర్వహించి, వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ... రిటైర్మెంట్ పొందుతున్న ఉద్యోగులు తమ ఉద్యోగ జీవితంలో ఎంతో నిబద్ధత, అంకిత భావంతో సంస్థకు సేవలందించారన్నారు. వారి కృషి, అందించిన సేవలు తమ సహచర ఉద్యోగులకు స్ఫూర్తిదాయకమన్నారు. రిటైర్మెంట్ అనేది జీవితంలో కొత్త అధ్యాయం లాంటిదని, రిటైర్మెంట్ పొందిన ఉద్యోగులు తమ ముందు జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా సుఖ సంతోషాలతో గడపాలని ఆయన ఆకాంక్షించారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగస్వాములు అయ్యారని వారి సేవలను కొనియాడారు.

## ప్రతి ఒక్కరికి గెలుపును అందించే సంవత్సరం కావాలి

• జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుభాకాంక్షలు తెలిపారు. 2025 వ సంవత్సరం జిల్లా ప్రజలు ప్రతి ఒక్కరికి శుభాలను చేకూర్చాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని అభిలషించారు. నూతన సంవత్సరంలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని మరింత పట్టుదల, కృషితో విజయాలను కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికి గెలుపును అందించే సంవత్సరం కావాలని కలెక్టర్ అభిలషించారు. తనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు బొకేలు, పుష్ప గుచ్చాలు తీసుకురావద్దని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# ప్రైవేటు కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

• యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రంగస్వామి



**గద్వాల నడిగడ్డ, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ప్రైవేటు కోచింగ్ సెంటర్లను నడుపుతున్న యాజమాన్యపై చర్యలు తీసుకోవాలనీ మంగళవారము యు ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వామనపల్లి రంగస్వామి గద్వాల ఎంఈఓ కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు విద్యార్థులకు కోచింగ్ ఇస్తూ విద్యార్థులను మానసికంగా ఇబ్బంది చేస్తున్నారనీ,కోచింగ్ సెంటర్లను గోదాంలోనూ మూడో అంతస్తులను కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నారనీ, విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, ఫేక్ బోనఫైడ్లు సృష్టించి విద్యార్థులను పరీక్షలకు రాయిస్తున్నారనీ, ఒక్కొక్క విద్యార్థి నుంచి 20 నుంచి 30 వేల వరకు ఫీజు వసూలు చేస్తూ సరైన సౌకర్యాలు కూడా కల్పించకపోవడం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనీ, కోచింగ్ సెంటర్లు నడుపుతూ అందులోని హాస్టల్ ను ఏర్పాటు చేసి విద్యార్థులను ఒక్కొక్క గదిలోనే బంధించి చదువు పేరుతో విద్యార్థులను మానసిక శారీరకంగా హింసకు గురి చేస్తున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలనీ, జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు కోచింగ్ సెంటర్లపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు నరేష్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియ పరిశీలించిన ఎంపీడీవో



**కల్లూరు, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహాల సర్వే కార్య క్రమం కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీలో ముమ్మరంగా కొనసాగుతూ 83 శాతంపూర్తయింది. మరో 17శాతం సర్వే ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 31 వరకు సర్వే ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం కల్లూరు మండలం లోని జిడిబి పల్లి, ఖాన్ ఖాన్ పేట, హనుమా తండా తదితర గ్రామాలలో సర్వే ప్రక్రియ కొనసాగించారు.దీనిలో భాగంగా ప్రజా పాలనలో దరఖాస్తు పెట్టుకున్న లబ్దిదారులు కొంతమంది అందుబాటులో లేని వారికి మొబైల్ నంబర్కు ఫోన్ చేసి నివాస గృహాల వద్ద అందుబాటులో ఉంటూ సర్వే సిబ్బందికి సహకరించాలని సర్వే సిబ్బంది సమాచారం అందించారు. కల్లూరు ఎంపీడీవో దయాగల చంద్రశేఖర్, కల్లూరు మేజర్ గ్రామపంచాయతీ ఈవో నందిశెట్టి నాగేశ్వరరావు, సర్వే సిబ్బందితో కలిసి స్వయంగా లబ్దిదారుల గృహాలకు వెళ్లి ఫైనల్ చెకప్ సర్వేలో పాల్గొని సర్వే సిబ్బంది నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. అదేవిధంగా ఎంపీడీవో స్వయంగా లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకుని ఫోటో తీస్తూ ఇందిరమ్మ ప్రత్యేక యాప్ లో పూర్తి సమాచారాన్ని నమోదు చేశారు. కల్లూరు మేజర్ పంచాయతీ పరిధిలో ప్రజా పాలన లో దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులు సమాచారం తెలియజేసినప్పటికీ కొంతమంది అందుబాటులో లేకపోవడం, వివిధ ప్రాంతాల్లో ఉండటం, తదితర కారణాల వలన అలాంటి వారిని పెండింగ్లో పెట్టినట్లుఅధికారులు తెలిపారు తదుపరి ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవో నందిశెట్టి నాగేశ్వరావు తెలిపారు..ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ఖమ్మం పాటి వెంకటయ్య గుండపనేని వేణు ఇందిరమ్మ గృహాల దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో హైదరాబాద్ రైజింగ్





**హైదరాబాద్, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** జీహెచ్ఎంసీ 2024 నగరంలో మౌళిక సదుపాయాలు కల్పన కు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసింది. గతంలో చేపట్టిన వివిధ వ్యూహాత్మక పథకాలకు రూపకల్పన గత ప్రభుత్వం చేసింది. ప్రజా పాలన లో ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం అభివృద్ధితో పాటు ప్రజా సమస్యలు,అవసరాల పరిష్కారం కోసం సంవత్సరంలో పట్టణ అభివృద్ధి కోసం పలు కీలక కార్యక్రమాలను కార్యరూపం దాల్చినట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు.ఈ సందర్భంగా మేయర్ 2024లో జీహెచ్ఎంసీ చేపట్టిన కార్యాచరణ ప్రణాళికలు, సాధించిన వివరాలను తెలిపారు. అభివృద్ధికి మద్దతు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వా సారథి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, రంగారెడ్డి హైదరాంచ్ జిల్లాల ఇంచార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, డి. శ్రీధర్ బాబు సహకరించిన కార్పొరేటర్లు కు నగర్ ప్రజలకుమేయర్ కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో 2025 సంవత్సరంలో గ్రేటర్ అభివృద్ధికి పూర్తి స్థాయిలో అభివృద్ధికి సహరించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి విన్నవించాడు.

### టౌన్ ప్లానింగ్

రోడ్డు అభివృద్ధి కోసం జీహెచ్ఎంసీ రూ.200 కోట్ల తో నాలుగు ప్రధాన రహదారులు రోడ్డు వెడల్పు కార్యక్రమాలను ఈ నిధులతో చేపట్టనున్నారు అందులో దబీర్‌పురా పోలీస్ స్టేషన్ నుండి నాగబౌలి వరకు. షేక్ ఫయజ్‌కమాన్ నుండి దబీర్‌పురా ఫ్లైఓవర్ వరకు (బడా బజార్ నుండి భవానీనగర్ వరకు.) శాస్త్రిపురం జంక్షన్ నుండి ఫలక్‌నుమా బస్ డిపో వరకునాలుగు ప్రధాన రహదారుల విస్తరణ పనులను చేపట్టిందని తెలిపారు.

### జంక్షన్లను మెరుగుపర్చడం

ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్‌లలో 74 జంక్షన్ల అభివృద్ధి పనులు చేపట్టబడ్డాయని,ఈ పనులకు రూ.233 కోట్లను ఖర్చుతో చేపట్టనున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలి



**నిన్నటి వరకు జిల్లాలో 72 % సర్వే పూర్తి**

**సర్వే నత్త నడకన సాగుతుందని ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 31 (జనం సాక్షి):**

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ను వేగవంతం చేయాలని... కొల్చారం మండలంలో నత్త నడకన సాగుతుందని అధికారుల తీరు పట్ల జిల్లా కలెక్టర్ రాహుల్రాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని కొల్చారం మండలం చిన్నగంపూర్ గ్రామంలో
ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్ ద్వారా వివరాలను స్వయంగా నమోదు చేస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ నమోదు చేశారు.
కొల్చారం మండల పరిధిలో చిన్న ఘన్పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్ ద్వారా వివరాలను నమోదు చేస్తున్న తీరును మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సర్వే ఇంటింటి కి వెళ్లి మొబైల్ యాప్ ద్వారా నమోదు చేస్తున్న వివరాలు సంబంధిత డాక్యుమెంట్ల ను సేకరించి మొబైల్ యాప్ ద్వారా అడుగుతున్న అన్ని కాలమ్స్ కరెక్టుగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సర్వేలో మూడు ఫోటోలు తీసుకోవడం జరుగుతుంది ఒకటి ఇంటి యజమాని, రెండవది ఇంటిలోపల, మూడవది ఇంటిబయట సర్వే సరిగా ఇంటిలోపల ఫోటో సరిగా తీయకపోవడం తో స్వయంగా జిల్లా కలెక్టర్ ఫోటో తీసి వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో భాగంగా జిల్లాలో ఒక లక్ష 91 వేల దరఖాస్తులు ప్రజాపాలన పెట్టుకోవడం జరిగిందనీ, నిన్నటి వరకు72% శాతం సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగితా 38% గడువు తేదీలోపు పూర్తి చేయాలనీ సంబంధిత ఎంపీడీవో లు, ప్రత్యేక అధికారులు, నిర్దేశం చేసి ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సర్వేను సర్వేయర్ లు ఎలాంటి పొరపాట్లు జరగకుండా సర్వే చేయాలని, సర్వే చేసేటప్పుడు ఇందిరమ్మ కమిటీ సభ్యులు సహాయ సహకారాలు తీసుకోవాలని, ఇందిరమ్మ కమిటి సభ్యులు తప్పకుండా ఈ సర్వేలో పాల్గొనాలని, సర్వేకు సంబంధించిన ప్రతి అవసరం ఉన్న డాక్యుమెంట్లను ఇంటి సభ్యులు చూపించి సర్వే సాఫీగా జరిగేందుకు సహకరించాలని అన్నారు. అలాగే మున్సిపాలిటీల్లో కూడా ఈ సర్వే పూర్తి చేయాలనీ ఆదేశించారు.
సర్వే అనంతరం ఐదు శాతం ఎంపీడీవో లు మున్సిపల్ కమిషనర్ లు సూపర్ చెక్ చేయడం జరుగుతుందని, సర్వే లో పేరు , వివరాలు, ఫొటో , తదితర సరిగా ఉందా లేదా చెక్ చేసిన తరువాత ప్రభుత్వానికి నివేదికలు పంపించడం జరుగుతుందని, ప్రభుత్వం ఆదేశాల మేరకు మొదటి విడతలో, రెండో విడత లో అర్హులు ఎంత మంది ఉన్నారో వారికి ఇందిరమ్మ ఇల్లు మంజురయ్యే అవకాశం ఉంటుందని ఈ సర్వేకు మీరందరూ సహకరించాలని అన్నారు.ఇందిరమ్మ కమిటీ పంచాయతీ సెక్రటరీలు గడువులోగా సర్వే పూర్తి చేయాలనీ అన్నారు. కొల్చారం మండలం లోని గ్రామాలలో సందర్శించి ఇప్పటి వరకు ఎన్ని నమోదు చేశారని అడిగి తెలుసుకొని, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, తొందరపాటుగా
కాకుండా జాగ్రత్తగా తప్పులు జరుగకుండా నమోదు చేయాలని మొబైల్ యాప్ లో నమోదు తీరును ప్రత్యక్షం గా పరిశీలించి , ఏమైనా సమస్యలున్నాయా అని కలెక్టరు అడుగగా, యాప్ స్పీడ్ గానే ఉందని, ఫోటోలు సేవ్ అవుతున్నాయని సంబంధిత అధికారులు తెలిపారు. యాప్ లో సమస్యల పరిష్కారానికి జిల్లాస్థాయిలో ఈడియం సందీప్ అడిగి సమస్యలను నివృత్తి చేసుకోవాలన్నారు.కలెక్టర్ వెంట కొల్చారం ఎంపీడీవో కృష్ణవేణి, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పిస్తాం





**రాష్ట్ర ఎస్సీ కులాల ఏకసభ్య విచారణ కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్**

**మహబూబ్ నగర్ (జనంసాక్షి)**

షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ పై స్వీకరించిన దరఖాస్తులన్నింటిని క్రోఢీకరించి దానిపై నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పిస్తామని రాష్ట్ర ఎస్.సి కులాల ఏకసభ్య విచారణ కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్ తెలిపారు. మంగళవారం మహబూబ్ నగర్ కు విచ్చేసిన ఆయనకు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు లు అర్%ఢ%బి అతిథి గృహంలో పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం షెడ్యూల్డ్ కులాల విచారణ కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ పై అధ్యయనం నిమిత్తం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా లోని ఎస్.సి కులాలు, కుల సంఘాలు, వ్యక్తులతో బహిరంగ విచారణ నిర్వహించారు.
ఈ సందర్భంగా పలువురు షెడ్యూల్ కులాల సంఘాలు వ్యక్తులు షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ పై దరఖాస్తులను సమర్పించారు.
ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ బహిరంగ విచారణలో స్వీకరించిన దరఖాస్తులు, అభిప్రాయాలు, ఉద్యోగ, విద్య, రాజకీయ, ఆర్థిక రంగంలో ఎస్.సి. కులాలు ఏ విధంగా లబ్ధి పొందుతున్న అంశాలు, స్థితిగతుల పై క్షుణ్ణంగా పరిశీలన, అధ్యయనం చేసి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. దరఖాస్తు సమర్పించే వారందరూ వ్యక్తిగతంగా గాని, సంఘాలు గాని ఎలాంటి ఆటంకం లేకుండా స్వేచ్ఛగా తమ వినతులు సమర్పించాలని కోరారు. కోర్టు జడ్జిమెంట్ పరిగణనలోకి
తీసుకొని వీటన్నింటిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తామని అన్నారు. ఇదివరకు హైద్రాబాద్ రంగారెడ్డి, సంగా రెడ్డి, నల్గొండ, వరంగల్, కరీంనగర్ తదితర జిల్లాలలో బహిరంగ విచారణ నిర్వహించడం జరిగిందని, జిల్లాల సందర్శన సందర్భంగా దరఖాస్తులు సమర్పించలేకపోయిన వారు హైదరాబాద్ లో నేరుగా కమిషన్ కు వారి అభిప్రాయాలను తెలియజేయవచ్చని అన్నారు.
కాగా షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ పై నిర్వహించిన
బహిరంగ విచారణలో 160 మంది వ్యక్తిగతంగా,
కుల సంఘాల పరంగా దరఖాస్తులు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.
అనంతరం చైర్మన్ మహబూబ్ నగర్ పట్టణంలో 11వ వార్డ్ పాత పాలమూరు ఎస్సి.కాలనీ సందర్శించి అక్కడి వీధుల వెంట కాలినడక న పర్యటించి ఎస్సి కాలనీ వాసులతో మాట్లాడి వారి స్థితి గతులు, ఇతర విషయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సి కులాల సంఘాల నుండి అందజేసిన వినతులు స్వీకరించారు. వీరి వెంట రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ అదనపు డైరెక్టర్ శ్రీధర్, రాష్ట్ర కార్యాలయం సుపరింటిండెంట్ సజ్జన్ కుమార్ తదితరులు ఉన్నారు.



# కొత్తగూడెం టూ మహారాష్ట్ర అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ పట్టివేత

**సుమారు 11 లక్షలు విలువచేసే 28 టన్నుల ప్రజా పంపిణీ బియ్యం స్వాధీనం**

**మంథని, (జనంసాక్షి) :**

ఇల్లందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి మహారాష్ట్రకు అక్రమంగా రవాణా చేస్తున్న ప్రజా పంపిణీ బియ్యాన్ని మంథని వద్ద పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే అక్రమంగా ప్రజా పంపిణీ బియ్యాన్ని రవాణా చేస్తున్నారని అందిన సమాచారం మేరకు సోమవారం రాత్రి మంథని ఎస్సై.రమేష్, సిబ్బంది సివిల్ సప్లై అధికారులతో యుక్తంగా మంథని మండలం ఎగ్లాస్పూర్ చెక్ పోస్ట్ వద్ద టీఎస్ 02 యూసి 8458 వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో ప్రజా పంపిణీ బియ్యం 28 టన్నులు 400 ప్లాస్టిక్ సంచులలో వీటి విలువ రూ.10,92,000 కలిగినది ఎటువంటి అనుమతులు లేకుండా రవాణా చేస్తున్నారు. వారి వివరాలు తెలుసుకోగా లారీ డ్రైవర్ నర్రా పెద్దలు మంగళ గూడ గ్రామం,,ఖమ్మం డిస్ట్రిక్ట్, లారీ క్లీనర్ దాసరి బాబు, కిష్టంపేట గ్రామం తాండూరు మండలం, లారీ ఓనర్ అయిన కొలిపాక కిరణ్ కుమార్, రిబ్బన , ఆసిఫాబాద్ గా పోలీసులు గుర్తించారు. ఇల్లందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి మహారాష్ట్రకు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు వారు తెలిపారని, ఇట్టి పిడిఎస్ లారీని పట్టుకొని సివిల్ సప్లై అధికారులకు అప్పజెప్పి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇట్టి అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ లారీని చాకచక్యంగా పట్టుకున్నందుగాను మంథని ఎస్ఐ ని, సిబ్బందిని మంథని సిఐ బి. రాజు ప్రత్యేకంగా అభినందించారు.

# పూర్తయిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్





**హైదరాబాద్ (జనంసాక్షి**

- **2200 కిలోమీటర్ల పైపులైన్, 1.75 లక్షల మ్యాన్ హెూళ్లలో డీ-సిల్టింగ్ పనులు**
- **అధికారులు, సిబ్బందికి సీఎం రేవంత్ రెడ్డి అభినందన**
- **మరో 90 రోజులు డ్రైవ్ పొడిగించాలని ఆదేశం**
- **సమష్టి కృషి వల్లే మంచి ఫలితాలన్న ఎండీ అశోక్ రెడ్డి**

సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ- హైదరాబాద్, ఇంకుడు గుంతల నిర్మాణమే లక్ష్యంగా జలమండలి చేపట్టిన 90 రోజులు స్పెషల్ డ్రైవ్ నేటితో పూర్తయింది. గాంధీ జయంతిన గౌరవనీయులైన ముఖ్యమంత్రి శ్రీ. రేవంత్ రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఈ డ్రైవ్ ప్రారంభమైంది. అప్పటి నుంచి ఈ రోజు వరకు నగరంలోని ప్రాంతాల్లో నిర్విరామంగా డీ-సిల్టింగ్ పనులు నిర్వహించారు. ఫలితంగా ఇప్పటి వరకు ఈ డ్రైవ్ ద్వారా 17050 ప్రాంతాల్లో 2,200 కిలో మీటర్ల సీవరేజ్ పైపులైన్, 1.75 లక్షల మ్యాన్ హెూళ్లలో డీ-సిల్టింగ్ పనులు పూర్తి చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్ ఫలితంగా రోజూ వచ్చే సీవరేజ్ ఫిర్యాదులు 30 శాతానికి తగ్గాయి.ఈ స్పెషల్ డ్రైవ్ విజయవంతం కావడంతో.. సీఎం రేవంత్ రెడ్డి జలమండలి అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ 90 రోజుల్లో మంచి ఫలితాలు రావడంతో ఈ డ్రైవ్ ను మరో 90 రోజులు పొడిగించాలని ఆదేశించారు. ఇదే ఊపును రానున్న రోజుల్లో కొనసాగించి మిగిలిన పైపులైన్లు, మ్యాన్ హెూళ్లలో పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం నాటికి సీవరేజ్ పైపులైన్లు, మ్యాన్ హెూళ్లలో వ్యర్థాలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఈ స్పెషల్ డ్రైవ్ ను ప్రారంభించామన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ విజయవంతం కావడంలో జలమండలి అధికారులు, సిబ్బంది కృషి ఎంతో ఉందని కొనియాడారు. అందరి సమష్టి కష్టం వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ డ్రైవ్ పై సీఎం నుంచి ప్రశంసలు రావడం హర్షణీయమన్నారు. రాబోయే రోజుల్లో ఇంతకు మించి సామర్థ్యంతో కష్టపడతామని చెప్పారు.

# నేడు పోచారం ప్రాజెక్టు నీటి విడుదల వాయిదా



**నాగిరెడ్డిపేట్,డిసెంబర్ 31 జనం సాక్షి...**

మండలంలోని పోచారం ప్రాజెక్టు నీటిని నేడు విడుదల చేయవలసింది ఉండగా అనివార్య కారణాలవల్ల పోచారం ప్రాజెక్టు నీటి విడుదల వాయిదా వేసినట్లు నీటి పారుదల శాఖ డిఈ.వెంకటేశ్వర్లు తెలిపారు.పోచారం ప్రాజెక్టులోని నీటిని ఏ,,జోన్కు రబీ పంటలకు జనవరి ఒకటవ తేదీన సాగునీటిని విడుదల చేయాల్సింది ఉండగా వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.తదుపరి పోచారం ప్రాజెక్టు నీటిని జనవరి 3 లేదా 4వ తేదీలో విడుదల చేయడం జరుగుతుందన్నారు

# గచ్చిబౌలిలో డ్రగ్స్ కలకలం



**పెట్రేగిపోతున్న బార్లు, పబ్బులు**

**పోలీసుల చేతగానితనానికి ఇది నిదర్శనం అంటున్న ప్రజలు**

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 31 (జనంసాక్షి)**

: శేరిలింగంపల్లి ప్రాంతం హైదరాబాద్ విశ్వ నగరానికి ఎంత తోడ్పాటునందిస్తుందో అంతే స్థాయిలో మాదకద్రవ్యాలను వినియోగంలోకి తెస్తూ తెలంగాణ రాష్ట్రంలోనే మత్తు పదార్థాలకు అడ్డాగా మారిన వైనం సామాజికవేత్తలను, మేధావులను ఆందోళనకు గురిచేస్తుంది. అభివృద్ధిలో రాష్ట్రంలోనే ప్రధమ నియోజకవర్గంగా దూసుకుపోతున్న శేరిలింగంపల్లి... అదే సమయంలో మాదకద్రవ్యాలకు, గాంజా సరఫరాకు కేంద్ర బిందువుగా మారుతుండడం ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తున్న అంశం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ ప్రమాణ స్వీకారం రోజునే తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన ఉంటుందని, అవినీతిరహిత, మాదకద్రవ్య రహిత భవ్య తెలంగాణను తెలంగాణ ప్రజలు ఆస్వాదించబోతున్నారని వేదికపై నమ్మబలికిన తీరుకు, ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో నెలకొన్న పరిస్థితులకు అసలు పొంతనే లేదని, శాంతి భద్రతల మాటేమో గానీ... విశ్వ నగరాన్ని డ్రగ్స్ నగరంగా మార్చిన ఘనత తప్పకుండా హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ పోలీసులకే దక్కుతుందని అటు విద్యార్థులు, ఇటు ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. సుదీర్ఘకాలంగా డ్రగ్స్ తో



ఆయా కమిషనరేట్ ల పరిధిలోని కొందరు పోలీసు అధికారులు అంట కాగుతున్నారని, వారి ప్రోత్బలంతోనే నగరంలో యదేచ్ఛగా డ్రగ్స్ సరఫరా కొనసాగుతుందని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. కాంగ్రెస్ పాలకులవి మాటలు మాత్రమే కోటలు దాటుతున్నాయని, చేతలు మాత్రం గడప దాటలేదని శేరిలింగంపల్లి బిజెపి నాయకులు ఎద్దేవా చేస్తున్నారు. వారి ఆరోపణలకు బలం చేకూరేలా నగరం పరిధిలో ప్రతినిత్యం ఎక్కడో ఓ చోట తప్పకుండా మాదకద్రవ్యాలు పట్టుబడుతుండడం, అనేక గంజాయి బ్యాచులు విచ్చలవిడిగా నగరంలో సంచరిస్తూ సాధారణ ప్రజలపై దాడులకు దిగుతుండడం అందరికీ విధితమే.

**గచ్చిబౌలి పబ్ లో తాజాగా డ్రగ్స్ కలకలం... ఎనిమిది మందికి డ్రగ్స్ పాజిటివ్**

తాజాగా శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధి ఓ ప్రముఖ పబ్బులో ఆదివారం రాత్రి పొద్దు పోయాక కొనసాగిన పార్టీలో కొందరు డ్రగ్స్ అని వినియోగించినట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్ఓటి విభాగం పోలీసులు, సైబరాబాద్ క్రైమ్ విభాగం పోలీసులు సదరు పబ్బు పై రాత్రి 11 గంటల తర్వాత దాడి చేయగా పార్టీ జరుగుతున్న తీరు పోలీసుల అనుమానాన్ని మరింత బలపరచడంతో వారు పలువురిని అదుపులోకి తీసుకొని మాదకద్రవ్యాల నిర్ధారణ పరీక్షలను నిర్వహించగా అనూహ్యంగా అందులో 8 మంది డ్రగ్స్ ను వినియోగించినట్లు తేలిందని, ప్రధానంగా గంజాయి, కొకైన్, ఎంఫిటమైన్, మెతాం పెటమిన్ తదితర మాదకద్రవ్యాలను సేవించినట్లు తేలిందని తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో( టిజి న్యాబ్) విభాగం పోలీస్ అధికారులు వెల్లడించారు. అసలు ఆ పబ్బులోకి డ్రగ్స్ ఎలా వచ్చాయో, డ్రగ్స్ సరఫరా వెనుక ఉన్న ముఠా సభ్యులు ఎవరో, తాము ఎంత కఠినంగా వ్యవహరించినా మలక ద్రవ్యాలు నగరానికి ఎలా వస్తున్నాయో అంత చిక్కడం లేదని పోలీసులు వాపోతున్నారు. అనుమానితులందరినీ డ్రగ్స్ నిర్ధారణ పరీక్షలకు పంపించడం జరిగిందని, కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు యాంటీ నార్కోటిక్ బ్యూరో అధికారులు తెలిపారు.

జనంసాక్షి www.janamsakshi.org
బుధవారం 01 జనవరి 2025

# నకిరేకల్ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి

- సంవత్సర కాలంలో 1238 కొట్ల నిధుల మంజూరు
- మీడియా ప్రతినిధుల ముఖాముఖిలో నకిరేకల్ ఎమ్మెల్యే



**నకిరేకల్, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.ప్రజా పాలన ప్రభుత్వం హయాంలో జరిగిన నకిరేకల్ అభివృద్ధిపై మీడియా ప్రతినిధులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నీళ్ళు నియామకాలు నిధులు కోరకై జరిగిన స్వరాష్ట్ర పోరాటంలో అసువులు బాసిన పోరాట వీరులకి వందనాలు తెలుపుతున్నానని అన్నారు.ఎన్నో త్యాగాల ఫలితంగా వచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో గత ప్రభుత్వం ప్రజలని మోసం చేసిందని అన్నారు. గడీల పాలనతో గత బిఆర్ ఎస్ ప్రభుత్వం ప్రజల నమ్మకాలను వమ్ము చేసిందని అన్నారు.గడిచిన పది సంవత్సరాల్లో 7.5 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని విమర్శించారు.తెలంగాణ లో ప్రజాపాలన అవసరమని అందుకే తెలంగాణలో ప్రజా పాలన అధికారంలోకి రావాలని సోనియాగాంధీ ఆకాంక్షించారు.ఇరిగేషన్ ప్రాజెక్టులు పై శాస్త్రీయమైన ఆలోచన విధానాలు లేకపోవడం వల్ల లక్షల కోట్లతో కాళేశ్వరం కడితే కుంగింది. 500 కోట్లతో ఉదయసముద్రాన్ని పూర్తి చేస్తే 10వేల ఎకరాలకు సాగునీరు అందేదని అన్నారు. 10వేల కోట్లు పెడితే నల్లగొండ జిల్లాలోని అన్ని ప్రాజెక్టులు పూర్తి అయ్యేవని అభిప్రాయపడ్డారు. కానీ ఇవేవీ కూడా గత ప్రభుత్వం పట్టించుకోకుండా ఓట్ల కోసం శిలా ఫలకాలలో అభివృద్ధిని చూపించి దోచుకున్నారని విమర్శించారు. పిలాయిపల్లి,ధర్మారెడ్డి కాలువలకు 129కోట్ల రూపాయలు వెచ్చించి ఉదయాసముద్రం కోసం 33కోట్లు మంజూరు చేసి రైతాంగాన్ని అభివృద్ధి చేయాలని కృత నిశ్చయంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని అన్నారు.నల్లగొండ జిల్లాకు పెను శాపంగ మూసీ నీరు ఉందని అందుకే ప్రభుత్వం మూసీ ప్రక్షాళన చేసి నల్లగొండ జిల్లా ప్రజలని ఆదుకోవాలని ఫ్లోరైడ్ బారి నుండి రక్షించాలని ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మూసీ ప్రక్షాళనకు ఎన్ని కొట్లైన ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని కానీ కొన్ని పార్టీలు కావాలనే ప్రజలకి నష్టం చేయాలని ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్నాయన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఇప్పటికే మూసీ ప్రక్షాళన చేయాలని సూచించందని తెలిపారు. దాదాపు మూసీ నీళ్ళతోనే నకిరేకల్ నియోజకవర్గంలో 80శాతం పంట సాగు చేస్తున్నారని అన్నారు. ఐటిపాముల లిఫ్ట్ నీ పూర్తిచేసెలా మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో 100కోట్లకి పైగా నిధులతో జూన్ 2025 వరకు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రణాళిక రూపొందించామని అన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక ఏడాదికాలంలో నకిరేకల్ నియోజకవర్గాన్ని రూ1238 కోట్ల రూపాయలతో అన్ని రంగాలని అభివృద్ధి చేశామని నియోజకవర్గంలోని అన్ని మండలాలను అభివృద్ధి చేస్తానని తెలిపారు. అనంతరం వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పలు అభివృద్ధి, చేయాల్సిన పనుల గూర్చి అడగగా ప్రతి ఒక్కటి విషయానికి సమాధానమిచ్చారు ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంబయ్య, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రజిత శ్రీనివాస్, చిట్యాల, నకిరేకల్ మార్కెట్ చైర్మన్ లు నర్రా వినోద మోహన్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కాటం వెంకటేశం, చిట్యాల నార్కట్పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మీనరసింహ,బత్తుల ఉషయ్య, పట్టణ అధ్యక్షులు జడల చిన్న మల్లయ్య,కౌన్సిలర్లు కోనేటి కృష్ణ బెల్లీ సత్తయ్య, కో ఆప్షన్ సభ్యులు పార్టీ మాధవరెడ్డి, నాయకులు పోకల దేవదాస్, ఇబ్రహీం,అద్దెల లింగారెడ్డి, జిట్టా చిన్నస్వామి,సిలివేరు లింగస్వామి,సిలివేరు మధు, పోకల ఏసు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి





- బాలెంల హైస్కూల్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** సూర్యాపేట రూరల్ పరిధిలో గల బాలెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మంగళవారం సందర్శించారు.ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సిలబస్ నిర్దేశించిన సమయానికి పూర్తి చేసి పదవ తరగతిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించాలని సూచించారు.కంప్యూటర్ ల్యాబ్‌లో ఉన్న 6వ తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు అడగగా విద్యార్థులు చెప్పిన సమాధానాలకి జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. 9వ తరగతి విద్యార్థులకి ఫిజిక్స్ సబ్జెక్ట్ పై పలు ప్రాబ్లమ్స్ వేయగా అందరు ఆ ప్రాబ్లమ్స్ కి సరైన సమాధానం చెప్పగా విద్యార్థులను మెచ్చుకున్నారు. 10వ తరగతి విద్యార్థుల క్లాస్ నోట్స్ పరిశీలించగా రైటింగ్ బాగుందని, ఇంగ్లీష్ లో విద్యార్థులు చక్కగా మాట్లాడటంతో మెచ్చుకున్నారు.విద్యార్థులకి నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాలలో శానిటేషన్ చేసి పరిశుభ్రంగా ఉంచాలని, పాఠశాలకి మరలా వస్తానని తెలిపారు. రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే కంప్యూటర్ లో స్కిల్స్ నేర్చుకుంటే భవిష్యత్ లో ఉన్నత స్థానానికి ఎదగవచ్చున్నారు. కంప్యూటర్ ల్యాబ్ బాగుందని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఈఓ అశోక్, ఎంఈఓ శ్రీనివాస్, ప్రధాన ఉపాధ్యాయులు ప్రసాద్, ఉపాధ్యాయులు సోమశేఖర్, సైదులు, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# సుధా బ్యాంక్‌కు ఐఎస్ఓ సర్టిఫికెట్ ప్రదానం

- అత్యుత్తమ ప్రమాణాల పనితీరుతో గుర్తింపును సాధించిన సుధా బ్యాంక్



**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆరుశాఖలు కలిగి ఉండి, ఇరవై ఐదవ సంవత్సరంలో అడుగుపెట్టిన సుధాబ్యాంకు ఐఎస్ఓ సర్టిఫికెట్ సాధించింది.మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ బ్యాంకులో జరిగిన కార్యక్రమంలో హెచ్ వైఎం అంతర్జాతీయ సర్టిఫికెషన్ సంస్థ ప్రాంతీయ డైరెక్టర్ ఆలపాటి శివయ్య వారి కంపెనీ తరపున ఈ సర్టిఫికెట్ ను బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ కు అందజేశారు.ఈ సందర్భంగా ఆలపాటి శివయ్య మాట్లాడుతూ బ్యాంకు ఎండీ, సిబ్బంది, పాలకవర్గం యెక్క పనితీరు రిజర్వు బ్యాంక్ నిబంధనలకు అనుగుణంగా అన్ని పాలసీలను, సర్క్యులర్స్ ను పాటిస్తున్న సుధాబ్యాంకును నిశితంగా పరిశీలించి ఈ సర్టిఫికెట్ ఇస్తున్నట్లు తెలిపారు.ఈ సర్టిఫికెట్ అత్యుత్తమ సాంకేతికత, సృజనాత్మకత, నవ్యత కలిగి ఉన్న శాస్త్ర పరిశోధన, ఫార్మా, హస్పిటల్స్ సేవారంగాల వారికి ఇస్తామని తెలిపారు. అనంతరం సుధా బ్యాంక్ ఎండీ పెద్దిరెడ్డి గణేష్ మాట్లాడుతూ సిల్వర్ జూబ్లీ వేడుకలు, నూతన సంవత్సర వేడుకలతో పాటుగా ఐఎస్ఓ సర్టిఫికెట్ ఒకే రోజే రావడం అందరికీ ఆనందంగా గర్వం గాను ఉందని తెలిపారు.గత 25 సంవత్సరాలుగా తమ బ్యాంకు ఎన్నో సేవలు అందిస్తూ క్రమశిక్షణతో నిర్విరామంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి మార్పు చేర్పులు చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని అన్నారు. 25 ఏళ్ల కాలంలో ఎన్నో కోపరేటివ్ బ్యాంకులు వచ్చాయని, కొన్ని దివాలా తీసిన సంఘటనలు ఉండగా, తమ బ్యాంకు పాతికేండ్ల ప్రస్థానంలో మరో మైలురాయిని సాధించిందన్నారు.సుధా బ్యాంకు ఐఎస్ఓ సర్టిఫికెట్ సాధించేందుకు సహకరించిన బ్యాంకు ఖాతాదారులకు, అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పోనుగోటి నిర్మల, డైరెక్టర్లు బోనగిరి భాస్కరు, శంకర్ లాల్, ఏపూరు శ్రవణ్ కుమార్, కక్కిరేణి చంద్రశేఖర్, బాణావత్ సుజాత, డాక్టర్ మీలా సందీప్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి రాజా, వస్త్ర వ్యాపారి గండూరి శంకర్, రైస్ మిల్లర్స్ ప్రెసిడెంట్ బోనాల రవీందర్, గాలి శ్రీనివాస్ నాయుడు, పిట్టల వెంకన్న, బోలిశెట్టి మధు, గండూరి రమేష్, పెద్దిరెడ్డి చంద్రశేఖర్, పెద్దిరెడ్డి కృష్ణ, గుండా రమేష్, ప్రొఫెసర్ విద్యాసాగర్, తోట శ్యామ్ ప్రసాద్, బ్యాంకు మేనేజర్లు రవీందర్ రెడ్డి, సైదులు, మాధవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల సుడిగుండంలో కస్తూర్బా

- ప్రభుత్వ విద్యకు గ్రహణం
- బడుగు బలహీన వర్గాల విద్యార్థులు విద్యపై ఇంత నిర్లక్ష్యమా..?
- విద్యా సంవత్సరం ఆరంభం నుండి ఉపాధ్యాయులు లేరు....
- ఇంగ్లీష్, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం సబ్జెక్టులకు అసలు పంతులు లేరు...
- ఇటీవలే గణితశాస్త్రం ఉపాధ్యాయురాలు సెలవులో...
- ఉపాధ్యాయుల సమ్మెతో విద్యార్థులపై మరో పిడుగు
- విద్యార్థుల భవిష్యత్తు ఏమిటి... ఎలా చదువుతారు.... పరీక్ష ఎలా పాస్ అవుతారు
- విద్యార్థులకు చాలీచాలని అన్నం..... గుడ్డు కూడా మాయం....



**మర్రిగూడ, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** సమస్యల సుడిగుండంలో మర్రిగూడ కస్తూరిబా పాఠశాల మరియు జూనియర్ కళాశాల, విద్యా సంవత్సరం ఆరంభం నుండి ఇంగ్లీష్, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం సబ్జెక్టులకు అసలు పంతుల్లే లేరు, ఆరు నెలల నుంచి ఎదురు చూసిన విద్యార్థులకు నిరాశే మిగిలింది, పరీక్షలు సమీపించిన ఉపాధ్యాయులు మాత్రం రాలేదు. ఈమధ్య కాలంలోనే గణితశాస్త్రం ఉపాధ్యాయురాలు కూడా సెలవులులో ఉన్నారు. మరి విద్యార్థులు ఏ విధంగా చదువుతారు పరీక్షలు ఎలా పాస్ అవుతారు, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని అధికారులకు తెలియదా సంవత్సర కాలం నుండి ఇక్కడ ఉపాధ్యాయులు లేరు అనే విషయం, ఆ విద్యార్థుల భవిష్యత్తుఏమిటి?పేదోడి విద్యపై ప్రభుత్వం ఇంత నిర్లక్ష్య వైఖరి దేనికి,ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో ప్రభుత్వ పాఠశాలలో విద్య కొనసాగించడం కష్టంగా మారింది. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతో కస్తూరిబా పాఠశాల పరిస్థితి మరి దారుణంగా తయారైంది, అసలే పరీక్షల సమయం విద్యార్థులకు కీలక సమయంలో ఉపాధ్యాయుల సమ్మెతో బడుగు బలహీన వర్గాల విద్యార్థులు భారీగా నష్టపోతున్నారు, ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించి విద్యార్థులను ఆదుకోవాలని మేధావులు అంటున్నారు. ఇదే అదునుగా భావించిన కాంట్రాక్టర్లు మర్రిగూడ కస్తూరిబా పాఠశాలలో తమకు ప్రభుత్వం నుండి బిల్లులు రాలేదని విద్యార్థులకు చాలీచాలని అన్నం పెడుతూ సోమవారం, మంగళవారం విద్యార్థులకు రోజు పెట్టే గుడ్డును మాయం చేశారు, తక్షణమే పేద విద్యార్థుల కడుపు కొడుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగాలి

- ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ఒకరికొకరు మంచిని పంచుతూ ఐక్యతను పెంచుకుందామన్నారు. అర్ధరాత్రి దాకా రోడ్లపై చక్కర్లు కొట్టకుండా కుటుంబసభ్యులతో వేడుకలు జరుపుకోవాలని సూచించారు.2024 అంతా శూన్యమేనని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆశలే మిగిల్చిందన్నారు. 2025లోనైనా అభివృద్ధికి అడుగులుపడాలని ఆశిద్దామని పేర్కొన్నారు.మార్పు మార్పు అన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేర్ల మార్పుకే పరిమితమైందని,పదేండ్ల కెసిఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి తప్ప కొత్తగా జరిగిందేమి లేదన్నారు.తెలంగాణకు బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని, కెసిఆర్ అనే పదం ప్రజల గుండెల్లో చెరగని ముద్ర అని కొనియాడారు. సూర్యాపేట అభివృద్ధికి నిధులు బందయ్యాయని, ఐటీ హబ్ అడ్రస్ మాయమైందని, హామీల ఊసే కరువైందన్నారు. ప్రజలంతా ఏకమయ్యే సమయం ఆసన్నమైందన్నారు. అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు. 2025 సంవత్సరంలో అందరి జీవితాల్లో మరిన్ని వెలుగులు నిండాలని ఆకాంక్షించారు.

## మర్రిగూడ మండల కేంద్రానికి నిధులు ఎక్కడ..?

- పక్క మండలానికి నిధుల వరుద
- మరి మర్రిగూడ మండల కేంద్రం ఏం పాపం చేసింది..
- సెంట్రల్ లైటింగ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్లకు నిధులు కేటాయించాలి
- బిఆర్ఎస్ మండల నాయకులు చెరుకు శ్రీ రాములు గౌడ్



**మర్రిగూడ, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** మర్రిగూడ మండల కేంద్రానికి నిధులు ఎక్కడ?పక్క మండలానికి వందల కోట్ల రూపాయల నిధులు కేటాయించిన విధంగానే మర్రిగూడ మండలానికి కూడా కేటాయించాలి, మండలానికి నిధులు కేటాయించడంలో మొండి చేయి చూపారని బిఆర్ఎస్ మండల నాయకులు చెరుకు శ్రీరాములు గౌడ్ అన్నారు, మర్రిగూడ మండలానికి నిధులు కేటాయించకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు, మర్రిగూడ మండల కేంద్రంపై వివక్షత చూపుతున్నారని మండల కేంద్రంలో మర్రిగూడ చౌరస్తా నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు సెంట్రల్ లైటింగ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్లకు నిధులకేటాయించాలని అన్నారు, అన్ని రంగాలలో వెనుకబడి ఉన్న మండల కేంద్రాన్ని అధిక నిధులు కేటాయించి అభివృద్ధికి దోహదపడాలని కోరారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు



**కూసుమంచి, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** ఆంగ్ల నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ కొత్త ఆశలు, ఆశయాలు, కొత్త నిర్ణయాలు, కొత్త లక్ష్యాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ప్రతి ఒక్కరూ ఆంగ్ల నూతన సంవత్సరంలో ముందుకు సాగాలని 2025లో ప్రతి ఒక్కరి ఇంటి యందు అభివృద్ధి కాంతులు వెల్లి విరియాలని తెలంగాణ రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షిస్తూ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** పినపాక నియోజకవర్గం ప్రజలకు 2025 నూతన సంవత్సరంలో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. వచ్చే ఏడాదిలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో పినపాక నియోజకవర్గం మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పినపాక నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు, అధికారులకు, ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన కోస్గి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్



**బొంరాస్‌పేట, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం హైదారాబాదులోని ఆయన నివాసంలో ఏర్పుమళ్ళ గ్రామానికి చెందిన కోస్గీ మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ వెంకట్ రాములు గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఆయన వెంట కుమారులు సాయిరాం గౌడ్,సుధీర్ గౌడ్ తదితరులున్నారు.

# డిసెంబర్ నెలలో 107 శాతం ఉత్పత్తి సాధించిన మణుగూరు ఏరియా

- డిసెంబర్ నెలలో 11 లక్షల 58 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి
- వార్షిక లక్ష్యాన్ని చేరుకునేలా ఉద్యోగులు పని చేయాలి - జి ఎం
- వరుసగా అంతరాయం ఏర్పడి తగ్గిన వార్షిక లక్ష్యం..




**మణుగూరు, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** వర్షాకాల ప్రభావం దాంతోపాటు కొండాపురం అండర్ గ్రౌండ్ లో జరిగిన సంఘటనల కారణంగా ఈ ఏడాది అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడంలో కొంత వెనకబడే అవకాశం ఉందని సింగరేణి ప్రధాన అధికారి దుర్గం రామచందర్ పేర్కొన్నారు. మంగళవారం మణుగూరు జిఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. అక్టోబర్ నెలలో మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 11 లక్షల 58 వేల టన్నులకు గాను 12 లక్షల 39 వేల 334 టన్నుల బొగ్గు ఉత్పత్తి అనగా 107 శాతం ఉత్పత్తి సాధించారు. ఏప్రిల్ నుండి డిసెంబర్ వరకు ప్రోగ్రెస్సివ్ బొగ్గు ఉత్పత్తి 92 లక్షల 97 వేల 500 టన్నుల లక్ష్యానికి గాను 85 లక్షల 74 వేల 927 టన్నులు ఉత్పత్తి అనగా 92 శాతం సాధించడం జరిగింది. డిసెంబర్ నెలలో 10 లక్షల 81 వేల 431 టన్నుల బొగ్గు రవాణా అలాగే ఏప్రిల్ నుండి డిసెంబర్ వరకు ప్రోగ్రెస్సివ్ గా 82 లక్షల 35 వేల 210 టన్నులు రవాణా చేయడం జరిగిందన్నారు. అ డిసెంబర్ నెలలో ఓవర్ బర్డెన్ డిపార్ట్ మెంటల్ గా 15 లక్షల 50 వేల క్యూబిక్ మీటర్లకు లక్ష్యానికి గాను 92 శాతం తో 14 లక్షల 7 వేల క్యూబిక్ మీటర్లు తీయటం జరిగింది. అలాగే ఏప్రిల్, నుండి డిసెంబర్ వరకు ప్రోగ్రెస్సివ్ గా 125 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 98 లక్షల 58 వేల క్యూబిక్ మీటర్లు అనగా 79 శాతం ఓబి వెలికి తీయడం జరిగిందనీ తెలిపారు. పదవి విరమణ, మెడికల్ ఉద్యోగులకు, పెన్షన్, గ్రాడ్యుయిటీ,నూతన చేరికలు, మెరిట్ స్కాలర్షిప్ తదితర అంశాలకు సంబంధించిన చెల్లింపులు చేయడం జరిగిందన్నారు. 110 మందికి పదోన్నతి పొందారు. ఇప్పుడున్న షిఫ్ట్ లో పని గంటలు వృదా అవుతుందని మార్పు చేసిన షిఫ్ట్ సమయాలలో మొదటి షిఫ్ట్ లో అల్పహారనికి లో కొంత సమయం పడుతుంది. మిగతా రెండు షిఫ్ట్ లలో పూర్తి పని చేసే అవకాశం ఉందని మార్చటం జరిగిందన్నారు. బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటూ వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునేలా పనిచేయాలని అధికారులకు సూచించారు . ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జియం డి శ్యాంసుందర్ , ఎం ఎన్ జి ఓసీ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస ఛ్చారి, ఏజీఎం సివిల్ డి వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ ఎస్ రమేష్ , డీజీఎం(ఐ ఈ) కె వెంకటరావు , డిజిఎం (ఎఫ్ అండ్ఏ ) ఎం అనురాధ , మెడికల్ సూపరింటెండెంట్ శేషగిరిరావు ఏరియా సెక్యూరిటి అధికారి కె శ్రీనివాస్ , సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## ఒక్కసారిగా దూసుకెళ్లిన షేర్ ధర..!

స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేసే వారికి అలర్ట్. కొన్ని స్టాక్స్ కొన్ని ప్రత్యేక సందర్భాల్లో దూసుకెళ్తుంటాయి. ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, అమ్మకాలపై ఆధారపడి ఇది ఉంటుంది. కొన్ని ప్రకటనలు వస్తే.. ఊహించని రీతిలో డిమాండ్‌తో స్టాక్స్ దూసుకెళ్తుంటాయన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఒక కంపెనీ బోనస్ షేర్లు ప్రకటించగా.. రికార్డు తేదీ దగ్గరపడుతున్న వేళ ఒక షేరు ఇంట్రాడేలో 10 శాతం దూసుకెళ్లింది.

సూర్య రోష్ణి లిమిటెడ్ స్టాక్ మంగళవారం (డిసెంబర్ 31) సెషన్లో అదరగొట్టింది. ఇంట్రాడేలో ఒక దశలో 10 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టి రూ. 617.90 వద్ద గరిష్టాన్ని తాకింది. తర్వాత కాస్త వెనక్కి తగ్గి చివరకు 5.52 శాతం లాభంతో రూ. 592 వద్ద సెషన్ ముగించింది. అంతకుముందు సెషన్లో ఇది రూ. 561.05 వద్ద సెషన్ ముగించింది. ఇక కంపెనీ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. 6.45 వేల కోట్లకు చేరుకుంది. ఈ స్టాక్ 52 వారాల గరిష్ట ధర రూ. 841.65 కాగా.. కనిష్ట ధర రూ. 467.55 గా ఉంది. దీంతో.. ఇవాళ ఒక్కసారిగా దూసుకెళ్లగా.. ఇందులో డబ్బులు పెట్టిన ఇన్వెస్టర్లకు మంచి లాభాలు అందాయని చెప్పొచ్చు. దీని గురించి పూర్తి వివరాలు తెలుసుకుందాం. స్టాక్ ఎందుకు ఒక్కసారిగా ఎగబాకిందో చూద్దాం.

ఫ్యాన్స్, స్టీల్, లైటింగ్, సహా కిచెన్ సామగ్రి, పీవీసీ పైప్స్ వంటి ప్రొడక్ట్స్ తయారుచేసి విక్రయిస్తుంటుంది సూర్య రోష్ణి కంపెనీ. దీని ప్రధాన కార్యాలయం ఢిల్లీలో ఉంది. ఎల్ఈడీ లైట్స్ ఉత్పత్తిలో దేశంలోని అతిపెద్ద కంపెనీల్లో ముందువరుసలో ఉంది. ఇంకా 44 దేశాలకు పైగా తన ఉత్పత్తుల్ని ఎగుమతి చేస్తుంటుంది. ఇక ఈ కంపెనీ ఇటీవలే ఇన్వెస్టర్లకు, షేర్ హోల్డర్లకు బోనస్ షేర్లను ప్రకటించింది. కొద్ది రోజుల కిందట 1:1 నిష్పత్తిలో బోనస్ ఇష్యూ ప్రకటించగా.. ఇందుకు రికార్డు డేట్ 2025, జనవరి 1 గా పేర్కొంది. అంటే ఆలోపు ఈ కంపెనీలో షేర్లు కలిగి ఉన్న వారికి.. బోనస్ షేర్లు వర్తిస్తాయన్న మాట. అందుకే.. ముందురోజు అయిన ఇవాళ (డిసెంబర్ 31) ఒక్కసారిగా కొనుగోళ్లు పెరిగాయి. షేరు ధర కూడా పుంజుకుంది. 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు అంటే.. ఇన్వెస్టర్ల దగ్గర ప్రతి ఈక్విటీ షేరుకు అదనంగా మరో షేరు లభిస్తుంది. అంటే ఉదాహరణకు షేర్ హోల్డర్ 100 షేర్లను కలిగి ఉంటే.. అప్పుడు మరో 100 షేర్లు ఉచితంగానే వస్తాయి. అదనంగా ఎలాంటి పెట్టుబడి పెట్టాల్సిన పని లేదు. అయితే.. దీనికి అనుగుణంగానే షేరు ధర మాత్రం రికార్డు డేట్ తర్వాత తగ్గుతుందని చెప్పొచ్చు. కంపెనీ మార్కెట్ విలువలో కూడా ఎలాంటి మార్పు ఉండదు. కనిష్ట స్థాయిలో షేరు అందరికీ అందుబాటులో ఉండి.. మళ్లీ పుంజుకునే అవకాశం ఉంటుందనే అంచనాతో ఇలా బోనస్ షేర్లను ప్రకటిస్తుంటాయి కంపెనీలు. జనవరి 1 రికార్డ్ డేట్ అంటే.. బోనస్ షేర్లు జనవరి 2న ఇష్యూ చేస్తారు. స్టాక్ ఎక్స్చేంజీలో ఇవి జనవరి 3న లిస్టవుతాయని కంపెనీ స్పష్టం చేసింది. ఈ కంపెనీ బోనస్ షేర్లను ప్రకటించడం ఇదే తొలిసారి.

# 2025లో తులం రూ. 90 వేలకు వెళ్తుందా?

బంగారంపై బంపర్ రిటర్న్స్.. 2025లో తులం రూ. 90 వేలకు వెళ్తుందా? నిపుణులేం చెబుతున్నారు? భారతీయులకు బంగారం అంటే ఎంతో ఆసక్తి ఉంటుంది. మహిళలు దీనిని మంచి అలంకరణగా చూస్తుంటారు. అయితే ఇదే బంగారం పెట్టుబడులకు కూడా మంచి ఆప్షన్. ఎందరో గోల్డ్‌పై ఇన్వెస్ట్ చేస్తుంటారు. ఇక బంగారంలో పెట్టుబడి పెట్టిన వారికి 2024లో 23 శాతం వరకు రాబడి వచ్చింది. మరి వచ్చే ఏడాది కూడా బంగారం ధరలు పెరుగుతాయా.. నిపుణులు ఏం చెబుతున్నారు. చూద్దాం.

బంగారం అంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి. ముఖ్యంగా భారతీయులు పసిడి ప్రియులు. పండగలు.. వివాహాది శుభకార్యాలు.. ఇతర వేడుక ఏదైనా ముందు గుర్తొచ్చేది బంగారమే. సంక్షోభ సమయాల్లో.. అనిశ్చిత పరిస్థితుల్లో ఇది సురక్షిత పెట్టుబడి సాధనంగా పనిచేస్తుంది. ఎన్నో కారణాల వల్ల 2024 సంవత్సరంలో బంగారం ధర భారీగా పెరిగింది. అయితే వచ్చే సంవత్సరం కూడా ఇదే ధోరణి కొనసాగొచ్చని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటిలానే భౌగోళిక, రాజకీయ అనిశ్చిత పరిస్థితులు, ఆర్థిక అస్థిర పరిస్థితులు కొనసాగితే.. దేశీయంగా 10 గ్రాముల బంగారం ధర రూ. 85 వేల వరకు చేరే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. అయితే ఇది రూ. 90 వేలకు చేరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారు.

ప్రస్తుతం దేశీయ మార్కెట్లో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ. 79,350 వద్ద ట్రేడవుతోంది. ఎంసీఎక్స్‌లో (మల్టీ కమొడిటీ ఎక్స్చేంజీ) రూ. 76,600 పలుకుతోంది. అయితే.. బంగారంపై పెట్టుబడులు పెట్టిన వారికి 2024లో మంచి రిటర్న్స్ వచ్చాయి. ఏకంగా 23 శాతం పెరిగింది. అక్టోబర్ 30న రూ. 82,400 వద్ద ఆల్ టైమ్ గరిష్ట స్థాయిని చేరింది. వెండి కూడా 30 శాతం వృద్ధి నమోదు చేయడం విశేషం. ఈ సంవత్సరం మొదటిసారి కిలో వెండి ధర రూ. లక్ష మార్కు దాటింది కూడా. ఇక ఇంటర్నేషనల్ మార్కెట్లో చూస్తే.. ఈ సంవత్సరం ప్రారంభంలో ఔన్సుకు గోల్డ్ 2062 డాలర్ల వద్ద ఉండగా.. ఒక దశలో 2790 డాలర్ల స్థాయికి చేరింది. ప్రస్తుతం అది 2600 డాలర్ల లెవెల్స్‌లో ఉంది.



ప్రస్తుత బాటలోనే 2025లో కూడా గోల్డ్.. మెరుగైన రాబడి అందించే అవకాశముందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుత భౌగోళిక, రాజకీయ అనిశ్చిత పరిస్థితులు సహా కేంద్ర బ్యాంకులు పెద్ద మొత్తంలో గోల్డ్ కొనుగోలు చేస్తుండటం, వడ్డీ రేట్ల తగ్గింపు వంటివి దీనికి కారణంగా చెబుతున్నారు.

2024 సంవత్సరంతో పోలిస్తే పసిడి వృద్ధి కాస్త తగ్గొచ్చని సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్, రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేది చెప్పారు. పరిస్థితులు ఇలాగే ఉంటే.. గోల్డ్ రేటు దేశీయంగా రూ. 85 వేలకు చేరొచ్చని.. ఇంకా రాణిస్తే రూ. 90 వేలకు వెళ్లొచ్చని అన్నారు. వెండి గరిష్ఠంగా రూ. 1.25 లక్షల వరకు వెళ్లొచ్చని అంచనా వేస్తున్నారు.

మరోవైపు తక్కువ వడ్డీ రేట్లు ఉంటే మార్కెట్లోకి లిక్విడిటీ పెరిగి దీంతో డాలర్ బలహీనపడుతుందని.. అప్పుడు గోల్డ్‌కు డిమాండ్ పెరిగి రేట్లు పెరుగుతాయని విశ్లేషించారు త్రివేది. మరోవైపు ఫెడ్ అనుసరిస్తున్న వైఖరితో గోల్డ్ రేట్ల పెరుగుదల కాస్త తగ్గొచ్చని అన్నారు. కామ్ ట్రెండ్జ్ రీసెర్చ్ కోఫౌండర్, సీఈఓ జ్ఞానశేఖర్ త్యాగరాజన్ కూడా ఇదే విధంగా.. వచ్చే ఏడాది బంగారం వృద్ధిలో కాస్త మందగమనం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

నాణేనికి మరో వైపు ఉన్నట్లు.. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నిక కాగా.. ఒకవైపు క్రిప్టో కరెన్సీ బిట్ కాయిన్ పరుగులు పెడుతోంది. ఇంకా బాండ్ల రాబడులు పెరగడం వల్ల మదుపరులు కొందరు బంగారానికి దూరంగా ఉండొచ్చన్న అంచనాలున్నాయి. అప్పుడు రేట్లలో అంతలా పెరుగుదల ఉండకపోవచ్చని అన్నారు.

# కొత్త సంవత్సరంలో హోం లోన్ తీసుకోవాలనుకుంటున్నారా?




సొంత ఇల్లు కొనుగోలు చేయాలన్నా.. కట్టుకోవాలన్నా చాలా మంది లోన్ల కోసం చూస్తుంటారు. చాలా బ్యాంకులు ఇప్పుడు హోం లోన్లు ఆఫర్ చేస్తుంటాయి. అయితే వడ్డీ రేట్లు మాత్రం.. బ్యాంకుల్ని బట్టి వేర్వేరుగా ఉంటాయని గుర్తుంచుకోవాలి. ఇంకా ఎన్నో విషయాల్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఏయే అంశాల్ని పరిశీలించాలో ఇప్పుడు తెలుసుకుందాం.

గృహ రుణం: చాలా మంది ఇంటిని సొంతం చేసుకోవాలనుకునే కలను నెరవేర్చుకునేందుకు బ్యాంకు లోన్‌పై ఆధారపడతారు. అయితే వీరు హోం లోన్ దరఖాస్తు చేసే ముందు కొన్ని విషయాల్ని పరిశీలించాల్సి ఉంటుంది. అవేంటో మనం ఇప్పుడు చూద్దాం. ముందుగా క్రెడిట్ స్కోరు కీలకంగా ఉంటుంది. మీ క్రెడిట్ స్కోరు రుణ దరఖాస్తుపై నేరుగా ప్రభావం చూపుతుందని చెప్పొచ్చు. బ్యాంకులు 700 లేదా అంతకంటే ఎక్కువ స్కోరు కలిగి ఉన్న దరఖాస్తుదారులకు ప్రాధాన్యం ఇస్తాయన్న సంగతి తెలిసిందే. కాబట్టి.. మీ క్రెడిట్ హిస్టరీ, క్రెడిట్ ఇన్ఫర్మేషన్ రిపోర్టును లోన్‌కు దరఖాస్తు చేసే 6 నెలల ముందు నుంచే తప్పనిసరిగా చెక్ చేసుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా హోం లోన్ కోసం దరఖాస్తు చేసినప్పుడు బ్యాంకులు.. దరఖాస్తుదారుల అకౌంట్ స్టేట్‌మెంట్స్ తీసుకుంటాయి. గత 6 నెలల బ్యాంక్ స్టేట్‌మెంట్ ఆధారంగా బ్యాంకులు మీ రీపేమెంట్ సామర్థ్యం అంచనా వేస్తాయి. మీ అకౌంట్ సగటు బ్యాలెన్స్ కనీసం హోం లోన్ ఈఎంఐకి సమానంగా ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది.

చాలా మంది హోం లోన్ తీసుకునేటప్పుడు ఇంటి విలువకు సరిపడా మొత్తం లోన్ పొందొచ్చని అనుకుంటుంటారు. కానీ బ్యాంకులు ఇంటి విలువలో కనీసం 10 నుంచి 20 శాతం మొత్తాన్ని డౌన్ పేమెంట్ చెల్లించాలని అడుగుతాయి. మిగతా మొత్తానికి సరిపడా లోన్ అందిస్తాయి. అందుకే.. ఈ డౌన్ పేమెంట్ మొత్తం సమకూర్చుకునేందుకు ముందు నుంచే పొదుపు చేయడం ఉత్తమం.

ఇక రూ. 50 లక్షల హోం లోన్‌ను 20 ఏళ్ల కాల వ్యవధితో ప్రస్తుత 9 శాతం వడ్డీ రేట్ల ప్రకారం చూస్తే ఈఎంఐ దాదాపుగా రూ. 45 వేలు పడుతుంది. అందుకే.. లోన్ కోసం దరఖాస్తు చేసేటప్పుడు దాదాపుగా ఈ మొత్తాన్ని ఈఎంఐగా చెల్లించేందుకు సిద్ధపడి ఉంటేనే లోన్ కోసం అప్లై చేయాలి. కొన్ని బ్యాంకులు మీ ఇంటి పత్రాల్ని వారి వద్ద డిపాజిట్ చేయమని.. దీని కోసం రిజిస్ట్రేషన్ కూడా చేయించమని కోరుతుంటాయి. దీనినే మెమోరాండమ్ ఆఫ్ డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్స్ అంటారు. లోన్ మొత్తంలో ఇది 0.5 శాతం నుంచి 0.60 శాతం వరకు ఉంటుంది.

మరీ ముఖ్యంగా హోం లోన్ తీసుకునే ముందుగా పలు బ్యాంకులు అందిస్తున్న వడ్డీ రేట్లు, ఆఫర్లను పోల్చుకోవాలి. దీని కోసం సమగ్ర ఆన్ లైన్ పరిశోధన చేయాలి. బ్యాంకులు కొన్ని పండగ సీజన్లలో ప్రాసెసింగ్ ఛార్జీల్ని మాఫీ చేస్తుంటాయి. ఇంకా వడ్డీ రేట్లపైనా డిస్కౌంట్లు ప్రకటిస్తుంటాయి. మరోవైపు ఫ్లోటింగ్ లేదా ఫిక్స్‌డ్ రుణాల వడ్డీ రేట్ల గురించి కూడా స్పష్టంగా తెలుసుకోవాలి. వీటి గురించి ముందుగానే తెలుసుకొని అప్పుడు సరైన లోన్ ప్లాన్ ఎంచుకోవాలి.

# మన్మోహన్ సింగ్ మృతిపై బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధాని సంతాపం..

భారతదేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ డిసెంబర్ 26వ తేదీన తీవ్ర అనారోగ్యం పాలై ప్రాణాలు కోల్పోయిన విషయం అందరికీ తెలిసిందే. అయితే 92 వయసులో చనిపోయిన మాజీ ప్రధాని మృతి పట్ల ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్.. మన్మోహన్ సింగ్ మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారత దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ఆ పూర్తి వివరాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

భారతదేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ డిసెంబర్ 26వ తేదీ రోజు 92 ఏళ్ల వయసులో తీవ్ర అనారోగ్యం పాలై కన్నుమూశారు. ఈయన మృతిపై దేశాధినేతలే కాకుండా.. వివిధ దేశాలకు చెందిన రాజకీయ ప్రముఖులు కూడా స్పందిస్తున్నారు. మన్మోహన్ సింగ్ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భారత్‌తో సత్సంబంధాలు లేని దేశాధినేతలు సైతం భారత మాజీ ప్రధాని ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ.. మన్మోహన్ సింగ్ మంచితనాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్నారు. అయితే తాజాగా ఇదే పని చేశారు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధాని మహమ్మద్ యూనస్. ఆ పూర్తి వివరాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం. 92 ఏళ్ల వయసు కల్గిన మన్మోహన్ సింగ్ డిసెంబర్ 26వ తేదీ రోజు తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. విషయం గుర్తించిన ఆయన కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను ఎయిమ్స్ ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. ఈక్రమంలోనే చికిత్స పొందుతూ మన్మోహన్ సింగ్ మృతి చెందారు. మాజీ ప్రధాని మృతితో దేశంలోని రాజకీయ ప్రముఖులు అంతా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఢిల్లీలోని నిగమ్ బోధ్ ఘాట్‌లో 28వ తేదీన అంత్యక్రియలు నిర్వహించగా.. వేలాది మంది పాల్గొన్నారు. మన్మోహన్ సింగ్‌ను కడసారిగా చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు.

ఆ తర్వాతి రోజే మన్మోహన్ సింగ్ కుటుంబ సభ్యులు ఆయన అస్థికలను యమునా నదిలో కలిపారు. మజ్ను కా తిలా గురుద్వారా సమీపంలోని అష్ట్ ఘాట్ వద్ద సిక్కు సంప్రదాయాలను అనుసరించి.. మన్మోహన్ సింగ్ పెద్ద కూతురు ఉపిందర్ సింగ్ తన తండ్రి అస్థికలను నిమజ్జనం చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం మన్మోహన్ సింగ్ మృతి ఏడు రోజుల పాటు సంతాప దినాలను నిర్వహిస్తోంది. ఈక్రమంలోనే తాజాగా బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్.. మన్మోహన్ సింగ్ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం ఢాకాలోని భారత హైకమిషన్‌లో నివాళులు అర్పించారు. మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేశారు. అనంతరం భారతదేశంలో మొదటి సిక్కు ప్రధాని అయిన మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. మన్మోహన్ సింగ్ ఎంతో సాదాసీదాగా ఉండేవారని, ఆయన చాలా తెలివైన వారంటూ మహమ్మద్ యూనస్ చెప్పుకొచ్చారు. అలాగే సింగ్‌తో తనకు ఉన్న స్నేహాన్ని గుర్తు చేసుకుంటూ ఉద్వేగం చెందారు.



ఆపై భారత దేశాన్ని గ్లోబల్ దిగ్గజంగా మార్చడంలో సింగ్ కీలక పాత్ర పోషించారని వివరించారు. అలాగే హైకమిషన్‌లోని సంతాప పుస్తకంలో సందేశం రాశారు.

# సిగరెట్ తాగేవారికి షాకింగ్ న్యూస్..



సిగరెట్ తాగడం ఆరోగ్యానికి హానికరం అని తెలిసిందే. అయినా కొందరు మాత్రం వాటిని మానేయడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా సిగరెట్లను వదల్లేరు. అయితే సిగరెట్ తాగితే అనారోగ్యమే కాకుండా ఆయుష్షు కూడా తగ్గుతుందని డాక్టర్లు చెబుతూనే ఉంటారు. ఇక తాజాగా ఓ అధ్యయనం సంచలన విషయాలు వెలువరించింది. పురుషులు, మహిళలు ఒక్క సిగరెట్ తాగితే.. జీవితంలో ఎంత సమయం ఆయుష్షు కోల్పోతారు అనేది తేల్చింది. కొత్త ఏడాది అయినా ఈ అలవాటును మానుకోవాలని సూచించింది.

ధూమపానం ఆరోగ్యానికి హానికరం. ఇది డైలాగ్ మాత్రమే కాదు అక్షర సత్యం. ఇక ఇదే వాక్యం.. ప్రతీ సిగరెట్ ప్యాకెట్‌పైనా ముద్రించి ఉంటుంది. అలా ముద్రించాలని ప్రభుత్వాలు.. పొగాకు కంపెనీలకు విధించిన ఆదేశాలు కూడా. అయితే ఇలా ముద్రించినా, సిగరెట్లు తాగితే అనారోగ్యం బారిన పడతామని తెలిసినా.. పొగాకు ప్రియులు మాత్రం వాటిని వదలరు. కొందరు రోజుకు 2, 3 సిగరెట్లు తాగితే.. మరికొందరు చైన్ స్మోకర్లు మాత్రం నిత్యం పెట్టెలకు పెట్టెలు కాల్చేస్తూ.. తమ ఆరోగ్యాలను కూడా పాడు చేసుకుంటున్నారు. ఇక ఏదైనా అనారోగ్యం బారిన పడి ఆస్పత్రికి వెళ్తే.. ఊపిరితిత్తులు చెడిపోయాయని.. సిగరెట్లు పూర్తిగా మానేయాలని లేకపోతే ప్రాణాలకే ప్రమాదం అని చెప్పినా కొందరు పొగరాయుళ్లు మాత్రం వాటిని అస్సలు వదలరు. పురుషులే కాకుండా మహిళలు కూడా నోట్లో సిగరెట్లు పెట్టుకుని పొగను గాల్లోకి వదులుతున్నారు.

అయితే సిగరెట్లు తాగేవారిపై తాజాగా నిర్వహించిన అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెల్లడయ్యాయి. ఒక సిగరెట్ తాగితే మనిషి జీవిత కాలంలో సగటున 20 నిమిషాల ఆయుష్షును కోల్పోతాయని యూనివర్సిటీ కాలేజ్ లండన్ తాజాగా చేపట్టిన అధ్యయనంలో తెలిపింది. అయితే ఈ ఆయుర్దాయం కోల్పోవడం అనేది పురుషులు, మహిళలకు వేరువేరుగా ఉంటుందని పేర్కొంది. పురుషుల కంటే మహిళలు సిగరెట్లు తాగడం మరింత డేంజర్ అని వెల్లడించింది. పురుషులు ఒక సిగరెట్ తాగితే.. వారి జీవిత కాలంలో 17 నిమిషాల ఆయుష్షును తగ్గించుకున్నట్లేనని ఆ అధ్యయనం వెల్లడించింది.

అయితే గతంలో సిగరెట్లు తాగేవారిపై, వారి జీవిత కాలంపై నిర్వహించిన ఎన్నో అధ్యయనాల కన్నా తాజాగా యూనివర్సిటీ కాలేజ్ లండన్ నిర్వహించిన అధ్యయనం ధూమపానం వల్ల నష్టపోయే జీవిత కాలం ఎక్కువని తేల్చడం గమనార్హం. ఇక 20 సిగరెట్లు ఉండే ఒక ప్యాకెట్‌ను ఒక రోజులో తాగితే.. మనిషి జీవితంలో సుమారుగా 7 గంటల జీవిత కాలం తగ్గించుకున్నట్లేనని ఆ అధ్యయనం వెల్లడించింది. ఇక తమ జీవిత కాలం పూర్తిగా మెరుగుపడాలని భావించే వారు ధూమపానాన్ని పూర్తిగా మానేయాలని ఆ అధ్యయనం తెలిపింది. ఇక ధూమపానం వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రతీ సంవత్సరం సుమారు 80 లక్షల మంది మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ-డబ్ల్యూహెచ్ఓ ఇప్పటికే వెల్లడించింది.

**ఇక మహిళల విషయానికి వస్తే.. వారు ఒక సిగరెట్ తాగితే వారి జీవితకాలంలో 22 నిమిషాల సమయాన్ని కోల్పోతారని యూనివర్సిటీ కాలేజ్ లండన్ నిర్వహించిన అధ్యయనంలో తేలింది. ఈ నేపథ్యంలోనే పొగ తాగేవారు ఈ అనారోగ్యకరమైన అలవాటును వీడటం ద్వారా 2025 కొత్త ఏడాదికి శ్రీకారం చుట్టాలని ఈ అధ్యయనం చేసిన పరిశోధకులు సూచించారు.**

# ఫేస్‌బుక్ ప్రియురాలి కోసం పాకిస్థాన్ వెళ్లిన భారతీయుడు..



ప్రేమకు కుల మతాలు మాత్రమే అడ్డు అనుకుంటారు చాలా మంది. కాదు దేశాలు, సరిహద్దులు కూడా అడ్డే అంటున్నారు ఈకాలం కుర్రాళ్లు. ముఖ్యంగా విదేశాలకు చెందిన అబ్బాయిలను, అమ్మాయిలను ప్రేమిస్తూ.. వారిని కలిసేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు. అక్రమంగానైనా సరే దేశం దాటి వెళ్లేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. చివరకు పోలీసులకు చిక్కి ఊచలు లెక్కబెడుతున్నారు. ఈ మధ్య కాలంలో ఇలాంటి ఘటనలు బాగా పెరిగిపోగా.. తాజాగా యూపీకి చెందిన ఓ యువకుడు తన ప్రేమికురాలి కోసం పాకిస్థాన్‌కు వెళ్లాడు. చివరకు ఏమైందంటే..?

ఈమధ్య కాలంలో విదేశాలకు చెందిన అమ్మాయిలు, అబ్బాయిలను ప్రేమిస్తూ.. అనేక మంది పెళ్లిళ్లు కూడా చేసుకుంటున్నారు. ఇద్దరికీ నచ్చిన దేశంలో కాపురం పెట్టి.. తమ ప్రేమను ప్రపంచానికి చాటి చెబుతున్నారు. అలాంటి ప్రయత్నమే చేయబోయాడో భారతీయ యువకుడు. ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా పాకిస్థాన్‌కు చెందిన ఓ అమ్మాయిని ప్రేమించి.. ఆమె కోసం దేశ సరిహద్దులను దాటాడు. ఇప్పటికే రెండు సార్లు ప్రయత్నం చేసి ఓడిపోయిన ఇతగాడు.. తాజాగా పాకిస్థాన్‌లోకి అడుగు పెట్టాడు. వెంటనే వెళ్లి తన ప్రియురాలిని కలుసుకున్నాడు. ఇన్నాళ్లూ తన మనసులో దాచుకున్న ఊసులన్నీ చెప్పాలనుకున్నాడు. కానీ చెప్పకుండానే ఆగిపోయాడు. కాదు ఆగిపోవాల్సి వచ్చింది. ఎందుకో తెలియాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే. ఉత్తర ప్రదేశ్‌లోని అలీగఢ్‌కు చెందిన 30 ఏళ్ల బాదల్ బాబుకు గత కొన్ని సంవత్సరాల క్రితం ఫేస్‌బుక్‌లో ఓ అమ్మాయి పరిచయం అయింది. ఆమె ఎవరు, ఎలా ఉంటుందో కూడా తెలియక ముందు నుంచే ఆమెతో స్నేహం ప్రారంభించిన బాబు.. ప్రతిరోజూ ఆమెతో మాట్లాడేవాడు. ఆమె మెసేజ్ చేయనిది, ఫోన్ చేయనిదే అతడికి రోజు కూడా గడిచేది కాదు. అంతలా ఆమెకు ఆకర్షితుడు అయిన బాబు ఓ మంచి రోజు చూసుకుని తన ప్రేమ విషయం చెప్పాడు. ఆమెకు కూడా బాబు నచ్చడంతో ఓకే చెప్పింది. ఈక్రమంలోనే తాను పాకిస్థాన్‌కు చెందిన అమ్మాయిని అని వివరించింది.

అయినా సరే బాబు ఆమెను ప్రేమిస్తూనే వచ్చాడు. చాలా రోజులుగా మెసేజ్‌లు, ఫోన్ల ద్వారా ప్రేమించుకుంటున్న వీళ్లకు ఒకరినొకరు కలిస్తే బాగుండు అనిపించింది. దీంతో బాబు ప్రేయసిని కలిసేందుకు పాకిస్థాన్ వెళ్లాలనుకున్నాడు. కానీ తన వద్ద వీసా, ప్రయాణ పత్రాలు ఏమీ లేవు. అయినా సరే ప్రేయసిని కలవాలని గట్టిగా నిర్ణయించుకున్న అతడు.. అక్రమంగా పాకిస్థాన్‌లోకి ప్రవేశించాలనుకున్నాడు. ఇప్పటికే రెండు సార్లు ప్రయత్నం కూడా చేశాడు. కానీ విఫలం అయ్యాడు. అయినా పట్టుదల వీడని బాబు.. తను ప్రేమించిన అమ్మాయి కోసం రిస్క్ చేసి మరీ ఈసారి పాకిస్థాన్ బోర్డర్ దాటేసాడు. నేరుగా బహాఉద్దీన్ నగరానికి వెళ్లిపోయాడు. అదే విషయాన్ని ప్రియురాలికి చెప్పగా ఆమె వచ్చి కలిసింది. ఇద్దరూ కలిసి కాసేపు ఊసులాడుకున్నారు. కానీ అంతలోనే అక్కడకు పోలీసులు వచ్చారు. బాబు ఏదో తేడాగా కనిపించేసరికి.. ఆధారాలు చూపించమన్నారు. ఇలా అతడు భారత్ నుంచి వచ్చినట్లు తెలుసుకుని డిసెంబర్ 27వ తేదీన అరెస్ట్ చేశారు. అక్రమంగా దేశంలోకి చొరబడ్డందుకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

ఈక్రమంలోనే అతడు తన ఫేస్‌బుక్ ప్రేమాయణం గురించి చెప్పి ఆమెను కలిసేందుకే పాకిస్థాన్ వచ్చినట్లు వివరించాడు. ఇదంతా విన్న న్యాయస్థానం బాబుకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించి, సమగ్రంగా దర్యాప్తు చేయమని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. విచారణను 2025 జనవరి 10వ తేదీకి వాయిదా వేసింది. అయితే పోలీసులు మాత్రం నిజంగానే బాబు తన ప్రేయసి కోసమే దేశం దాటి వచ్చాడా, లేక ఎవరైనా చెబితే వచ్చాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# లోయర్ మానేరు జలాశయం నుంచి ఆయకట్టుకు నీటి విడుదల

**స్విచ్ ఆన్ చేసి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి.**





**కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 31 (జనం సాక్షి) :**

యాసంగి సీజన్ కు గాను లోయర్ మానేరు జలాశయం నుంచి కాకతీయ కెనాల్ ద్వారా ఆయకట్టుకు సాగు నీటి విడుదలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం ప్రారంభించారు. జలా శయం నీటిలో పూలను చల్లి రెగ్యులేటర్ గేట్ వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం స్విచ్ ఆన్ చేసి కెనాల్ కు నీటి విడుదల ప్రారంభించారు. ఆయకట్టు విస్తీర్ణం, జలాశయం సామర్థ్యం, విడుదల చేస్తున్న నీటి కెపాసిటీ గురించి నీటిపారుదల శాఖ ఎస్.ఈ పెద్ది రమేష్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నీటి విడుదల కొనసాగించాలన్నారు. యాసంగి సీజన్ కు గాను మొత్తం 44.480 టి.ఎం.సిల నీటిని విడుదల చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఎస్.ఈ రమేష్ తెలిపారు. మొత్తం 6 లక్షలా 97 వేలా 708 ఎకరాలకు వచ్చే మార్చి 31 వరకు నీటి విడుదలను కొనసాగిస్తామని తెలిపారు. జోన్ 1, జోన్ 2 పరిధిలో ఉన్న ప్రాంతాలకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీటి విడుదలను కొనసాగిస్తామన్నారు. రోజుకు 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామని తెలిపారు. 11 టీఎంసీల నీటిని మధ్య మానేరు ద్వారా, ఐదు టీఎంసీల నీటిని ఎస్సారెస్పీ ప్రాజెక్టు ద్వారా సేకరించి విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం లోయర్ మానేరు జలాశయంలో 22.870 టిఎంసిల నీటి నిలువ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ నాగభూషన్ రావు, డి.ఈ శ్రీనివాస్, ఏఏఈలు వంశీధర్, దీపిక, సంజన, కిరణ్ పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో సర్దార్ రవీందర్ సింగ్ ప్రచారం



**కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 31 (జనం సాక్షి) :**

మంగళవారం రోజు నగరంలోని పలు ప్రయివేట్ విద్యాసంస్థల లో సర్దార్ రవీందర్ సింగ్ తన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ప్రచారంలో మాజీ మేయర్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ... ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో ఉన్నటువంటి పట్టభద్రులు నన్ను దీవించి గెలిపించాలని వారు కోరారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ కోసం వచ్చే నాయకుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎందుకంటే నేడు కొందరు కేవలం తమ వ్యాపారాల కోసమే ముందుకు వచ్చి ఎన్నికలలో పోటీ ముందుకు వస్తున్నారని కానీ నేను మాత్రం విద్యార్థి దశనుండి పేద బడుగు బలహీన వర్గాల కోసం పనిచేస్తున్నాను కౌన్సిలర్‌గా, కార్పోరేటర్, మేయర్ గా ఎప్పుడూ అవకాశం వచ్చిన ప్రజలకు దగ్గర ఉండి వారికి కావల్సిన మౌలిక వసతుల కల్పన కోసం పని చేశానన్నారు. కరీంనగర్ ప్రజల కోసం రూపాయి పథకాలు రూపొందించడం జరిగిందని, ఇప్పుడు నన్ను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఈ నాలుగు జిల్లాలో ఉన్న పట్టభద్రులకు కేవలం ఒక్క రూపాయికే హెల్త్ ఇన్సూరెన్స్ పథకం తీసుకువస్తాను అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యోగ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, శాతవాహన యునివర్సిటీ జెఏసి చైర్మన్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# వన్య జంతువుల సంరక్షణ పై చేసిన పరిశోధనకు పిహెచ్‌డి పట్టా...

**బంజారా ముద్దు బిడ్డ కు దక్కిన అరుదైన గౌరవం**

**గాంధారి డిసెంబర్ 31 (జనం సాక్షి)**





అతనో సామాన్య గిరిజన కుటుంబంలో పుట్టిన గిరిజన ముద్దు బిడ్డ, తల్లిదండ్రులు శంకర్ నాయక్, దంపతులు గినీ భాయి, గాంధారి మండల లొకతాండ గ్రామం చెందిన సురేందర్, తన జాతి మూలాలకు ఆవాసమైన గిరులు, కొండలు, గుట్టలలో జీవించే వన్య జాతుల సంరక్షణ కొరకు ఏదైనా మేలు చెయ్యాలని చిన్నతనం లోనే ప్రతిన పూని, జంతు వైవిధ్య పరిరక్షణకై అధ్యయనం చెయ్యడానికి నల్గొండ జిల్లాలోని ప్రధాన సమస్యగా ఉన్న మైనింగ్, యురేనియం ప్రతిపాదిత క్షేత్రంలో డాక్టర్, వాసుదేవరావు, ప్రిన్సిపాల్ సైంటిస్టు ఆధ్వర్యంలో పరిశోధన జరిపి యురేనియం తవ్వకాల ద్వారా వాతావరణంలో ఏర్పడే మార్పు వల్ల జీవ వైవిధ్యం, జంతువులకు వాటిల్లే హాని, తద్వారా వాటి ఉనికి కోల్పోయే ప్రమాదం ఉన్నదని గ్రహించి, వాటిని ఏ విధంగా కాపాడాలి, వాటికి కావాల్సిన ఆహారం, ఆవాసం, వాటి ప్రాణాలకు హాని తలపడకుండ పాటించవలసిన జాగ్రత్తలు, సూచనలు తన పరిశోధన ద్వారా తెలియజేశారు, తన అధ్యయనం ద్వారా సమర్పించిన సహేతుకమైన సూచనలు ఆమోదించబడటం తో జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ, హైదరాబాద్ వారు ఆయన పరిశోధనకు గుర్తింపును ఇచ్చి, గౌరవ డాక్టరేట్ ను అందజేస్తున్న సందర్భంగా తన పరిశోధన సమయంలో ప్రొఫెసర్ జితేందర్ నాయక్ జంతు శాస్త్ర అధ్యాపకులు, ఉస్మానియా యూనివర్సిటీ సురేందర్, ప్రతిపాదనను మెచ్చుకొని అభినందించారు. సామాన్య గిరిజన కుటుంబంలో పుట్టి గ్రామీణ ప్రాంతాము నుండి ఉన్నత స్థాయికి ఎదిగి అత్యున్నతమైన పట్టా అందుకుంటున్న సందర్భంగా సురేందర్, ను పలువురు మెచ్చుకుంటున్నారు. జీవవైవిధ్యం, సంరక్షణ, వాతావరణంలో మార్పు సరైన సూచనలు అనే అంశాల పైన జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అనేక పరిశోధన పత్రలు ప్రచురించారు. తెలంగాణ రాష్ట్రం నుండి ఈ అంశంలో పరిశోధన చేసి పట్టా అందుకున్న మొదటి వ్యక్తి సురేందర్ కావడం గమనార్హం, ఒకటి నుండి 5 వ తరగతి వరకు
గాంధారి ప్రాథమిక పాఠశాలలో చదివిన ఆయన ఆరవ తరగతి నుండి ఉప్పల్వాయి గురుకుల పాఠశాలలో చదువుకున్నాడు, ఇంటర్ మాతృశ్రీ కాలేజీలో చదివి, డిగ్రీ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామారెడ్డిలో ఫారెస్ట్రీ విభాగంలో పూర్తి చేసి మాస్టర్ డిగ్రీ చెన్నై లోని భారతిధాశన్ విశ్వవిద్యాలయం నుండి పొందారు. అనంతరం భారత మంత్రిత్వ శాఖ, అటవి వాతావరణ మార్పు విభాగంలో సీనియర్ సైంటిస్టు అదనపు డైరెక్టర్ గా నాగపూర్ లో విధులు నిర్వర్తిస్తున్నారు.
వారి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

## పదవి విరమణ పొందిన ఏఆర్ ఎస్సై మిర్జా హాసన్ అలీ బేగ్



**ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికిన కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి.**

**కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 31 (జనం సాక్షి) :**

కరీంనగర్ కమీషనరేట్ మోటార్ ట్రాన్స్పోర్ట్ విభాగంలో డ్రైవర్ గా పనిచేస్తూ పదవీకాలం ముగిసిన మిర్జా హాసన్ అలీ బేగ్ దాదాపు 42 సంవత్సరాల సుదీర్ఘ కాలంపాటు పోలీసు శాఖకు సేవలందించి మంగళవారంనాడు పదవి విరమణ పొందారు. పదవి విరమణ పొందుతున్న ఏ.ఆర్.ఎస్సై మిర్జా హాసన్ అలీ బేగ్ కి పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి పూలమాలవేసి
శాలువాతో సత్కరించారు. వారికి జ్ఞాపిక అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ.లక్ష్మీనారాయణతో పాటుగా రిజర్వు ఇన్స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి (సంక్షేమం), కుమారస్వామి(ఎం.టి.ఓ.), ఉమ్మడి జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సై మామిడాల సురేందర్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్ హెచ్ పనులను అడ్డుకున్న గ్రామస్తులు

**ముత్తారం డిసెంబర్ 31(జనంసాక్షి)**



జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ముత్తారం మండలంలోని లక్కారం, సర్వారం గ్రామాల్లో అధికారులు చేపట్టిన ఎన్ హెచ్ ట్రెంచ్ పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. మంగళవారం రోజున జెసిబి సహాయంతో ట్రెంచ్ పనులు చేపట్టేందుకు అధికారులు రావడంతో గ్రామస్తులు అడ్డుకొని పనులను జరగనివ్వలేదు. జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కొల్పోతున్న తమకు ఇంకా ఎలాంటి నష్టపరిహారం చెల్లించలేదని వాపోయారు. పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాకే పనులను జరగనిస్తామని, అప్పటి వరకు తమ భూముల్లో ఎలాంటి పనులు చేపట్టేందుకు వీలు లేదని కరాకండిగా చెప్పారు. దీంతో అధికారులు చేదేమీ లేక వెనుదిరిగారు.

# కరీంనగర్ ట్రినిటీ జూనియర్ కళాశాలలలో ఘనంగా నూతన వేడుకలు

**నూతన వేడుకలు ప్రారంభించిన ట్రినిటీ కళాశాలల పౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి.**

**కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 31 (జనం సాక్షి) :**



ట్రినిటీ జూనియర్ కళాశాలు కరీంనగర్‌లో నూతన సంవత్సర వేడుకలు అత్యంత వైభవంగా, సందడిగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి లు హాజరయ్యారు. కళాశాలల ప్రిన్సపాల్స్, సిబ్బంది, విద్యార్థులు, ఇతర అథితులు ఉత్సాహభరితంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల విద్యార్థులు నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనతో ప్రారంభించారు. విద్యార్థుల ప్రతిభ కనువిందు చేయగా, వారి కళాప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.
ఈ సందర్భంగా, ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి, విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. ఆయన తన ప్రసంగంలో గత సంవత్సరం మిమ్మల్ని ఎలా ప్రభావితం చేసిందో విశ్లేషించండి. మీరు చేసిన తప్పులను గుర్తించి వాటి నుండి పాఠాలు నేర్చుకోండి. ప్రతి అనుభవం మీకు కొత్త అవకాశం తీసుకురావడం ఖాయం, అని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు.
మనం ఎదుర్కొనే ప్రతికూలతలు ఎప్పటికీ శాశ్వతం కావు. మంచి రోజులపై నమ్మకాన్ని ఉంచండి. ఉత్తమమైనది తప్పకుండా జరుగుతుంది. నూతన సంవత్సరం మీ జీవితంలో కొత్త ఆశలను నింపుతుందిని వివరించారు. విద్యార్థులు తమ భవిష్యత్తు పై దృష్టి సారించి కష్టపడి ముందుకు సాగాలని, కాలేజ్ మేనేజ్‌మెంట్ ఎల్లప్పుడూ వారితో ఉన్నట్లు భరోసా ఇచ్చారు. చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల విజయమే మా కళాశాలల లక్ష్యం అని మీ ప్రతి అడుగులో మేము మీతో ఉంటాం, మీరు ఎల్లప్పుడూ మిమ్మల్ని మీ తల్లిదండ్రుల గర్వకారణాలుగా మార్చుకోవాలని కోరుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు తమ లక్ష్యాలను నిర్దేశించుకోవడం, వాటి వైపు నిబద్ధతతో కృషి చేయడం అవసరమని పిలుపునిచ్చారు.
ఈ వేడుకలలో విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నాట్యాలు, పాటలు, డ్రామాలు, ఇతర ప్రదర్శనలు, విద్యార్థులను ఉత్సాహభరి తంగా ఉంచాయి. ఈకార్యక్రమం చివరిలో, అందరూ ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అందరూ నూతన సంవత్సరానికి మంచి ఆశయాలను వ్యక్తం చేస్తూ, కొత్త లక్ష్యాలను సెట్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు, సిబ్బంది, అతిథులందరూ ఈ వేడుకలలో పాల్గొని కళాశాల జ్ఞాపకార్థమైన కొత్త సంవత్సరం వేడుకలను మరింత గుర్తుండిపోయేలా చేశారు.

## మల్లాపూర్ మండలంలో ని సాతరంలో ఉన్న ఇసుక రిచ్ వాగును పరిశీలించిన .

**-జిల్లా కలెక్టర్ బి, సత్య ప్రసాద్**

**మల్లాపూర్ డిసెంబర్ 31(జనం సాక్షి)**



మల్లాపూర్ మండలం లోని సాతారం గ్రామ ఇసుక రిచ్ వాగులను ఆర్డీవో శ్రీనివాస్ తో కలిసి మంగళవారం రోజున పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పాలసీ ప్రకారం మాత్రమే ఇసుక రవాణా జరగాలని తెలిపారు. అక్రమ ఇసుక రవాణా జరగకుండా పక్కాగా చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి భద్రత ఏర్పాటు చేయాలని మైనింగ్ అధికారులకు ఆదేశించారు.
ఏర్పాటు చేసిన ఇసుక రిచ్ ల ద్వారా మాత్రమే ఇసుక రవాణా చేయాలని తెలిపారు.
అలాగే తహసీల్దార్ ల సిబ్బంది అక్రమ ఇసుక రవాణా జరగకుండా ఎప్పటికపుడు నిఘా ఉంచాలని తెలిపారు. అలాగే అధికారుల సమన్వయం చేసుకుంటూ అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వాహనాలు పట్టుకుని సీజ్ చేయాలని అధికారులకు సూచించారు.
కలెక్టర్ వెంట, ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా మైనింగ్ అధికారి జై సింగ్ తహసిల్దార్, ఎంపీడీవో, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలి

**వీణవంక ఎస్ఐ తోట తిరుపతి.**

**వీణవంక డిసెంబర్ 31 (జనంసాక్షి)**



వీణవంక మండల సంబంధించిన ప్రజా ప్రతినిధులకు,అధికారులకు, విద్యార్థులు, యువకులు,మేధావులకు రైతులకు వీణవంక ఎస్ఐ తోట తిరుపతి నూతన సంవత్సర శుభాకాంక్షలు ముందస్తుగా తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ తోట తిరుపతి మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా మండల కేంద్రంలో మండలంలోని ఆయా గ్రామాలలో ఎలాంటి ఈవెంట్స్ ఏర్పాటు చేయడం కానీ గుంపులుగా ఉండి వేడుకల నిర్వహించడం కానీ చేయకూడదన్నారు. రాత్రివేళల ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ మిగతా ప్రజలకు ఇబ్బందికరంగా ప్రవర్తించినట్లయితే వారు ఎంతటి వారైనా చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. నూతన 2025 సంవత్సరాన్ని కుటుంబ సభ్యుల సమక్షంలో సంతోషకరమైన వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని కోరారు.

## ఈటెలను కలిసిన పోతరవేని క్రాంతి

**మంథని, (జనంసాక్షి)**



మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ను శామీర్ పేట్ లోని వారి నివాసం లో మంగళవారం బిజెపి పార్టీ పెద్దపల్లి జిల్లా అధికార ప్రతినిధి పోతారు వెళ్లి క్రాంతి కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపిన గురుద్వారాల ప్రతినిధులు

**మంథని, (జనంసాక్షి)**



: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై అసెంబ్లీలో సంతాప తీర్మానం చేసినం దుకు పలు గురుద్వారాల ప్రతినిధులు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను మంగళవారం కలిసి ధన్యవాదాలు తెలిపారు.
సీఎం రేవంత్ రెడ్డి తో పాటు, అన్ని పార్టీల శాసన సభ్యులకూ వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లాలో శాంతి భద్రతలు మరింత పటిష్టం



**జిల్లాలో ఎవరైన గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు**

**2024 జరిగిన వార్షిక నేరాలను ప్రవేశపెట్టిన ఎస్పీ**

**ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి (జనంసాక్షి)**

అదిలాబాద్ జిల్లాలో పోలీసుల శాంతి భద్రతలు మరింత పటిష్టం చేయడం జరుగుతుందని అదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి 2023, 2024 సంవత్సరంలో జరిగిన నేరాల జాబితాను వివరించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పోలీసులు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారానారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా నిత్యం విధులను ముమ్మరం చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా జిల్లాలో గంజాయి మహమ్మారి పై ప్రత్యేకంగా దృష్టి సారించడం జరిగిందన్నారు. ఎవరైనా అక్రమంగా గంజాయి సాగు చేసిన, దానిని సరఫరా చేసిన అటువంటి వ్యక్తులపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుంది అని తెలిపారు. శాంతి భద్రతల కపాడడమే పోలీసుల లక్ష్యం అన్నారు. ఇటీవల దేశ ప్రధాని నరేంద్ర మోడీ జిల్లా పర్యటనలో పర్యటించిన సందర్భంగా ఎటువంటి సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి నిఘా పెట్టడం జరిగిందన్నారు. ఇది విజయవంతంగా భావిస్తున్నామన్నారు. అదే విధంగా రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనలో పోలీసులు గట్టిభద్రతా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. 2023 సంవత్సరంలో వివిధ కేసులకు సంబంధించి మొత్తం 4188 కేసులు నమోదు కాగా 2024 సంవత్సరంలో వివిధ రకాల కేసులు 2492 కేసులను నమోదు చెయ్యడం జరిగిందని అన్నారు అదే విధంగా సైబర్ నేరాలు పట్ల ప్రజలు మోసపోకుండా జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రజలకు మరింత దగ్గర అయ్యేందుకు పోలీసుల ఆద్వర్యంలో వివిధ రకాల కార్యక్రమాలు చేడుతున్నమన్నారు. రాబోవు రోజుల్లో నిఘా వ్యవస్థను మరింత పటిస్తవంతం చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏ ఎస్పీ లు, ఇంకా డీ ఎస్పీ లు పాల్గొన్నారు

# బాలికల జూనియర్ కాలేజీ, హైస్కూల్ నిర్మాణానికి అనుమతులు

**5.98 కోట్లతో నిర్మాణ పనులు**

**ఫలించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు, మంత్రి కొండా సురేఖ కృషి**

**వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 31 (జనం సాక్షి)**





వరంగల్ స్టేషన్ రోడ్ లోని కృష్ణ కాలనీలో వున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, హై స్కూల్ లకు నూతన బిల్డింగ్ నిర్మాణం చేపట్టడానికి త్వరలో పనులు ప్రారంభించకపోతున్నట్లు మాజీఎమ్మెల్సీ కొండా మురళి ప్రకటించారు.
మంగళవారం కృష్ణ కాలేజీ హై స్కూల్ ను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కొత్త భవన నిర్మాణానికి మురళీధర్ రావు కృషి చేశారు. రూ. 5.98 కోట్ల సిఎస్ఆర్( కార్పోరేట్ సోషల్ రెస్పాన్స్ బిలిటి) నిధులతో రూపుదాల్చనున్న నూతన భవనం నిర్మాణానికి అనుమతులు రావడంతో విద్యార్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. సెక్రటేరియట్ లో మంత్రి సురేఖ ను కలిసిన ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ శరద్మతి, హై స్కూల్ హెడ్ మాస్టర్ అశోక్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండా మురళీధర్ రావు ప్రత్యేక చొరవతో వరంగల్ జిల్లా స్టేషన్ రోడ్ లోని కృష్ణ కాలనీలో వున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, హై స్కూల్ లకు త్వరలో నూతన బిల్డింగ్ కాంప్లెక్స్ రూపుదిదుకోనుంది. గత ఆగస్టు నెలలో ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, హై స్కూల్ ను తనిఖీ చేసిన మురళీధర్ రావు గారు 70 ఏళ్ళకు పైగా సేవలందిస్తూ వస్తున్న ఆ విద్యాలయాలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా పరిశీలించారు. గోడలు, తరగతి గదులు మన్నికను కోల్పోయి, పెచ్చులూడి, వర్షపు నీటి నిల్వతో దుస్థితికి చేరుకున్న తీరును, విద్యార్థుల పడుతున్న బాధలను స్వయంగా తెలుసుకుని, పాత బిల్డింగ్ స్థానంలో నూతన బిల్డింగ్ నిర్మాణం చేపట్టి, విద్యార్థులను కష్టాలను తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈ దిశగా అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే శ్రీమతి కొండా సురేఖ గారు స్వయంగా దృష్టి సారించి, కార్యాచరణను ప్రారంభించారు. ఇందుకు అవసరమైన నిధులను సిఎస్ఆర్ (కార్పోరేట్ సోషల్ రెస్పాన్స్ బిలిటి) ద్వారా సమీకరించి, త్వరలో నూతన బిల్డింగ్ నిర్మాణ పనులను ప్రారంభించేందుకుగాను కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. జూనియర్ కాలేజీ నిర్మాణానికి రూ. 4.5 కోట్లు, హై స్కూల్ నిర్మాణానికి రూ. 1.48 కోట్లతో మొత్తం రూ. 5.98 కోట్లతో వీటి కోసం నూతన భవన నిర్మాణాన్ని చేపట్టనున్నారు.

# పత్తి నాయక్ తండ గ్రామాన్ని అమీనాబాద్ గ్రామంలో విలీనం చేయవద్దు





**గ్రామసభలో అధికారులు, పోలీసులతో వాగ్వివాదం**

**చెన్నారావుపేట, డిసెంబర్ 31 (జనం సాక్షి)**

మండలంలోని పత్తి నాయక్ తండ గ్రామాన్ని అమీనాబాద్ గ్రామంలో విలీనం చేయవద్దని పత్తి నాయక్ తండ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అమీనాబాద్ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పత్తి నాయక్ తండ గ్రామానికి చెందిన కొందరు గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పత్తి నాయక్ తండ గ్రామపంచాయతీని రద్దుచేసి అమీనాబాద్ గ్రామపంచాయతీలో కలపాలని జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవికి వినతి పత్రాన్ని అందించారు. మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు మండల అధికారులు అమీనాబాద్ గ్రామంలో గ్రామ సభను నిర్వహించారు. కొందరు పత్తి నాయక్ తండ వాసులు తమ గ్రామ పంచాయతీని అమీనాబాద్ గ్రామంలో విలీనం చేయవద్దని యధావిధిగా పత్తి నాయక్ తండా గ్రామాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కొందరు రాజకీయ నాయకులు కావాలనే పత్తి నాయక్ తండ గ్రామాన్ని అమీనాబాద్ గ్రామంలో విలీనం చేయాలని చూస్తున్నారని అధికారులను అడ్డుకోవడంతో కొద్దిసేపు గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో స్థానిక ఎస్ఐ రాజేష్ రెడ్డి పోలీస్ సిబ్బందితో అమీనాబాద్ గ్రామానికి చేరుకొని ఎలాంటి గొడవలు జరగకుండా చెదరగొట్టారు. దీంతో అధికారులు, పోలీసులతో పత్తి నాయక్ తండ వాసులు వాగ్వివాదానికి దిగారు. అనంతరం ఎస్ఐ రాజేష్ రెడ్డి గ్రామస్తులకు నచ్చజెప్పి శాంతియుతంగా ఉండి సమస్యను పరిష్కరించుకోవాలని అంతేకాక సంబంధిత అధికారులకు సహకరించాలని కోరారు. దీంతో గొడవ సద్దుమణిగింది.

# ప్రజలకు సత్వర న్యాయం

**రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్**

**మంచిర్యాల ప్రతినిధి డిసెంబరు 31 (జనంసాక్షి)**




ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపట్ల పోలీసులు కఠినముగా వ్యవహారించాలని, అలాగే ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి సత్వర న్యాయం జరుగుతుందని భరోసా కల్పించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నాడు మంచిర్యాల జిల్లా మందమర్రి సర్కల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీల్లో భాగంగా రామగుండం సిపి, మంచిర్యాల డీసీపీ భాస్కర్ తో కలిసి తనిఖీ చేశారు . మందమర్రి పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ కు పోలీస్ అధికారులు మొక్కను అందజేసి స్వాగతం పలకి సాయుధ పోలీసులు గౌరవ వందనం చేశారు .అనంతరం
పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. పోలీస్ స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరును పరిశీలించడంతో పాటు ప్రతి దరఖాస్తు పై తప్పనిసరిగా పిటిషన్ మేనేజ్మెంట్ లో అప్లోడ్ చేసి రిసిప్ట్ ఇవ్వాలని వచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం జరిగిందని పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# అడవి బిడ్డలకు నూతన వస్త్రాలు, పాదరక్షలు



**ఏటూరునాగారం, డిసెంబర్ 31(జనంసాక్షి)**

గ్రామీణ ప్రాంత అడవి బిడ్డలకు మంగళవారం ఏటూరునాగారం మండలంలోని కొమరం భీమ్ నగర్ ఆదివాసీ గుత్తి కోయ అడవి బిడ్డలకు ములుగు ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు, ఏటూరు నాగారం ఏ ఎస్పీ శివం ఉపాధ్యాయ సూచనల మేరకు సిఐ అనుముల శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్సై ఏటూరు నాగారం తాజుద్దీన్ 2024 జ్ఞాపకాలను వదిలి 2025 నూతన సంవత్సరంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంలో ఆదివాసీ గుత్తి కోయ అడవి బిడ్డల జీవితాలలో నూతన వెలుగులు విరజిల్లాలని నూతన సంవత్సరంలో వారికి వారి కుటుంబ సభ్యులందరికీ శుభం కలగాలని కోరుతూ గుత్తి కోయ కుటుంబాలకు నూతన సంవత్సర పర్వదినాన్ని పురస్కరించుకొని నూతన వస్త్రాలు, పాదరక్షలు పంపిణీ చేశారు. గతాన్ని మర్చిపోయి నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలతో ఉండాలని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులకు సహకరించకూడదని వారికి ఆశ్రయం కల్పించకూడదని. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన సహకరించిన చూస్తూ ఊరుకునేది లేదని చర్యలు తీసుకుంటామని తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు. గూడాలలోకి అనుమానస్పదంగా కొత్త వ్యక్తులు సంచరించినట్లయితే తమకు సమాచారం అందించాలని అన్నారు. ఎలాంటి అవాంఛనీయా సంఘటనలు జరగకుండా. గొడవలు అల్లర్లు సృష్టించకుండా శాంతియుత వాతావరణం లో నూతన సంవత్సరం వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రాత్రి 12 తర్వాత రోడ్లపై మద్యం సేవించి సంచరించిన డీజేలు అల్లర్లు గొడవలు సృష్టించిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్. సిఆర్పీఎఫ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ లో తృతీయ స్థానం

**మైనారిటీ కళాశాల విద్యార్థిని రేష్మ**

**ములుగు/వెంకటాపూర్,డిసెంబర్31 (జనం సాక్షి):**



అక్టోబర్ 25 నుండి 28న హన్మకొండ జేఎన్స్ స్టేడియంలో నిర్వహించిన ఎస్జీఎఫ్ఐ ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ అండర్ 19 బాలికల విభాగంలో వెంకటాపూర్ మైనారిటీ కళాశాల విద్యార్థిని 100 మీటర్ల రన్నింగ్ లో ఎస్కే రేష్మ ఎంపికై ఈ నెల 30,31న జింఖానా గ్రౌండ్ హైదరాబాద్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్జిఎఫ్ఐ అథ్లెటిక్స్ 100 మీటర్లలో తృతీయ స్థానంలో నిలిచిందనీ ప్రిన్సిపల్ ఎస్.వందన, పిడి టి.నవ్య, కళాశాల బృందం రేష్మను అభినందించారు.

# ములుగు జిల్లా క్రైం రేటు పెరిగింది




**గతేడాది 1597 కేసులు.. ఈయేడు 2148 కేసులు**

**వెల్లడించిన ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్**

**ములుగు బ్యూరో,డిసెంబర్31 (జనం సాక్షి):**




ములుగు జిల్లాకి సంబందించిన "వార్షిక ప్రెస్ మీట్" కార్యక్రమం ను ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్.పి 2024 సంవత్సరం లో జరిగిన నేరాలు,నిందితులకు పడిన శిక్షలు, ఎన్ఫోర్స్మెంట్ వర్క్,నేరాల నియంత్రణ కు తీసుకొన్న ప్రత్యేక చర్యలు తదితర అంశాల పై మాట్లాడడం జరిగింది. గత సంవత్సరంతో పోల్చి చూసుకుంటే జిల్లాలో క్రైం రేటు పెరిగిందని, నేరస్తులకు నేరానికి తగ్గ శిక్షలు విధించడంలో పూర్తిగా సఫలీకృతం అయింది.జిల్లాలోని 375 సిసిటివి కెమెరాలని కలిపి కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం ద్వారా నేరాల తగ్గింపు మరియు కేసులని ఇన్వెస్టిగేషన్ చేయడం సులభతరం అయింది.2024 సంవత్సరం లో ముఖ్యంగా విసిబుల్ పోలీసింగ్ ద్వారా చట్టవిరుద్ధంగా ట్రాన్స్ పోర్ట్ చేస్తున్న పిడిఎస్ రైస్, ఇసుక మరియు గంజాయిని అరికట్టడం జరిగినది. దీనిలో భాగంగా 59 కిలోల గంజాయిని పట్టుకోవడం జరిగినది.
అంతేకాక ఎఫ్ ఐ ఆర్ నమోదులో ఎటువంటి తారతమ్యలని ఉపేక్షించడం లేదు.గత సంవత్సరంలో జిల్లా పరిధిలో 1597 కేసులు నమోదవ్వగా, ఈ సంవత్సరం డిసెంబర్ 27 వరకు 2148 కేసులు నమోదు అయ్యాయని, ఎస్పి వివరించారు.2024 సంవత్సరం లో రేప్ కేసులు 2023 సంవత్సరం కన్నా తక్కువగా నమోదు అయ్యాయని,ఎస్పి వివరించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, భరోసా సెంటర్ ఏర్పాటు, రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో నివారణా చర్యలు చేపట్టి రోడ్డు ప్రమాదాలను నివారించగలిగామని, జిల్లాలో ఆంటీ డ్రగ్ అవేర్నెస్ లో భాగంగా యువతకి క్రికెట్ అండ్ వాలీబాల్ టోర్నమెంట్ లని నిర్వహించి వారికి మత్తు వల్ల కలిగే నష్టం ని
తెలియజేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పి శివం ఉపాధ్యాయ,ములుగు అదనపు ఎస్పీ సదానందం,డీఎస్పీ డిసిఆర్బి కిశోర్ కుమార్,ములుగు డీఎస్పీ రవీందర్,ఎస్బి ఇన్స్పెక్టర్ అజయ్,సిసిఎస్ ఇన్స్పెక్టర్ రమేష్ ,సిఐ శ్రీనివాస్,సిఐ రవీందర్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పంట మార్పిడితో అధిక దిగుబడులు

**జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి**



**వరంగల్ ప్రతినిధి: డిసెంబర్ 31( జనంసాక్షి)**

రాబోవు వ్యవసాయ సీజన్లో వేసిన పంట వేయకుండా పంట మార్పిడి చేస్తూ అధిక ఉత్పత్తులు సాధించేలా అధికారులు చర్యలు చేపట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి అన్నారు. జిల్లాస్థాయి ప్రణాళిక కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అధ్యక్షతన జరిగిన సమావేశంలో హార్టికల్చర్, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, ఫిషరీస్ అగ్రికల్చర్ ఆయా సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం, మొక్కజొన్న, పప్పు ధాన్యాలు, మిరప, డ్రైఫ్రూట్స్, కూరగాయలు, పండ్ల తోటల పెంపకం, పచ్చి రొట్టా , పూల తోటలు తదితర పంటలు పెంచేందుకు 2,88,486 ఎకరాల్లో పంట విస్తీర్ణం కలదని జిల్లా కలెక్టర్ అన్నారు.జిల్లా లోని వానకాలం సీజన్ 2024-25 సంవత్సరాల కు సంబందించిన జిల్లాలో వ్యవసాయ సాగు భూముల్లో ఒక్కే రకమైన పంట కాకుండా పంట మార్పిడికి ప్రాధాన్యత ఇవ్వాలి సంబంధిత శాఖల అధికారులకు సూచిస్తూ అట్టి పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల స్థాయి కమిటీల ద్వారా సేకరించిన పంటల వివరముల ననుసరించి జిల్లా స్థాయి కమిటీ నివేదికలు ద్వారా వివరాలు సేకరించి పంట విస్తీర్ణ కమిటీ మీటింగ్ సమక్షంలో నివేదికలు సమర్పించి కమిటీ ఆమోదించనైనదని జిల్లా ప్రణాళిక శాఖ అధికారి గోవిందరాజన్ అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు ఉమారాణి, వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, ఉద్యానవన శాఖ అధికారి సంగీతలక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పసికదు మృతదేహం లభ్యం

**షాద్ నగర్ (జనంసాక్షి)**



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చటాన్ పల్లి శివారులో మృతి చెందిన మగ శిశువు మృతదేహం లభ్యమైంది మృతదేహాన్ని రోడ్డుపైకి కుక్కలు తీసుకురాగా అటుగా వెళ్తున్న పాదాచారులు గమనించి కుక్కలను తరిమికొట్టారు పుట్టగానే చనిపోవడంతో రోడ్డు పక్కన పొదల్లో పడేసి ఉంటారని అనుమాన వ్యక్తం చేస్తున్నారు స్థానికులు ఘటనపై 94 బిఎన్ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు..

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
01 జనవరి 2025

# సంక్రాంతి పండుగకు 6432 ప్రత్యేక బస్సులు

- 557 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం
- జిల్లాల నుంచి హైదరాబాద్ కు ఎలక్ట్రిక్ బస్సులు ప్రత్యేకం
- ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా టీజీఎస్‌ఆర్టీసీ ఏర్పాట్లు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సంక్రాంతి పర్వదినం సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే వారి కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్‌ఆర్టీసీ) యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రయాణికులకు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు 6432 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. అందులో 557 సర్వీస్ లకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. గత సంక్రాంతికి 4484 ప్రత్యేక బస్సులను ప్లాన్ చేయగా.. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 5246 బస్సులను సంస్థ నడిపింది. గత సంక్రాంతి అనుభవం దృష్ట్యా ఈసారి 6432 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. జనవరి 9వ తేది నుంచి 15 వ తేది వరకు ఈ ప్రత్యేక బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. హైదరాబాద్ లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి, తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసేలా ప్రత్యేక అధికారులను నియమించింది. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ప్రధానంగా అమలాపురం, కాకినాడ, కందుకూరు, నర్సాపురం, పోలవరం, రాజమండ్రి, రాజోలు, ఉదయగిరి, విశాఖపట్నం, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, విజయవాడ, శ్రీశైలం, తిరుపతి, తదితర ప్రాంతాలకు ఈ బస్సులు నడుస్తాయి. అలాగే, తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి తిరుగుపయనమయ్యే వారి కోసం కూడా ప్రత్యేక బస్సులను సంస్థ ఏర్పాటు చేసింది. ఈ సంక్రాంతికి కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ నుంచి ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంచేలా ప్లాన్ చేస్తుంది. సంక్రాంతి ఆపరేషన్స్ టీజీఎస్‌ఆర్టీసీకి ఎంతో కీలకమని, ఆ మేరకు పూర్తిగా సన్నద్ధం కావాలని క్షేత్రస్థాయి అధికారులకు ఇప్పటికే టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం సూచించింది. హైదరాబాద్ లోని రద్దీ ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పండల్స్, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం అమల్లో ఉంటుందని తెలిపింది. తమ ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని వివరించింది. ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకర ప్రయాణం చేయొద్దని ప్రజలకు సూచించింది. సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వారు టీజీఎస్‌ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరింది. ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ ను **www.tgsrtcbus.in** వెబ్ సైట్ లో చేసుకోవాలని పేర్కొంది. ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 సంప్రదించాలని సూచించింది.

# అడ్డగోలు హామీలతో మోసం

- రైతులను రాబందుల్లా దోపిడీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



**హైదరాబాద్, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అన్ని వర్గాలను నట్టేట ముంచుతుందని బీఆర్‌ఎస్ సీనియర్ లీడర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. రైతులకు రైతుబంధు డబ్బులు జమ చేయకపోగా కాంగ్రెస్ రాబందులు ఉల్టా రైతులనే దోపిడీ చేస్తున్నారని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. జోగులాంబ జిల్లా ఐజ మండలంలో ఆర్డీఎస్ కెనాల్ కింద పండించిన వరి ధాన్యాన్ని గవర్నమెంట్ ఐకేపీ సెంటర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. చాలా చోట్ల మహిళా సమాఖ్య అధ్యక్షురాళ్ల అకౌంట్‌ను తమ గుప్పిట్లో పెట్టుకొని ఇదే అదనుగా ఐకేపీ సెంటర్ల దగ్గర కాంగ్రెస్ నాయకులు రైతులను పెద్ద ఎత్తున మోసం చేస్తున్నారు. క్వింటాల్‌కు నాలుగు కిలోల చొప్పున తక్కువ తూకం వేస్తున్నారని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఒక ఎకరం 30 క్వింటాలు దిగుబడి వస్తుంది.. కావున క్వింటాల్‌కి నాలుగు కిలోల చొప్పున తీసివేస్తే ఒక ఎకరం మీద రైతు రూ. 3500లు నష్టపోతున్నారు. మళ్లీ హమాలీ పేరిట క్వింటాల్ చొప్పున రూ. 46 వసూలు చేస్తున్నారు. ఈ లెక్క ప్రకారం సగటున ఒక ఎకరానికి ఐకేపీ సెంటర్ల ద్వారా గవర్నమెంట్‌కి విక్రయిస్తే రూ. 4880లు రైతులు నష్టపోతున్నామని ఇక్కడి రైతులు ఆవేదన చెందుతున్నారని ఆర్‌ఎస్పీ పేర్కొన్నారు. కేసీఆర్ గవర్నమెంట్‌లో ఎకరాకు పెట్టుబడి సహాయంగా రూ. 5000 అందజేస్తే రేవంత్ రెడ్డి గవర్నమెంట్‌లో ఉల్టా ఎకరాకు రూ. 4880 నష్టపోతున్నారు. మొత్తం రైతుల నుండి దోచుకున్న సొమ్ము ఎకరాకు దాదాపు పదివేల రూపాయలన్న మాట! ఇట్ల గుట్టు చప్పుడు కాకుండా తెలంగాణ రైతులను ఇంకా ఎన్ని చోట్ల దోచుకుంటున్నారో ఈ కాంగ్రెసు కేడీలు! ఒక కన్నేసి ఉంచండి. రైతన్నలారా, తస్మాత్ జాగ్రత్త!! అని హెచ్చరించారు.

# మండలి సమావేశం జరపకపోవడం బాధాకరం

- సిఎం రేవంత్ రెడ్డికి మధుసూధనాచారి లేఖ



**హైదరాబాద్, డిసెంబర్31 (జనంసాక్షి) :** దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలిపే క్రమంలో మండలి సమావేశం ఏర్పాటు చేయకపోవడం విచారకరమని తెలుపుతూ..రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి బహిరంగ లేఖ రాశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలిపేందుకు శాసన మండలిని సమావేశపరచక పోవడం భాధాకరమని మధుసూదనాచారి తన లేఖలో పేర్కొన్నారు. పెద్దల సభకు సుదీర్ఘ కాలం పని చేసిన మన్మోహన్ సింగ్‌కు రాష్ట్రంలోని పెద్దల సభ సంతాపం తెలిపితే సముచితంగా ఉండేదని ఆయన తెలిపారు. ఇది తన అభిప్రాయం కాదు శాసనమండలి హృదయ వేదన అని మధుసూదనాచారి పేర్కొన్నారు. శాసన మండలిని చిన్న చూపు చూడటం తగదు. భవిష్యత్‌లో ఇలాంటి తప్పులు పునరావృతం కాకూడదు అని రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే మధుసూదనాచారి సూచించారు.

# డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో సినీతారలు

- ఆలోచింప చేసేలా ప్రభాస్ సందేశం



**హైదరాబాద్, డిసెంబర్31 (జనంసాక్షి):** డ్రగ్స్‌పై సినీతారలు స్పందించాలన్న ఇసెం సూచన మేరకు పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ అవగాహన వీడియో ఇపుడు ఆలోచింపజేస్తుంది. మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమానికి మద్దతు తెలుపుతూ రెబల్ స్టార్ ప్రభాస్ ఇచ్చిన సందేశం ఇపుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. 'లైఫ్ లో మనకి బోలెడన్నీ ఎంజాయ్ మెంట్స్ ఉన్నాయి.. కావలసినంత వినోదం ఉంది.. మనల్ని ప్రేమించే మనుషులు.. మన కోసం బ్రతికే మనవాళ్ళు మనకి ఉన్నప్పుడు.. ఈ డ్రగ్స్ అవసరమా డార్లింగ్స్?.. ఈరోజు నుండి డ్రగ్స్ కి గుడ్ బై చెప్పండి.. మీకు తెలిసిన వారెవరైనా డ్రగ్స్ కి బానిసలైతే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వగలరు'అంటూ ప్రభాస్ తెలిపారు. అయితే, డ్రగ్స్ రహిత సమాజం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ మహా కార్యంలో టాలీవుడ్ హీరోలు, హీరోయిన్స్ తమ సందేశాలను వీడియోల ద్వారా తెలుపుతున్నారు. అయితే, మరికొన్ని గంటల్లో 2024కు ఎండ్ కార్డ్ పడనుంది. కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు అందరిలో ఉత్సాహం మొదలైంది. ఈ క్రమంలో ప్రభుత్వం, పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎందుకంటే, తాగి నడుపుతూ ప్రమాదాలు, డ్రగ్స్ తీసుకుని అత్యాచారాలు ఎక్కువ అవుతున్నాయి. కనుకే, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, నడుచుకోవాలని జాగ్రత్త చెబుతూ.. హెచ్చరిస్తున్నారు.

# పాన్‌కార్డు-2 అప్‌గ్రేడేషన్ పేరుతో మోసాలు

- సైబర్ ఫ్రాడ్ లింక్‌లపై అప్రమతంగా ఉండండి
- సంగారెడ్డి సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ నూకల వేణుగోపాల్‌రెడ్డి



**హైదరాబాద్, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** ప్రస్తుతం ఉన్న పాన్ కార్డును డిజిటల్ కార్డ్‌గా అప్‌గ్రేడ్ చేయాలనే కేంద్ర ప్రభుత్వ యోచన, పాన్ 2.0 సైబర్ మోసాలకు కొత్త మాధ్యమంగా మారే అవకాశం వుందని సంగారెడ్డి సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ నూకల వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. పాన్ కార్డ్ అప్‌గ్రేడ్ పేరుతో ప్రజలను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు ప్రయత్నిస్తున్నారని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం ఇంకా ప్రారంభం కాలేదని, ఈ విషయంలో ఎవరైనా సంప్రదిస్తే, ముందుగా ఆదాయపు పన్ను శాఖ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి, దీని ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోండి అని ఏదయినా సైబర్ మోసానికి గురిఅయితే వెంటనే 1930 నంబర్ కి కాల్ చేయాలని సూచించారు. లేదా https://cybercrime.gov.inలో వెంటనే ఫిర్యాదు చేయొచ్చని, అలాగే సమీప పోలీస్ స్టేషన్ లో కుడా పిర్యాదు చేయవచ్చని సూచించారు. నేరస్తుడు, బాధితుడు తరచుగా వివిధ రాష్ట్రాలకు చెందినవారని, ఈ ముప్పును అరికట్టడం కష్టంగా ఉంటుందని, ముందస్తు అవగాహన నే సైబర్ నేరాల నివారణకు శ్రీరామ రక్ష అని ప్రజలకు సూచించారు.

# చెరువు ఆక్రమణల కూల్చివేత





- భగీరథమ్మ - తౌతాని కుంటలో 10 ఆక్రమణల తొలగింపు


**హైదరాబాద్, డిసెంబరు 31 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి మండలంలో మంగళవారం హైడ్రా కూల్చివేతలు ప్రారంభించింది. ఖాజాగూడ - నానక్ రామ్ గూడ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న భగీరథమ్మ, తౌతానికుంట చెరువుల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగించింది. స్థానికుల ఫిర్యాదుల మేరకు క్షేత్ర స్థాయిలో గతవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్, బఫర్ జోన్లలో ఆక్రమణలు జరిగినట్టు అధికారులు నిర్ధారించారు. కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు మంగళవారం 10 ఆక్రమణల వరకు కూల్చివేతలు ప్రారంభించారు. రేకుల షెడ్లలతో పాటు రేకులప్రహరీ నిర్మించి ఆక్రమణలు చేసినట్టు గుర్తించారు. నోటీసులు అందజేసిన తర్వాత కూల్చివేతలు ప్రారంభించారు. కూల్చివేతలతో 10 ఎకరాలవరకూ ప్రభుత్వ, చెరువు భూముల స్వాధీనం చేసుకున్నారు.

# సైనిక్ స్కూళ్ల ఏర్పాటుకు కృషి చేయండి

- ఆకునూరి మురళికి వినోద్‌కుమార్ లేఖ

**హైదరాబాద్, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** సైనిక్ స్కూల్స్ ఏర్పాటు పై విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి కి బోయినపల్లి వినోద్ కుమార్ లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు పై గత ప్రభుత్వం తీసుకున్న చర్యలు, ప్రస్తుత ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు సూచిస్తూ లేఖలో పలు అంశాలు ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రంలో సైనిక్ స్కూల్స్ ఏర్పాటు ప్రయత్నాల నేపథ్యం, ఆవశ్యకత, అందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చేపట్టాల్సిన చర్యలను వినోద్ కుమార్ కమిషన్ చైర్మన్ మురళికి వివరించి లేఖను అందజేశారు.

# కోసాయి కొండల్లో పొడుస్తున్న పొద్దు



ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కోసాయ్ ఆదివాసిగూడెం అడవుల్లో తీసిన పొడుస్తున్న పొద్దు
ఫొటో : లింగంపల్లి కృష్ణ, ఆదిలాబాద్

# శ్రీశైలం ప్రాజెక్టుపై పెత్తనానికి బాబు ఎత్తులు

- నీటిని తరలించుకు పోయే కుట్రలు
- మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్, డిసెంబర్ 31 (జనంసాక్షి) :** శ్రీశైలం ప్రాజెక్టుపై పెత్తనం చలాయించి నీళ్లను తరలించుకు పోయేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలమూరు- రంగారెడ్డికి జాతీయ హోదా ఇస్తామని చెప్పిన ప్రధాని మోడీ ఇప్పుడు ఆ ఊసే ఎత్తకపోవడం విడ్డూరమన్నారు. ఇంత అన్యాయం జరుగుతున్నా ఇదే జిల్లాకు చెందిన సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. ప్రాజెక్టును పూర్తిచేస్తే ఉమ్మడి మహబూబ్‌నగర్ సస్యశ్యామలం అవుతుందని, సీఎంకు చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని, ఏపీ ప్రభుత్వంతో చర్చించాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి ఉద్యమిస్తా మని హెచ్చరించారు. కార్యాచరణ ప్రకటిస్తామని తేల్చిచెప్పారు. బీఆర్‌ఎస్ పాలనలో 90 శాతం నిర్మించిన పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడంపై కాంగ్రెస్ సర్కారు నిర్ల క్ష్యం వహిస్తున్నదని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. రేవంత్ ఏడాది పాలనలో ప్రతి పక్షాలు, రైతులపై కేసులు పెట్టడం, డైవర్షన్ డ్రామాలు తప్ప సాధించిందేమీ లేదని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ హయాంలో పర్యావరణ, అటవీ అనుమతులు సాధించి, అహోరాత్రులు శ్రమించి నిర్మించిన ప్రాజెక్టు ద్వారా నీళ్లు వచ్చే పరిస్థితి లేదని మీడియాలో దుష్ప్రచారం జరగడం ఆందోళన కలిగిస్తున్నదని వాపోయారు. ఏపీ సర్కారు ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసినా, కేంద్రం డీపీఆర్‌ను వెనక్కి తీసుకున్నా రేవంత్‌రెడ్డి ఎందుకు పట్టించుకోవడంలేదని నిలదీశారు.

# విద్యార్థులతో మంత్రి ఉత్తమ్ భోజనం

- ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో నూతన సంవత్సరానికి స్వాగతం





**చిలుకూరు,డిసెంబర్ 31 (జనంసాక్షి) :** నూతన సంవత్సరం సందర్భంగా హుజూర్‌నగర్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వేడుకలు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేసిన మంత్రి, వారితో మాట్లాడుతూ, నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ హృదయపూర్వక క్షణాలను పంచుకున్నారు. విద్యాభ్యాసం చేస్తూ కుటుంబాలకు దూరంగా జీవిస్తున్న బడుగు,బలహీన వర్గాల విద్యార్థులకు సంతోషం కలిగించే లక్ష్యంతో ఆయన పర్యటన ఆలోచనాత్మకంగా మారింది. విద్యార్థులు చేసిన వినతి మేరకు మంత్రి ఉత్తమ్ తన ఎమ్మెల్యే నిధుల నుంచి కళాశాల ఫర్నీచర్‌కు రూ.10 లక్షలు, లైబ్రరీ పుస్తకాలకు రూ.5 లక్షలు, క్రీడా సౌకర్యాల మెరుగుదలకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ పాఠశాలలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు మరియు ఇతర అన్ని నేపథ్యాల విద్యార్థులకు జాతీయ స్థాయిలో పోటీని ఎలా అందిస్తాయో ఆయన వివరించారు. నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి, విజయానికి సమాన అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేస్తుంది అన్నారు. విద్య మరియు పాఠ్యేతర కార్యకలాపాలకు అత్యాధునిక మౌలిక సదుపాయాలకు హామీ ఇచ్చే ప్రభుత్వ ప్రధాన ప్రాజెక్ట్, “యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ లు” గురించి మంత్రి హైలైట్ చేశారు. రూ.200 కోట్లతో గడ్డిపల్లిలో నిర్మిస్తున్న ఈ పాఠశాలల్లో మొదటిది రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్ విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలుస్తుంది. ప్రాజెక్ట్ యొక్క మొదటి దశలో 28 పాఠశాలలు ఉంటాయని, మరో 26 ఫేజ్2లో ప్రణాళిక చేయబడుతుందని ఆయన పంచుకున్నారు.









Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370